ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 8 మే 2023 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి


ఫొటో : SSB గిరా

సాహిత్య ప్రస్థానం
మే 2023
సంపుటి : 4 సంచిక : 8

# నో చరిత్ర, నో సైన్స్, నో రైట్స్ ...

**'ఓ** మహాత్మా.. ఓ మహర్షి .. ఓ క్షమా పీయూష వర్షీ ..' అని గాంధీజీ శత జయంతికి గీతం రాశాడు శ్రీశ్రీ. గాంధీజీ హంతకుడిలో దేశభక్తిని చూపిస్తూ ఆయన హత్య వెనక వున్న భావజాలాలనూ, వాటికి మూలమైన సంస్థల పేర్లను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించిన అఘాయిత్యంపై ఏ కవిత రాసేవారో!

'తాజి విడువలేదు రాజసంబు అని జాషువా రాస్తే.. తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అని ప్రశ్నించాడు అదే శ్రీశ్రీ. వాళ్లలో శ్రమజీవులను చూశాడు గాని మతాలను చూడలేదు. కాని ఇప్పుడు తాజ్‌మహల్, చార్మినార్, జిన్నా టవర్ ... ఏదైనా సరే మతాన్ని చూడమంటున్నారు. మానవత్వం మరవమంటున్నారు. అందుకే ఇది సవాళ్ల సమయం. గత సంచిక సంపాదకీయంలో మేము చిత్ర పరిశ్రమలో మతవాద మలుపు గురించి రాశాం. వర్తమానంలో మలుపును బలపర్చుకోవడానికి గతాన్ని కూడా మతం కోణంలో చూడాలంటున్నారు కేంద్రం పెద్దలు. *'చరిత్ర అడక్కు చెప్పింది విను'* అని దబాయిస్తున్నారు. మోడీ ప్రధాని అయ్యాకే చరిత్ర అన్నట్టు వ్యవహరిస్తున్నారు. *'ఇది కాదోయ్ చరిత్ర సారం'* అన్న శ్రీశ్రీ మాటలు మర్చిపోమంటున్నారు.

అంతటితో ఆగుతున్నారా? వినాయకుడికి ఆనాడే ప్లాస్టిక్ సర్జరీ జరిగిందనీ, గాంధారీకి సిజేరియన్ చేసి వందమంది పిల్లలను తీశారని చెబుతున్న అభినవ విజ్ఞానులకు డార్విన్ గిట్టడం లేదు. జీవ పరిణామం వారికి ప్రమాదకరంగా కనిపిస్తున్నది. సిలబస్ తగ్గించాలంటూ ఆ పాఠాలనూ తీసేయాలని ఫర్మానా జారీ చేశారు. చరిత్రనే మార్చిన వారికి కళా సాహిత్యాలపై దాడి ఒక లెక్కా?

గత చరిత్రను అలా వుంచి వర్తమానంలో చూస్తే విశాఖ ఉక్కుపై నాటకం కొనసాగిస్తూనే ఉన్నారు. తెలుగువారి హక్కును హుళక్కి చేస్తామంటున్నారు. అదానీ వంటి అక్రమ కుబేరులకు అభయహస్తమిస్తూ ఛత్రచామరాలతో కాపాడుతున్నారు. మరోవంక ఉద్యోగ కార్మికుల హక్కులపై ఉక్కుపాదం మోపుతున్నారు. మేడే పోరాటంతో సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని 12 గంటల పనిగా మారుస్తున్నారు. పొదుపు చేసి తీసిపెట్టుకున్న మొత్తాలనూ ఆయనకే కట్టబెట్టారని తెలిసి తెల్లబోవడమే మన వంతవుతున్నది.

ఏ విధంగా చూసినా ఇది పరీక్షా సమయం. కదన కుతూహల రాగం వినిపించాల్సిన సందర్భం.

దేశ చరిత్రనూ విజ్ఞానాన్ని విశాల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే కర్తవ్యం.

■

ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్**
**◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి**
*మేనేజర్ :* **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


లచ్చమ్మ : శాంతి శ్రీ ................... 5
చచ్చేంత ప్రేమ : అను: డా.వెన్నా వల్లభరావు 20
కూలి రోగులు : వి.రెడ్డెప్ప రెడ్డి ............ 31
మత్తు కమ్మిన రాత్రి : శింగమాల సుబ్రహ్మణ్యం 50


## కవితలు


తానొక జ్వరమానిని : పుట్టి గిరిధర్ ................. 8
ప్లీజ్ ...! : ఈతకోట సుబ్బారావు ...... 9
లిప్తకాలపు స్వప్నాలు : కంచరాన భుజంగరావు .. 14
నవనవోన్మేషమై ... : కోరాడ అప్పలరాజు ......... 15
మట్టిప్రేమ : గవిడి శ్రీనివాస్ ............ 19
ఆకలి : అల్లాడి శ్రీనివాస్ ........... 22
చివరిగా ఒక్కమాట : మచ్చ రాజమౌళి ............ 22
మాటివ్వండి ... : ఏటూరి నాగేంద్రరావు ...... 26
జీవభాష : రత్నాల బాలకృష్ణ .......... 26
ఒక వాన సంగీతం : శిఖా ఆకాశ్ ............... 27
విజయపథం : పిల్లి హజరత్తయ్య ......... 30
పల్లె పిలుస్తోంది ..! : గవిడి శ్రీనివాస్ .............. 30
రోజూ ఎగిరే పిట్టలు : ఏనుగు నరసింహారెడ్డి ..... 35
అక్షర ప్రయాణం : రెడ్డి శంకరరావు .......... 35
అచ్చం వాడిలా ... : చందలూరి నారాయణరావు 42
అదే పనిగా ... : మిరప మహేష్.............. 42
మేడే : కోటం చంద్రశేఖర్ .......... 47
అక్షరాల అరణ్యాన్ని ... : రాజశేఖరుని శ్రీ శివలక్ష్మి 47
'అద్దానికి అర్జీ' : మల్లారెడ్డి మురళీ మోహన్ 49
పుస్తక విలాపం : అడపా రామకృష్ణ ........ 53
అదృశ్యరూపాన్ని : డాక్టర్ మండల స్వామి .... 53
నేనో స్వేచ్ఛా విహంగమై... : లోసారి సుధాకర్ .......... 55
ప్రకృతి కాంత : ఆవుల బసప్ప ............ 55


## వ్యాసాలు


వరకట్న సమస్యపై వందేళ్ల క్రితమే రంగస్థల చర్చ
– డా. జోస్యుల కృష్ణబాబు ......... 10
సజీవ జీవన విహంగాలు .. విహారి కథలు
– ఎమ్వీ రామిరెడ్డి .................. 16
అనేక విశేషాల సమాహారం.. మనకు తెలియని పిఠాపురం
– పేపకాయల ప్రసాద్ ............ 23
బుచ్చిబాబు : కథలూ – భాష
– కె.ఉషాబాల ..................... 28
'బూడిదపూల చెట్లు' రాల్చుతున్న నిష్ఠుర నిజాలు
– పి.శ్రీనివాస్ గౌడ్ ................ 36
ముఖాముఖి : కవులు మూలాల్లోకి చొచ్చుకెళ్లి రాయాలి!
– ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ 39
అక్షరాల సాక్షిగా ... తరగతి ఆవిష్కారం!
– పిల్లా తిరుపతిరావు ................ 43
వర్తమానం: చరిత్ర ఆయుధంగా హిందూత్వ మతోన్మాద ప్రాజెక్టు
– ఆదిత్య ముఖర్జీ, మృదులాముఖర్జీ 45
వివక్షపై గళమెత్తిన కలం గుర్రం జాషువా
– డాక్టర్ డి.ఉదయకుమారి ....... 48
సాహితీ ప్రజ్ఞ ................................................ 54
పర్యటన : ఆకర్షించే ఆర్‌కె నారాయణ్ నివాసం
– డా. నాగసూరి వేణుగోపాల్ .... 56
నాటక దర్పణం – గుంటూరు కళా పరిషత్
– చెరుకూరి సత్యనారాయణ .... 59
తెలుగు చిత్రపటంపై చెరగని సంతకం బాలి ............ 61
రైతు గొంతును ధ్వనించి.. ప్రశ్నించిన కవిత్వం
– జంధ్యాల రఘుబాబు .......... 63
డైరీ ................................................ **65**



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# లచ్చమ్మ

- శాంతిశ్రీ
83338 18985

'ఏమేవ్.. ఈ రోజు మన నడిపోడు వస్తున్నాడు గందా.. ఆడికి టమాటా పచ్చడంటే ఇష్టంగా.. చెయ్యరాదూ..?! నిన్న చేలో నుండి పచ్చి మిరగాయలు, టమాటాలు తెచ్చానుగా..' కళ్లు ఎగరేస్తూ.. పంచె కొంగు నడుములో దోపుకుంటూ.. సూరిలో కొడవలి చేతిలోకి తీసుకుంటూ.. దాని పదును బొటనవేలుతో రుద్ది చూస్తూ.. చెప్తూనే పొలం పోవడానికి బయటకు అడుగులేస్తున్నాడు రంగయ్య.

'ఏమయ్యో... ఇదిగో అన్నం.. కొడుకొస్తున్నాడని నాకన్నా నువ్వే మా బాగా సంతోషపడుతున్నావనుకుంటా.. ఆర్డర్లు ఏసేస్తున్నావు.. ఆడికిష్టమనీ టమాటా పచ్చడికి అన్నీ సిద్ధం చేసుకున్నాలే..!' అంటూ మురిసిపోతూ అన్నం టిఫెను అందించింది లచ్చమ్మ.

'ఇందులో నేను సంతోషపడేదేముందే.. ఆడొస్తానని ఫోను చేసినకాడి నుంచి నీ వాలకం చూస్తానే ఉన్నా.. కాళ్లూ చేతులూ ఆడకుండా.. ఏ పనీ తెమలకుండా తెగ తిరగాడుతున్నావు..' అన్నాడు రంగయ్య.

'హుఁఊ...!' అంటూ మూతి తిప్పుకుంటూ ఎడమచేత్తో పైట సరిజేసి, కుడిచేత్తో బిగిలాగి నడుములో చెంగును దోపుకుంది లచ్చమ్మ.

ముసిముసిగా నవ్వుకుంటూ.. కండవా తలకు చుట్టుకుంటూ.. మీసం మీద చేత్తో ఓసారి సవరదీసుకుని, కొడవలి సైకిల్ హ్యాండిల్‌కు మధ్యలో పెట్టి, అన్నం క్యాను కుడివైపు హ్యాండిల్‌కి తగిలించుకొని, పొలం వెళ్లాడు రంగయ్య.

లచ్చమ్మ కూడా రోజూ రంగయ్యతోటే పొలం పోయేది. కానీ కొడుకొస్తున్నాడని ఇంటికాడే ఉంది.

'ఏంటి పిన్నాం.. పనికి పోలేదా?' అంటూ ఎదిరింటి వెంకాయమ్మ వచ్చింది.

'మా నడిపోడు వస్తున్నానని నిన్న మాపిటేల ఫోను చేశాడు. ఇంకో గంటలో వస్తాడు.. ఏ ఏలకి ఎక్కాడో.. ఏం తిన్నాడో.. ఆడు వచ్చేసరికి ఇంటికాడ నన్ను ఉండమన్నాడు మీ బాబాయి.. అందుకే ఈ రోజు పోలేదమ్మాయ్.. !' అంటూనే బకెట్‌తో నీళ్లు తీసుకుని రోలు కడగడం మొదలుపెట్టింది.

'ఏంటి పిన్నాం.. గారెలండుతున్నావా ఏంటి? రోలు కడుగుతున్నావ్..?' అంది వెంకాయమ్మ అక్కడే ఉండి.

'లేదమ్మాయి.. రాత్రి ఇడ్డీకి, అట్టుకీ పిండి రుబ్బి పెట్టాను. ఆడొచ్చాక రెండు రోజులుంటాడుగా.. ఏదో ఒకరోజు వండొచ్చులే గారెలు.. ఇప్పుడు టమాటా పచ్చడి నూరదామని...' అంటూ ఇంట్లో అప్పటికే వేపి పెట్టుకున్న పచ్చి మిరపకాయలు, టమాటా ముక్కలు, వెల్లుల్లిపాయి, జీలకర్ర, ఉప్పు డబ్బాలు తీసుకుని వచ్చింది. అవన్నీ రోలు దగ్గర ఉంచి, పాత టవల్ ఒకటి రోలు ఎదురుగా ఏర్పాటు చేసుకున్న రాయి మీద వేసుకుని, కూర్చుంది లచ్చమ్మ.

'టిఫినీలోకి చనగపప్పు, కొబ్బిరేసి చట్నీ చెయ్యపోయావా పిన్నాం.. టమాటా పచ్చడికన్నా..' అంది వెంకాయమ్మా.

'ఆడికి నేను చేసే టమాటా పచ్చడంటే మాలావు ఇష్టమమ్మాయ్.. మా అయ్యకి కూడా టమాటా పచ్చడంటే ఇష్టంగా తినేవాడు.. ఓ ముద్ద ఎక్కువ తినేవాడు ఆ రోజు.. అదే ఈడికి వచ్చినట్టుంది. మీ బాబాయ్ కూడా "ఆడికి ఇష్టం

కదా.. టమాటా పచ్చడి చెయ్యి!" అని చెప్పిపోయాడు.. ఆడు టమాటా పచ్చడిని, పప్పులెక్క ఏసుకుని, తింటాడమ్మాయి.. టమాటా పచ్చడి చేస్తే.. వెన్నపూస కూడా ఉంది. వేడేడి అన్నంలో వేసుకుని, ఈ పచ్చడేసి కలుపుకుని చానా ఇష్టంగా తింటాడు. వాడొస్తే పంచబక్ష పరమన్నాలేమీ అడగడు.. ఇదొక్కటే వాడడిగేది..!' అంటూ పచ్చి మిరపకాయలు రోట్లో వేసి, ఉప్పు డబ్బాలో ఉప్పు చేత్తో అంజాదుగా తీసి వేసింది. పచ్చడిబండ పెట్టి వాటిని నూరుతూ..

'ఓ ఎంకాయమ్మా.. రెండు రెబ్బలు కరేపాకు ఆ చెట్టుకాడ నుండి కోసుకురావే! తెద్దామనుకుని మర్చిపోయాను..' అంటూ పురమాయించింది.

'అట్టాగే పిన్నాం!' అంటూ వెంకాయమ్మ కరివేపాకు చెట్టుకాడకెళ్లి, గుప్పెడు కోసుకొచ్చింది. నాలుగు రెబ్బలు లచ్చమ్మకిచ్చి, మిగిలింది తను తీసికెళుతూ.. 'మీ చెట్టు కరేపాకు భలే వాసనేస్తది పిన్నాం.. ఇంకే చెట్టుది ఇంత వాసన రాదనుకో..!' అంది వెంకాయమ్మ.

'అది నేను కాపురానికి వచ్చినప్పుడు వేసిన మొక్క. మీ బాబాయి.. ఆ చెట్టు కొమ్మతోనే ఈ పచ్చడిబండ చేయించాడు..!' అంది లచ్చమ్మ.

'అవునా పిన్నాం.. ఈ రోట్లో నూరితే పచ్చడి మాలావు రుచిలే.. ఆ రోలు కూడా ఆనాటిదేనా?' సందేహంగా అడిగింది వెంకాయమ్మ.

'ఈ రోలు కూడా మా అయ్య చేయించాడు నాకోసం..!' అంటూ కొంచెం గర్వంగా చెప్తూ.. టమాటా ముక్కలు వేసి, నూరి, వెల్లుల్లిపాయిని రోటిమీద పెట్టి పచ్చడి బండతో పైపైన ఒక దెబ్బేస్తూ చిదిమిన పాయలోంచి నాలుగైదు గబ్బాలు తీసి రోట్లో వేసి, జీలకర్ర డబ్బా తీసి, చేత్తోనే కొద్దిగా తీసి వేసి, నూరింది. చివరిలో కరివేపాకు రెబ్బల్ని పక్కనే ఉన్న తొట్టిలో నీళ్లల్లో ముంచి, విదిలించి, పమిటకొంగుతో తుడిచి, ఆకులు దూసి వేసింది. ఓసారి పచ్చడిని పైపైన నూరి, చేత్తో తీసి, గిన్నెలోకి తీసి, అవతలకి పెట్టింది. బకెట్‌లో నీళ్లు పోసి, రోలు, బండా శుభ్రంగా కడిగి, ఆ పక్కనే ఉన్న గోనెపట్టా దానిమీద కప్పింది.

'ఏంటి పిన్నాం.. పట్టా కప్పావు? ఎవరైనా రోట్లో నూరు కోవడానికి వస్తానన్నారా ఏంటి?' ఆసక్తిగా అడిగింది వెంకాయమ్మ.

'ఆటో సుబ్బారావు పెళ్లాం సుబ్బలచ్చిమి లేదూ.. పండు మిరపకాయలు తీసుకుందంట.. తొక్కుకుంటానంది' అంటూ చెంగు దులుపుకుంటూ.. పచ్చడి గిన్నె తీసుకుని లోపలికి వెళ్తూ.. 'కొంచెం ఆ ఉప్పు డబ్బా, జీలకర్ర డబ్బా లోపలికి ఎత్తుకురా అమ్మాయ్!' అంది లచ్చమ్మ.

అయ్యి తీసుకొచ్చిన వెంకాయమ్మకి, ఒక గిన్నెలోకి కాస్త టమాటా పచ్చడేసి ఇచ్చింది. 'ఎందుకులే పిన్నాం? మీ అబ్బాయికి ఇష్టమన్నావుగా..!' అంటూనే చెయ్యిజాపి, అందుకుంది.

'నీ దుంపతెగ.. ఓ పక్క అందుకుంటూనే.. వద్దు వద్దంటావు.. మరింత నూరాలే.. పట్టికెళ్లు.. ఏం కూరొండావు?' అంటూ ఆరా తీసింది.

'రాత్రి మీ అల్లుడు కోడికూర తెచ్చుకుంటే వండాను పిన్నాం. అది ఈ పూటకి కూడా ఉంది. ఇక రాత్రికి చూడాలి!' అంది వెంకాయమ్మ..

'ఓహో అదా సంగతీ.. అందుకే తీరిగ్గా ఉన్నావు..' అంటూ గిన్నెలు సర్దుతుంది. ఈ లోపు బయట ఆటో సౌండ్ వినిపించింది.

'అబ్బాయి వచ్చినట్టున్నాడు..!' అంటూ ముఖమంతా విప్పార్చుకుంటూ గబగబా బయటకు వచ్చింది లచ్చమ్మ.

కొడుకు శివాను చూడగానే.. చెంగుతో చేతులు తుడుచుకుంటూ.. గబాగబా కొడుకు చెయ్యందుకుని లోపలికి నడుచుకుంటూ వచ్చారు. ఎవరు ఎవర్ని నడిపిస్తున్నారో చూసేవారికి తెలియడం లేదు.

'అయ్యా.. పెయాణం బాగా జరిగిందా? ఆ బాగు ఆడపెట్టి, తొట్టికాడ కాళ్లు కడుక్కుని రా అయ్యా.. పళ్లు తోముకున్నావా? టిఫినీ ఏసేదా? ఇడ్డీలు తింటావా? అట్టులు పోసేదా?' ఒకదాని మీద ఒకటి ప్రశ్నలు అడుగుతూ తాను హడావిడి పడుతూ, కొడుకుని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది లచ్చమ్మ.

'అమ్మా.. బ్రెష్ చెయ్యడం, కాఫీ తాగడం అన్నీ అయ్యాయి..! ఇడ్లీలే తింటాను. నువ్వు ఆ రోట్లో రుబ్బిన పిండితో వేసే ఇడ్లీలు దూదికన్నా మెత్తగా ఉంటాయి.. అవి తిని చాలా రోజులైంది..!' అన్నాడు.

'రెడీగా ఉంచిన ఇడ్లీ పిండిలోంచి కొద్దిగా పిండి వేరే గిన్నెలోకి తీసుకుని, ఉప్పు కలిపింది లచ్చమ్మ.. ఇడ్లీ పాత్ర తీసి, ఒకసారి కడిగి, ఇడ్లీలు వేసి, పొయ్యిమీద పెట్టి, వెలిగించింది.

కొడుకు కాళ్లు కడుక్కుని వచ్చి, వరండాలో నులక మంచం తీసుకుని ఆరుబయట వేసి, కూర్చున్నాడు. వరండాలో తీగమీద ఉన్న టవల్ తీసి, కొడుక్కి అందిస్తూ.. 'అందరూ బాగున్నారేరా శివా?' అంటూ మంచినీళ్ల చెంబు తెచ్చి ఇచ్చింది.

'అందరూ బాగానే ఉన్నారమ్మా.. మీ కోడలు ఈసారి సంక్రాంతికి వస్తానంది. పిల్లలిద్దరూ నానమ్మా, తాతయ్యని తీసుకునిరా! అన్నారు.' అన్నాడు శివా.

'బాగా మాటలు చెప్తున్నారన్న మాట..!' మురిసిపోతూ అంది లచ్చమ్మ.

అలా కబుర్లు చెప్పుకుంటూ.. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక ఇద్దరూ పడుకున్నారు.

❖❖❖

నాలుగు కావొస్తుంది టైము.

'లచ్చిమ్ పిన్నాం! లచ్చిమ్ పిన్నాం..!' కేకేలేస్తుంది సుబ్బలక్ష్మి. పండు మిరపకాయలు, చింతపండు, ఉప్పుడబ్బా రోటికాడ పెడుతూ.

అప్పుడే ఒక కునుకు తీసిన లచ్చమ్మ.. ఆ అరుపులకు కొడుకు ఎక్కడ లెగుస్తాడో అని.. కంగారుగా లేచి.. 'ఎందుకే అంత పెద్దంగా అరుస్తావు? మెల్లగా పిలవలేవూ..? అబ్బాయి వచ్చాడు బెంగ్లేరు నుంచి.. పడుకున్నాడు.. లెగుత్తాడే' అంటూ బయటకు వచ్చింది.

'అవునా పిన్నాం..? కాసేపాగి రానా మరి పండుమిరగాయ్ తొక్కోవడానికి..' అంది..

'నువ్వు ఈడ తొక్కుకుంటే ఇబ్బందేముంది.. గట్టిగా కేకలేశావని చెప్తున్నానంతే.. నువ్వొక్కదానివే తొక్కుతావా? ఎవర్నన్నా సాయం పిలవపోయావా?' అంది లచ్చమ్మ.

'సాయక్క వస్తానంది..!' అంటూ అన్నీ రోటికాడ సర్దుతోంది సుబ్బలక్ష్మి.

'నీ పెనిమిటి కబురేమైనా తెలిసిందా?' అడిగింది లచ్చమ్మ.

'ఆడు ఏడకెళ్లడు పిన్నాం.. అటు తిరిగి ఇటు తిరిగి ఈడకే వస్తాడు. పనీపాటా చేయడం లేదని మా అమ్మ గటింటగా అడిగినందుకు అలిగి పోయాడుగానీ.. ఆడికి ఎవరు ఎన్ని రోజులు తిండెడతారు?' అంది సుబ్బలక్ష్మి..

'అయినా మీ అమ్మ సరిగ్గానే అన్నదిలే.. ఆడుండి ఉద్ధరిస్తున్నాడా ఏంది? పెనిమిటి లేనోళ్లంతా బతకడం లేదా? నీ బతుకు నువ్వు బతకడం లేదా? ఆ పిల్లలు ఓ దారొచ్చేదాక నీకు ఈ రెక్కల కష్టం తప్పదమ్మాయ్.. వేన్నీళ్లకి చన్నీళ్లన్నట్లు.. ఒకపూటన్నా ఆడు పనికిపోతే.. నువ్వెట్టాగొట్టా సంసారం ఈదుకొస్తావు.. అయినా వివరం తక్కువ సన్నాసి.. ఆడి గురించి మాట్లాడం కూడా దండగే..' అని లచ్చమ్మ అంటుంటే.. అప్పుడే అక్కడికి వచ్చిన సాయమ్మ 'మరి పిల్లలేమంటున్నారు?' అంటూ రోటికి ఆ దరిన పచ్చడి దంచడానికి సర్దుకుని కూర్చుంది.

'అనేదేముంది? ఆరోజే వాళ్ల నాన్నతోనే అన్నారు..' అంది సుబ్బలక్ష్మి.

'ఏమని?' అంటూ లచ్చమ్మ, సాయమ్మ ఒకేసారి అడిగారు.

'ఎల్లవయ్యో.. మమ్మల్నేమన్నా బెదిరిస్తున్నావా? నువ్వు రాకపోయినా మాకేం కాదు.. మా అమ్మ ఉంది చాలు..' అని.

'అదీ చూస్తా..! అంటూ అట్టే పోతం.. వారం దాటింది.. మరో మూడురోజుల్లో వచ్చేస్తాడు పిన్నాం..! పట్టుమని పదిరోజులు కూడా ఉండలేడు..' అంది సుబ్బలక్ష్మి.

వాళ్ల పచ్చడి అవుతా ఉండగా.. కొట్టోళ్ల శివమ్మ వచ్చి.. 'అమ్మాయి మీది అయిపోగానే చెప్పండి.. రోలు కడగమాకండీ.. మీ మావయ్య చింతకాయలు, పండు మిరగాయలు తెచ్చాడు.. తొక్కాలి..!' అంది.

'రెండూ కలిపి తొక్కుతావా అక్కాయ్?' అంటూ సాయమ్మ అడిగింది.

'అట్టెంట తొక్కుతామే.. నీ తెలివి తెల్లారినట్టే ఉంది.. రెండూ వేర్వేరుగానే తొక్కాలి. చింతకాయలో గింజేరొద్దు..!' అంది లచ్చమ్మ.

అందరూ పడీ పడీ నవ్వారు.

వాళ్లదైపోయేలోపు కొట్టు శివమ్మ తన సరంజామా అంతా తీసుకుని వచ్చింది.

'నాక్కూడా కాసేపు సాయం చేయండమ్మాయ్.. వెళ్లిపోమాకండీ!' అంటూ ముందు పండు మిరపకాయలు తొక్కడం మొదలుపెట్టింది.

'మీ అమ్మాయి కాపురం ఎట్టా ఉంది శివా!' లచ్చమ్మ అడిగింది.

'ఆ చచ్చినోడు గోర్నమెంటు ఉద్యోగం వస్తదని ఎకరం పొలం కట్నం కింద తీసుకున్నాడా? ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు.. ఇంతవరకు ఉద్యోగం లేదు ఏమీ లేదు. పిల్లే షాపుల్లో పనికి పోతోంది పిన్నాం.. అన్నీ అబద్దాలు చెప్పి జేరారు.. మా కర్మ అట్టా కాలింది.. ఏం చేస్తాం.. పిల్లనే ఓపిగ్గా అట్టాగే ఉండమన్నాం..!' అంది శివ.

'అంతేలే.. ఓపిక పట్టాలి.. అయినా పెళ్లికి ముందే అన్నీ జాగర్తగా కనుక్కోవాలమ్మాయ్.. ఈ రోజుల్లో ఎవర్నీ నమ్మేట్టు లేదు..' అంటూ తన పనిలోకి వెళ్లిపోయింది లచ్చమ్మ.

కొట్టు శివ తొక్కిన పచ్చళ్లు అన్నీ సర్దుకుని.. రోలు శుభ్రంగా కడిగి, గోనెపట్టా కప్పి 'వెళతన్నాం పిన్నాం..!' అంటూ అందరూ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లారు.

సాయంత్రం రంగయ్య వస్తూనే బయటే ఉన్న నులకమంచం మీద కూర్చొని, తలకు చుట్టుకున్న కండవా తీసి, మంచంపై మడతేసి దానిమీద కుడిచెయ్యి మడిచి, నడుం వాల్చాడు.

'ఏమయ్యో.. పొయ్యిమీద నీళ్ల కాగు వేశాను. తానం చెయ్యరాదూ.. అబ్బాయి తన సావాసగాళ్లను పలకరియ్యడానికి వెళ్లాడు. ఆడొచ్చేసరికి కాస్త కూకొని ఆ మాటా ఈ మాటా మాటాడొచ్చు.' అంది లచ్చమ్మ..

'చేత్తాలేవే.. కాస్తంత నడుం వాల్చనీ.. ఏ తానం చేత్తేగానీ నీ కొడుకు మాట్టాడ్డా ఏంటి?' అన్నాడు చమత్కారంగా రంగయ్య.

'పరాసకాలేమీ తక్కువలేదు.. ఆడు నాకేనా కొడుకు..? నీకు కాదా? నీ ఇట్టం..' అంటూ కొడుకోసం పకోడీలు వేసే పనిలో ఉంది లచ్చమ్మ.

చూస్తుండగానే రెండురోజులు గడిచిపోయాయి. కొడుకు వెళ్లిపోతున్నాడనీ, రెండు కేజీల బియ్యం పోసి, కొబ్బరి బూరెలు, చెక్క పకోడీలు చేసి పంపింది.

❖❖❖

రోజులు గడుస్తూ ఉన్నాయి.

కొన్నాళ్లయ్యాక రంగయ్య, లచ్చుమ్మ పనులకు వెళ్లలేక ఇంటి దగ్గరే ఉంటున్నారు. గొడ్డుపని కూడా చెయ్యలేక ఉన్న రెండు గేదెల్నీ, ఒక ఆవుని కూడా అమ్మేశాడు రంగయ్య. కొడుకు శివ ఆ ఇల్లు పడగొట్టి, డాబా కడతానన్నాడు. ఇల్లయ్యే వరకూ పక్కనే ఖాళీగా ఉన్న గొడ్డసావిడినే పడేసి, చిన్న ఇల్లు రేకులతో కట్టాడు శివ. అందులో రంగయ్య, లచ్చుమ్మ ఉంటున్నారు.

'అరే శివా.. ఆ రోలు మాత్రం మేమున్న ఇంటిదగ్గరే వేయించిరా..!'

'నీకింకేం ఓపికుందమ్మా.. రుబ్బడానికీ.. మిక్సీ, గ్రైండర్ కొన్నాగా..!' అన్నాడు కొడుకు.

'మాటిమాటికీ ఆటిల్లో వేత్తానా ఏంటి? మా ఇద్దరికీ గిద్ద పప్పు ఏసుకుంటే ఎక్కువతక్కువ. అయినా.. ఆ రోలుంటేనే ఎవరన్నా ఇంటి ముందుకు వచ్చిపోతా ఉంటారు.. కాసేపు కూకుంటారు.. ఏదో మా ముసలోళ్లను పలకరిస్తారు.. కాసిన్ని కబుర్లు చెప్తారు.. అది నేను ఈ ఇంట్లో ఉండేవరకూ ఉండాల్సిందేరా! నేను పోయాక మీ ఇట్టం.. ఆ రోలు ఉంచుతారో.. తీసేత్తారో.. ఇప్పుడైతే మనుషుల్ని పిలిపించి అక్కడ పెట్టించు!' అని స్థిరంగా చెప్పింది లచ్చుమ్మ.

'అమ్మ అన్న మాట నిజం. మేమంతా రెక్కలచ్చి వెళ్లిపోయినా.. ఇన్నాళ్లూ ఆ రోలు.. దానికోసం వచ్చే మనుషులు.. అమ్మకు మంచి కాలక్షేపం.. ఆమెకలా కాలం గడిచిపోయేది.' అని మనసులో అనుకుంటూ..

పునాదులు తీసేందుకు వచ్చిన కూలోళ్లతోనే రోలును భద్రంగా అమ్మానాన్న ఉన్న ఇంటి దగ్గర, గుమ్మం పక్కనే వేయించాడు.

అక్కడ కూడా రోట్లో నూరుకోవడానికి వచ్చేవారికి వీలుగా ఉండేలా అటూ ఇటూ కూర్చొనేవారికి సిమెంటు రాళ్లు, వాటిపై నాపరాళ్లతో.. ఆపైనా గోనెపట్టాలను మడతేసి సిద్ధం చేసింది లచ్చుమ్మ.

❖❖❖

ఇప్పుడు లచ్చుమ్మ ఇంటికే ఎవరైనా వచ్చేది.. అది పప్పు రుబ్బుకోవడానికైనా.. పచ్చళ్లు రుబ్బుకోవడానికైనా. వాళ్లు వచ్చినప్పుడు వినపడే గాజుల చప్పుళ్లతో పాటు.. వారి మాటలు.. వాళ్లు చెప్పే గాథలు.. కష్టాలు.. సుఖాలు.. అన్నీ కలబోసుకునేవారు. ఇప్పుడు అలా వచ్చేవాళ్లే రంగయ్య, లచ్చుమ్మకు గొప్ప కాలక్షేపం.

■

## తానొక జ్వరమానిని

**అ**తనిలో వేడి వంద దాటినప్పుడు
ఆమెలో ఆందోళన కూడా వంద దాటుతుంది
ఆమె తన చల్లని మునివేళ్ళతో
అతని వేడినంతా పీల్చుకుంటుంది
అతను మత్తుగా నిదురపోతుంటే
ఆమె కళ్ళు పహారా కాస్తుంటాయి
అతను బాధతో కలవరిస్తుంటే
ఆమె తల్లిలా తల్లడిల్లిపోతుంది
అతనికి మెలకువ రాగానే
అమ్మలా అక్కున చేర్చుకుంటుంది
ఎప్పుడేం చెయ్యాలో చేస్తూనే
జ్వరమానినిలా నిరంతరం పరీక్షిస్తుంది
చేదు మందుబిళ్ళలే కాదు;
ముద్దుబిళ్ళలనూ మురిపెంగా ఇస్తుంది!
తన ముందున్న తన ప్రాణాన్ని చూస్తూ
గుండెలో గూడు కట్టుకున్న దు:ఖాన్ని
కళ్ళలోనుంచి జారవిడుస్తుంది
తగ్గేదాక అతన్ని అంటిపెట్టుకుని
ఊపిరి నింపి మనిషిని చేస్తుంది
తనలోని ప్రతి అణువునూ
అతని సేవకై అర్పించుకుంటుంది
తన ప్రాణదీపం వెలుగుకోసం
తాను చమురులా కాలిపోతుంది
ప్రకృతిలా తన ఒడిలో చేర్చుకొని
అతనిని కంటిరెప్పలా కాపాడుతూ
జ్వరానికే జ్వరం పుట్టించి
పారిపోయేంత వరకు తపస్సు చేస్తుంది!

ఒక్కక్షణం
అతని స్థానంలో తానే ఉంటే
ఆమె స్థానంలో అతను ఉండి
చెయ్యాల్సినవేవీ చెయ్యకపోయినా
కనీసం మనిషిగా గుర్తిస్తే చాలని
ఆమె మనసు ఎప్పుడూ కోరుకుంటుంది
ఒకరినొకరు మరిచిపోయి
వేన్నీళ్లకు చన్నీళ్లు తోడైనట్లు
ఇద్దరూ ఏకమయ్యేది ఎప్పుడో అని
ఆమె మనసు పరిపరివిధాలుగా వాపోతుంది!

**- పుట్టి గిరిధర్**

**94949 62080**

## ప్లీజ్...!

క్షణం ఆగుతావా
పంచభక్ష్య పరమాన్నాలు వడ్డిస్తాను
క్షణం ఆగుతావా
దాహానికి అమృతం అందిస్తాను

పొయ్యిమీద ప్రెషర్ కుక్కర్ విజిల్
మిక్సర్‌లో మసాలా మెదిలే బ్రిగిల్

నల్లధనం బయటికి వచ్చే లోపల
తెల్లధనం దేశాన్నేలే మీదల
లక్షలు నీ ఖాతాలో జమ చేస్తాను
క్షణమాగుతావా?
రైతుని కొత్త విత్తనం ముంచితే ముంచనీ

మార్కెట్లో సరుకు నిల్వ పేరుకు పోనీ
పూట బత్తెం పోతే పోయేదేం లేదు
ఒక్కదినం పడికాపులతో చావు రానేరాదు

కార్మికులు శ్రామికులు కూలీలు హమాలీలు
చేనేతలు నాట్లు వేసే నాంచారీలు
కోత కోసే గొల్లభామలూ
మధ్య తరగతి పేద బిక్కీ
కూర్లమ్మే కోయబిడ్డా
వీళ్లంతా ఎవరిని ?
ప్రజాస్వామ్యపు పట్టుగొమ్మలు
ఈ సామాన్యుల కోసమే ఆర్థిక విప్లవం

బ్యాంకుల ముందు క్యూ కడుతూ ఉండు
చూస్తూ ఉండు కల సాకారం చేస్తాను
క్షణం ఆగుతావా?
ఒకరిద్దరు సమిధులైతేనేం?
మహిళలు వృద్ధులు అవస్థ పడితేనేం
జాతి హితంకోసం రోగులు బాధపడితేనేం

దేశ క్షేమపు దారిలో ...
దివ్యాంగులు దిగులు పడితేనేం
కష్టం నష్టం పెళ్ళీ తల్లి అంతా మాయ
మనముంటే నేం పోతెనేం?
రేపటి తరం సౌఖ్యం ముఖ్యం
అదిగో స్వర్గం కళ్ళ ముందరే ఉంది
వసంతాన్ని వాకిట్లో నిలబెడతాను క్షణమాగతావా?




ఏటీయంలు నోట్ల మార్పిడి చత్ చట్
రూపే కార్డులు ఫోన్ మిషన్లు
మొబైల్ బ్యాంకింగ్ ఇన్ని ఉండగా
వొక ముద్దే కదా మొండి కడుపుకి
దేశం గొడ్డు పోలేదోయ్
నాలుగు రోజులు ఓపిక పడితే
పోయేదేముంది కష్టాలు తప్ప
బడాబడా తిమింగలాలకై
చిన్న చిన్న చేపల్ని వెరవేశాను
దేశాన్ని దుక్కి దున్ని చదును చేశాను
ఆశల గింజలు చల్లాను
ప్లీజ్ ... క్షణం ఆగుతావా?

**- ఈతకోట సుబ్బారావు**

**94405 29785**

### బాలల పర్యావరణ కథలకు ఆహ్వానం

**బా**లచెలిమి పత్రిక బాలల కోసం పర్యావరణ కథలను ఆహ్వానిస్తోంది. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ఏ వస్తువైనా ఉండొచ్చు. టైపింగ్లో ఒక పేజీకి (ఎ4) మించరాదు. రాతలో 2 పుటల్లో (ఎ4) రాసి పంపవచ్చు. పెద్దలకు, పిల్లలకు వేరు వేరు సంకలనాలు వేస్తాం.. మే 10, 2023లోగా రచనలు పంపాలి. వాట్సప్ నెంబర్: 9793059793, **email id:desk.chelimi@gmail.com** పోస్టల్ చిరునామా: భూపతి సదన్, 3-6-716, స్ట్రీట్ నెం. 12, హిమాయత్ నగర్, హైదరాబాద్ -500029, తెలంగాణ.

**– గరిపల్లి అశోక్, కన్వీనర్, బాలచెలిమి పర్యావరణ కథల పోటీ - 2023**




# వరకట్న సమస్యపై వందేళ్ళ క్రితమే రంగస్థల చర్చ



- డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు
98664 54340

ప్రఖ్యాత నాటక రచయిత కాళ్ళకూరి నారాయణరావు 28-4-1871న పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యపురిలో పుట్టి కాకినాడలో పెరిగి 27-6-1927న సిద్ధాంతంలో నిర్యాణం చెందారు. వీరు కవి, నాటక రచయిత, నటుడు, దర్శకుడు, పాత్రికేయుడు, అవధాని, మంచి ఫోటో గ్రాఫర్. అన్నిటికీ మించి గొప్ప సంఘ సంస్కర్త. వరకట్నం తీసుకోలేదు. కళావంతుల యువతిని వివాహం చేసుకొన్నారు. బాల వితంతువైన తన సోదరి గంటాలమ్మకు పునర్వివాహం చెయ్యమని తండ్రితో గొడవపడ్డారు. ఆయన అంగీకరించకపోవటంతో అలిగి ఇంటినుంచి వెళ్ళి పోయారు.

సంఘంలో పేరుకుపోయిన వేశ్యావృత్తిని నిరసిస్తూ 1921లో ఆయన 'చింతామణి' నాటకాన్ని, వరకట్న దురాచారాన్ని నిరసిస్తూ 1923లో వరవిక్రయాన్ని, మద్యపానానికి వ్యతిరేకంగా 1926లో 'మధుసేవ' నాటకాన్ని రాశారు. వరవిక్రయ నాటకానికి ఇది శత జయంతి సంవత్సరం. సంఘంలో వేళ్ళూనుకుపోయిన వరకట్న దురాచారాన్ని పారదోలాలనే తపనతో - అవనిలో ఆడదానిగా పుట్టటమే తాను చేసిన పాపమా? అని ఏ స్త్రీ హృదయమూ ఆక్రోశించకూడదని ఆశించి, ఆడపిల్ల పెళ్లి విషయంలో మగ పెళ్ళి వారి ఆశలు- ఆగడాలు, ఆడ పెళ్ళివారి అవస్థలు ఇలా అన్నిటిని కాళ్ళకూరి నారాయణ రావు ఈ నాటకంలో కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు. ఇది 10 అంకాల నాటకం.

**కథావస్తువు:** పుణ్యమూర్తుల పురుషోత్తమరావు - భ్రమరాంబ దంపతులకు కాళింది, కమల అనే ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె కాళిందికి రజస్వల కాకుండానే వివాహం చెయ్యాలి, లేకపోతే సంఘం వెలివేస్తుందన్న భయంతో పురుషోత్తమరావు తనకు శక్తి లేకపోయినా సింగరాజు లింగరాజు కుమారుడు బసవరాజుకిచ్చి చెయ్యడానికి రూ.5,500 లు కట్నం బేరం కుదుర్చుకొంటాడు. అయితే కట్నమిచ్చి పెళ్ళి చేసుకోవటం ఇష్టంలేని కాళింది నూతిలో పడి ప్రాణత్యాగం చేస్తుంది. పరిస్థితుల ప్రభావంతో రెండవ కుమార్తె కమల ఆ వివాహం చేసుకొని కట్నం కోసం పీడించే పిసినారి మామగారైన సింగరాజు లింగరాజుకు బుద్ధి చెపుతుంది. స్థూలంగా ఇదీ ఇందలి కథ.

**వరుల గొంతెమ్మ కోర్కెలు :** పురుషోత్తమరావు కాళింది పెళ్ళి కోసం వరాన్వేషణకై కాళ్ళు అరిగేటట్లు కళాశాలలన్నీ తిరుగుతాడు. ఆ వరుల కోరికలెలా ఉన్నాయో చెపుతూ భార్యతో- ఇలా అంటాడు.

నీటైన యింగ్లీషు మోటారు సైకిలు
కొని పెట్టవలెనను కూళ యొకడు
రిస్టువాచియు, గోల్డురింగును బూట్సును
సూట్లుగావలెనను శుంఠయొకడు
బియ్యే బియల్ వరకయ్యెడి ఖర్చు
భరింపవలెననుదరిద్రుడొకడు
భార్యతోడను జెన్నపట్టణంబున నుంచి
చదివింపవలెనను చవటయొకడు
సీమ చదువు చాల సింపిలు నన్నట
కంపవలయుననెడి యజ్ఞుడొకడు

ఇట్లు కొసరు క్రింద నిష్టార్థముల్ వరుల్ దెలుపుచున్న వారు తెల్లముగను" - అని ఇప్పటి మగపిల్లలకు రూప యౌవన వయో గుణ సంపత్తితో పనిలేదు. దండిగా కట్నం మాత్రం కోరుకొం

టున్నారని, అంతలేసి కట్నాలు ఎలా తేవాలో అర్థం కావటం లేదని పురుషోత్తమరావు, భార్యతో చెప్పి బాధపడతారు. పెళ్ళిళ్ళ పేరయ్య 'వరకట్నం' ఎక్కడ పుట్టి, ఎక్కడ పెరిగి, ఎలా విస్తరించిందో పురుషోత్తమరావుతో చెపుతూ... 'బ్రాహ్మణుల యింట దొలుదొల్త ప్రభవమంది కోమటింటను ముద్దులు గొనుచు బెరిగి కమ్మవారింట ఫెళ్ళున గాపురంబు సేయుచున్నది కట్నంపుచేడె నేడు' అంటాడు.

పరమలోభి, నీచుడు, కట్నం కోసం మూడు పెళ్ళిళ్లు చేసుకొన్న సింగరాజు లింగరాజు యొక్క కొడుకైన బసవరాజుకు, కాళిందినిచ్చి పెళ్ళి చెయ్యాలనుకొంటాడు అమాయకుడైన పురుషోత్తమరావు. సింగరాజు లింగరాజు సంతలో పశువులా తన కొడుకును వేలంలో ఒడ్డుతాడు. పెళ్ళిళ్ల పేరయ్య, వివాహాల వీరయ్యల సాయంతో లింగరాజు పురుషోత్తమరావును రెచ్చగొట్టి వేలంపాటలోకి దించుతాడు. పెళ్ళి కుమారునికి అయిదు వేల అయిదు వందల రేటు పలికేదాకా వదలకుండా వేలం పాట పాడిస్తాడు. మరొకరెవరో ఈ సంబంధానికి పోటీ పడుతోన్నట్లుగా దొంగవేలం పాట పెడతాడు. ఇది తెలియని పురుషోత్తమరావు తన సర్వస్వాన్నీ వేలంపాటలో పెట్టి వరుడిని కొంటాడు. ఈ విషయమంతా తల్లిదండ్రుల సంభాషణల ద్వారా విన్న కాళింది ఎంతో బాధపడుతూ తల్లితో ఇలా అంటుంది.

"మీకు కులము లేద? మాకు రూపము లేద?
ఇంత దైన్యమునకు హేతువేమి..
కట్నమిచ్చి వరుని గడియించికొను కంటె
చిన్నతనము వేరెయున్నదమ్మ..!"

కట్నమిచ్చి పెళ్ళి చేసుకోవటానికి ఆమె అంతరాత్మ అంగీకరించదు. కట్నమివ్వటం కోసం తల్లిదండ్రులు పడే అవస్థ, అభిమానాన్ని చంపుకొని కట్నమిచ్చి వివాహం చేసుకోవాల్సిన దుస్థితి ఆమె హృదయాన్ని కలచివేసాయి. అందుకే ఒక స్థిర నిశ్చయానికి వచ్చి చెల్లెలు కమలతో ఇలా అంటుంది : "నాదు ప్రతినంబు వినుము.. ప్రాణములనైన విడిచెదం గాని యడిగిన విత్తమిచ్చి వరుని గొని తెచ్చినట్టి వివాహమునకు సమ్మతింప నారాట్నము సాక్షిగాను" అంటూ ప్రతిజ్ఞ చేస్తుంది. ఆ ప్రతిజ్ఞను నిలబెట్టుకొంటూ ప్రాణాలు తీసుకొంటుంది. దానికిముందు సంఘ సంస్కర్తలమని చెప్పుకొనేవారికి, పాలకులకు, మగపిల్లలను కన్న తల్లిదండ్రులకు, తన తల్లిదండ్రులకు, చెల్లెలు కమలకు తన ఆవేదనను తెలియజేస్తుంది. చివరకు బావిలో దూకి ప్రాణాలు తీసుకొంటుంది. అయినా, అన్యాయం ఆగిపోలేదు! లింగరాజు తాను తీసుకొన్న కట్నం తిరిగి ఇయ్యాల్సి వస్తుందన్న ఉద్దేశంతో పురుషోత్తమరావు గారి రెండో కూతురు కమలను కోడలిగా తెచ్చుకోవాలని ప్రయత్నిస్తాడు.

అయితే అప్పటికే ఒక కూతురిని పోగొట్టుకొన్న తల్లిదండ్రులు ఈ విషయాన్ని కమల నిర్ణయానికే వదిలి పెడతారు. ఆమె కూడా చిన్న పిల్ల అయినా ఆలోచిస్తుంది. 'నేనీ వివాహం వద్దంటే తల్లిదండ్రులు నన్ను బలవంతం చెయ్యరు. కాని ఇచ్చిన కట్నం మొత్తం తిరిగిరాదు. ఈ పెళ్ళి చేసుకొని పణమునకు దగిన ప్రాయశ్చిత్తము చేయగల్గినచో తల్లిదండ్రులిచ్చిన ద్రవ్యాన్ని వినియోగంలోకి తేవటమేకాక, అక్క ఆశయాన్ని సాధించిన దానిని కూడా అవుతాను.' అనుకుంటుంది. పెళ్లికి అంగీకారం తెలుపుతుంది. 'వివాహమునకు సంబంధించిన ఇతర విషయములన్నిటిలో తన ఇష్టానుసారమే నడవనియ్యాలని కోరి, తెలివిగా తండ్రి అంగీకారాన్ని పొందుతుంది. ఆమె ఆ వివాహానికి ఒప్పుకొన్నందుకు తండ్రి ...

"ఏండ్లకన్న చాల హెచ్చగుబుద్ధి నీ
కిచ్చి మమ్ము దేల్చేనీశ్వరుండు
అక్క అట్లు చేసినందుల కీవైన
మాకు కనుల యెదుట మనగదమ్మ" అంటాడు. కట్నమిచ్చి పెళ్ళిచేసుకోవటం ఇష్టంలేని అక్క కాళింది మార్గానికి భిన్నంగా తాను వెళుతున్నందుకు కమల మనసులోనే అక్కకు క్షమాపణ కోరుతుంది. "పణమునకు తగిన ప్రాయశ్చిత్తం చెయ్యటం కోసమే తానీ నిర్ణయాన్ని తీసుకొన్నానని తెలుపుతుంది. వివాహమయ్యాక కాపురానికి వెళ్ళకుండా నగలతోపాటు పుట్టింట్లోనే ఉండిపోతుంది. లింగరాజు ఆ నగలకోసం ఆమెను కాపురానికి రావాలని కోర్టుకెక్కుతాడు. ఆమె న్యాయస్థానంలో తానే తన భర్తను రూ.5,500లకు కొనుక్కొన్నానని, అందుకని అతడే తన ఇంటికి వచ్చి ఉండాలని ఋజువులతో సహా న్యాయస్థానంలో వాదిస్తుంది. ఇదంతా చూస్తున్న బసవరాజు సిగ్గుతో తండ్రినసహ్యించుకొని, ఆమె వైపు వచ్చేస్తాడు. ఇద్దరం కలిసి ఈ వరకట్న దురాచారాన్ని రూపుమాపుదాం రమ్మని పలికి భర్తతో కలిసి వరకట్న దురాచార నిర్మూలనకై ఉద్యమాన్ని ప్రారంభిస్తుంది కమల.

**సింగరాజు లింగరాజు లోభగుణం :** ఈ నాటకంలో సింగరాజు లింగరాజు పాత్ర చాలా విలక్షణమైనది. ఇతడు పరమలోభి. మోసగాడు. డబ్బుకోసం తాను పెక్కు పెళ్ళిళ్ళు చేసుకోవడమేకాదు, కొడుక్కి కూడా అలాగే చెయ్యాలనుకొంటాడు. డబ్బు సంపాదనకెన్ని మార్గాలున్నాయో ఇలా చెపుతాడు : "పరువు ప్రతిష్ఠయు బాటింపగరాదు. పొట్టకేమియు ఖర్చు పెట్టరాదు. బంధువులే తేర బల్కరింపగరాదు. వేరు విస్తరి యింట వేయరాదు. కష్టజీవుల జూచి కటకట పడరాదు. త్రిప్పక తనయప్పు తీర్చరాదు దారకేనియు పెట్టె తాళమీయగరాదు. వేయికల్లలకేని వెరవరాదు. ఇన్ని విధములు కాపాడకున్న ధనము దక్కనేరదు, ధనముచే దక్కనింట బెత్తనములేదు! బయటను బేరులేదు పలుకుబడిలేదు బ్రతికిన ఫలములేదు"

వెర్రివెంకటాయలు? పత్రికలనియు, బరిశోధనలనియు, సంఘ సంస్కరణలనియు, సహాయ నిరాకరణములనియు, స్వరాజ్యమనియు, చట్టుబండలనియు పనిలేని గొడవలు పయి బెట్టుకొందురు గాని వడ్డీలు పెరుగుటకు వాటమైన సాధన మొక్కరును జూడరంటాడు. సంఘ సంస్కర్తలందరూ ఇతని దృష్టిలో

వెర్రివెంగళాయలు, పనిలేని వాళ్ళు. ఇతని దృష్టిలో పెళ్ళికూతురు ఎలాంటి లక్షణాలతో ఉండాలో చూస్తే హాస్యం, ఆశ్చర్యం రెండూ మిళితమౌతాయి. పెళ్ళిళ్ళ పేరయ్య కాళింది అందచందాలు, చదువు సంధ్యల్ని గూర్చి చెపుతూంటే, సరే కాని కన్యకు కావలసినవి చదువూ చక్కదనమూ కావు, అంటూ ఇలా చెపుతాడు. "తిండియొక్క ప్రక్క వెలితిగా దినగవలయు చెప్పకయె యింటి పనులెల్ల జేయవలయు. ఊరికే కొట్టినను పడియుండవలయు. ఇట్టి కన్యను వెదకి గ్రహింపవలయు"

లింగరాజు 3వ పెళ్ళి చేసుకొన్న భార్య సుభద్రను ఏమీ సుఖపెట్టడు, తిండి సరిగా పెట్టడు. మంచి బట్టలు కట్టుకోనివ్వడు. అతనితో కాపురం ఎంత కష్టమో చెపుతూ ఆమె చాలా వాపోతుంది.

**ఆడపిల్లల తల్లి ఆవేదన :** ఇందులో కాళింది, కమలల తల్లి భ్రమరాంబ పాత్ర కూడా గొప్పది. కట్నమిచ్చి పెళ్ళిచేయటం కంటె, నన్ను కొడుకుగా భావించి ఇంట్లోనే పెట్టుకోరాదా? అని కాళింది అన్నప్పుడు 'తల్లీ! అవివాహితయగు ఆడుబిడ్డ ఇంటగలతల్లి అవస్థ నీకిపుడేమి తెలుస్తుంది.

"పెరవారి పిల్లకు వరుడేరు పడెనన్న
మనపిల్ల కెవ్వడో మగడటంచు
పరుల పిల్లల పెండ్లి పరికించునపుడెల్ల
మన పిల్లకెపుడో మనువటంచు
ఎదుటియింటికి నల్లుదేతెంచినపుడెల్ల
మనయల్లుడెపుడింట మసలుననుచు
పొరుగింటి పిల్ల కాపురము విన్నపుడెల్ల
మన పిల్లకెట్టి దబ్బునొ యటంచు
నాడు బిడ్డ జనించుటే యాదిగాను
బుస్తె మెడబడు వరకు మాపులును బవలు
గుడుచుచున్నను, గూర్చున్న, గునుకుచున్న దల్లి పడు
బాధ తెలుపగ దరమెబిడ్డ?" అంటూ వాపోతుంది.

కడకు ఆ పెళ్ళి ఇష్టంలేని కాళింది ఆత్మత్యాగం చేసికోగా ఆ తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం. పురుషోత్తమరావు భార్యను ఊరడిస్తుంటే ఆమె..

ఎన్నడు నామాట కెదురు చెప్పగలేదు
తండ్రి గీచిన గీటు దాటలేదు
బడియన్న నెన్నడు బ్రాలు మాలగలేదు
రాట్నంబునెడల బరాకు లేదు
అది నాకు గావలెనని యెన్నడనలేదు
కుడుచునప్పుడు గూడ గొడవలేదు
ఆటల యందైన నలుక యెన్నడు లేదు
పొరుగింటికేనియు పోకలేదు
కలికమునకేనియును నోటకల్లలేదు.
మచ్చునకు నేనియుం బొల్లుమాట లేదు.
అట్టిబిడ్డను బ్రతికియున్నంతవరకు
మరువ శక్యమె! వెట్టి బ్రాహ్మణుడ! నాకు..!" అంటూ బాధతో తల్లడిల్లి పోతుంది. చివరకు ఆ వివాహం చేసుకోవటానికి కమల మనస్ఫూర్తిగా అంగీకరించినందుకు ఒకింత సాంత్వన చెంది పెళ్ళి సన్నాహాలు ప్రారంభిస్తారు ఆ దంపతులు.

**మగపెళ్ళి వారి ఆగడాలు :** ఇక పెళ్ళిలో మగపెళ్ళి వారి ఆగడాలు, ఎలా ఉంటాయో ఈ నాటకంలో చాలా సహజంగా, భలే చమత్కారంగా, కళ్ళకు కట్టినట్లుగా వర్ణిస్తారు కాళ్ళకూరి.

"తెల్లవారగనెబిందెలతోడ నీళ్ళను
పలుదోము పుల్లలుబంపవలయు కావిళ్ళతో వెన్క
కాఫీయు, దోసెలి
డ్డెనులునుప్మాయు నర్పింపవలయు
తరువాత భోజనార్ధము రందు రండని
పిలిచిన వారినే పిలువ వలయు
కుడుచునప్పుడుపంక్తినడుమనాడుచు
బెండ్లి వారి వాంఛలు కనిపెట్టవలయు
నొకడు రాకున్న వానికై యోర్పుతోడ
మంచినీరైన ముట్టక మాడవలయు
నిన్నిటికి సైచి వేలు వ్యయించి
గౌర వించినను నిష్ఠురములె ప్రాప్తించు దుదకు"

వీటితోపాటు వియ్యపురాలు మర్యాదలు, పెళ్ళివారికి చేయాల్సిన గౌరవాలు, ఎంత కష్టంగా ఉంటాయో వివరించారు. ఆడపెళ్ళి వారికి 16 రోజుల పండగంటే ఏంటో హాస్యాన్ని జోడించి, మరీ చెబుతారు.

**వియ్యపురాలి మర్యాదలు :** వియ్యపురాలు గారికి తెలివిరాగానే కళ్ళుతుడవాలి, కాళ్ళు మడవాలి. కోక సర్దాలి, కిందకు దింపాలి, పెరట్లోకి పంపాలి, నీళ్ళ చెంబందివ్వాలి, రాగానే కళ్ళు కడగాలి, పండ్లు తోమాలి, మొహం తొలవాలి, నీళ్ళు పొయ్యాలి, వళ్ళు తుడవాలి, తలదువ్వాలి, కొత్త చీర కట్టాలి, కుర్చీ వెయ్యాలి, కూర్చోబెట్టాలి, పారాణి రాయాలి. గంధం పుయ్యాలి, అత్తర్లివ్వాలి, పన్నీరు జల్లాలి, మొహాన్ని మొహిరీలద్దాలి. కళ్ళకు కాసులద్దాలి, వంటిని వరహాలద్దాలి. వెండి పలుపు వెనుకకు కట్టాలి. బంగారు పలుపు పక్కకు చుట్టాలి. దిష్టితియ్యాలి, హారతివ్వాలి, అద్దాన్నమివ్వాలి. ఇట్లాంటి వింకా ఎన్నో ఇవ్వాలి. ఆలస్యమైతే అలకకట్నం చెల్లించవలని వస్తుంది.' ఘంటయ్య పురుషోత్తమరావుతో వియ్యపురాలు నిద్రలేచే వేళయ్యింది భ్రమరాంబను పంపమంటూ చెప్పిన మాటలివి.

**పదహారు రోజుల పండగ అంటే .. :** తొలినాడడావిడి, మలినాడయాసం, మూడు మంగళాష్టకాలు, నాలుగు పత్రాలు, అయిదు అప్పగింతలు, ఆరు అంపకాలు, ఏడు వంట బ్రాహ్మల తగవు, ఎనిమిది ఋణదాత నోటీసు, తొమ్మిది జవాబు, పది దావా, పదకొండు స్టేటుమెంట్లు, పన్నెండు విచారణ. పదమూడు డిక్రీ, పద్నాలుగు టమటమా, పదిహేను వేలము, పదహారు చిప్ప. ఈ రోజుల్లో ఇదే పదహారు రోజుల పండుగ. పెళ్ళిళ్ళ పేరయ్య, పురుషోత్తమరావు అవస్థను చూసి ఈ మాటలంటాడు.

**కమల వాదనా పటిమ :** చివరికి కమల వివాహం లింగరాజు కుమారుడు బసవరాజుతో జరగటం, ఆమె కాపురానికి వెళ్ళకపోవటం, లింగరాజు కోర్టుకెక్కటం జరుగుతుంది. కోర్టులో తన వాదన వినిపించటానికి ముందు తనకు తానే కమల ఇలా ధైర్యాన్ని నూరి పోసుకొంటుంది. ఎంతో తెలివిగా, చాకచక్యంగా కోర్టులో తన వాదనను వినిపిస్తుంది. తాను డబ్బిచ్చి వరుని కొనుక్కొన్నానని, అందుచే అతడే తన ఇంటికి వచ్చి తనకు సేవ చేయాలని న్యాయమూర్తిని కోరుతుంది.

**బవవరాజు పశ్చాత్తాపం :** బసవరాజుకు ఇదంతా చాలా చిన్నతనంగా అనిపిస్తుంది. తన తండ్రి కపటబుద్ధి ఇంత చేసినందుకు బాధపడతాడు. న్యాయాధికారి ముందుకు వచ్చి తలదించుకొని ఇలా అంటాడు :

అమ్మెను నన్ను నా జనకుడాయమనన్ గొనె రొక్కమిచ్చి
యీ కొమ్మకు నేను భృత్యుడను గొంకక
యేపని సేయుమన్న నిక్కమ్ముగ జేయువాడ, నిటుకట్నములం/ గొనువారు రూఢిగా
నమ్ముడు కాంద్రుకాక, మగలంటకు నర్హులు
కారు లేశమున్" అనగానే న్యాయాధికారి సెభాష్! అని మెచ్చుకొంటాడు. కమల–బసవరాజు లిరువురు వరకట్న దురాచారాన్ని రూపుమాపటానికి బయల్దేరతారు.

ఇక దశమాంకమంతా ఇంచుమించు మొత్తం అన్ని పాత్రల చేత వరకట్న దురాచారాన్ని రూపుమాపాలనే ఉద్బోధ చేయిస్తారు కాళ్ళకూరి. బసవరాజు కట్నాలు తీసుకొనే వరులనుద్దేశించి ఇలా ప్రబోధిస్తాడు.

"కట్నాలకై పుస్తకములు జేకొని పాత
శాలలకేగెడు చవటలార!
పిలిచి కాళ్ళు కడిగి పిల్ల నిచ్చినవారి
కొంపలమ్మించెడి కుమతులార! అల్కపాన్పుల నెక్కి యవియివి కావలె నని శివమాడెడి యధములార! ఎంత ఎంత పెట్టిన దిని యెప్పటికప్పుడు నిష్ఠురోక్తులు పల్కునీచులార..!

కట్నమనుపేర నొక చిల్లి గవ్వగొనిన / భార్యకమ్ముడు వోయిన బంటులగుచు జన్మదాస్యంబు సలుపుడు, సలుపకున్న నత్తవారింట గుక్కలై యవతరింత్రు." అంటూ హెచ్చరిస్తాడు. సింగరాజు కూడ 'కలడె నావంటి ఖలుడు లోకంబునందు' అంటూ పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేస్తాడు. అందరూ కలిసి సమాజంలో వరకట్న సమస్య సమసిపోవాలంటూ భరత వాక్యాన్ని పలకటంతో నాటకం ముగుస్తుంది.

అయితే డా.పి.ఎస్.ఆర్. అప్పారావు గారు తమ తెలుగు నాటక వికాసంలో ఈ నాటకంలోని పురుషోత్తమరావు పాత్రను గూర్చి విశ్లేషిస్తూ .. పురుషోత్తమరావు తనకున్నవని చెప్పుకొనే ఆదర్శాల్లో ఒక్కటి కూడా ఆచరణలో నెరవేర్చుకొనే ప్రయత్నం చెయ్యలేదంటారు. ఈ వరవిక్రయ నాటకాన్ని మొట్టమొదట ఆంధ్ర సేవాసంఘం వారు. ప్రదర్శించారు. అనంతరం శ్రీ రాజా మోతే నారాయణరావు గారి సీతారామాంజనేయ నాటక సంఘం వారు చెన్నపట్నంలో అనేకసార్లు ప్రదర్శించి ఎన్నో బహుమతుల్ని పొందారు. ఆ తరువాత అనేక నాటక సమాజాల వారు మద్రాసు నుంచి కలకత్తా వరకు ఎన్నో ప్రదర్శనలనిచ్చారు.

**జాతీయోద్యమ ప్రభావం :** వరవిక్రయ రచనా కాలం నాటికి యావత్భారత దేశంలో జాతీయోద్యమ స్ఫూర్తి వెల్లివిరుస్తోంది. మహాత్మాగాంధీ నాయకత్వంలో సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ ఉద్యమం, ఖద్దరు ప్రభావం ఉధృత మయింది. అందుకే ఈ నాటకంపై జాతీయోద్యమ ప్రభావం అడుగడుగునా కనిపిస్తుంది. నాటక ప్రారంభంలోనే కాళింది చరఖా తిప్పుతూ, దాని గొప్పదనాన్ని వర్ణిస్తూ ప్రవేశిస్తుంది. ఆమె తండ్రి పురుషోత్తమరావు కూడా పదేళ్ల నుంచి చేస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఇంట్లో రాట్నం వడుకుతున్నట్లు కవి చిత్రిస్తారు. 'కాళింది' తాను కట్నం ఇచ్చి వివాహం చేసుకోనంటూ 'రాట్నం'పైనే ప్రమాణం చేస్తుంది. చనిపోయే ముందు రాట్నం వడికి బారెడు నూలు తీసి రాట్నం కలకాలం తిరుగుతూ ఉండాలని కోరుకుంటుంది. ఈవిధంగా నాటకంలో జాతీయోద్యమ ప్రభావం ప్రగాఢంగా కనిపిస్తుంది.

**సమకాలిక నాటక కవులపై ప్రభావం :** ఈ నాటక ప్రభావంతో ఆ తరువాత మరికొందరు కవులు 'వరవిక్రయం' పేరిట నాటకాలు రాశారు. 1. నాటక సరస్వతి (1925), 2. గరికపాటి కామేశ్వరరావు (1926), 3.చెఱకుపల్లి వేంకట్రామయ్య (1926), 4. అల్లమరాజు నారాయణరావు (1926), 5.ఎఱ్ఱాప్రెగ్గడ సత్యనారాయణమూర్తి (1933).

ఈ రచయితల్లో కొందరు కాళ్లకూరి నాటకంలోని పేర్లను మాత్రం మార్చుకొన్నారు. కామేశ్వరరావు గారైతే చిన్న చిన్న మార్పులు తప్పిస్తే కథాఘట్టాలలోగాని, సన్నివేశాలలోగాని, పాత్ర చిత్రణలోగాని, చివరకు పద్య రచనలోగాని చాలావరకు కాళ్ళకూరి వారినే అనుకరించారు. కాళ్ళకూరి కవితాప్రాభవానికి, పద్యరచనా చమత్కృతికి ఈ కవులంతా లొంగిపోయారని చెప్పక తప్పదు.

**చలన చిత్రంగా వరవిక్రయం :** ఈ నాటకం 1939లో సి.పుల్లయ్య గారి దర్శకత్వంలో చలనచిత్రంగా రూపొందించారు. సినిమాలో చాలవరకు సంభాషణలు, పద్యాలు కాళ్ళకూరివే తీసుకొన్నారు. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి ఈ చిత్రానికి పాటలు, కొన్ని అదనపు సంభాషణలు రాసారు. ఇందులో సింగరాజు లింగరాజు పాత్రను కూడా బలిజేపల్లే ధరించారు. కాళిందిగా భానుమతి, కమలగా పుష్పవల్లి వేసారు. దయితా గోపాలం – పురుషోత్తమరావుగా, కుచ్చర్లకోట సత్యనారాయణ– బసవరాజుగా, సీనియర్ శ్రీరంజని – భ్రమరాంబగా, దాసరి కోటిరత్నం – సుభద్రగా నటించారు. కొన్ని చలన చిత్రాలపై వర విక్రయ నాటక ప్రభావం కనిపిస్తుంది. ■

# లిప్తకాలపు స్వప్నాలు

పలుచని నీలి పెదవులపై
చల్లని చిరునవ్వు తళుకుమన్నపుడు
పలురంగుల్లో మెరిసే పలువరుస ముత్యాల్లా
నింగి వాకిలి చుట్టూ వరదగుడి..
సూటిగా చూడనీయని నీటిచుక్కల ముసుగులో
మురిపించే కాంతిశోభ..
గాలి గుండెల మీది వర్ణపటాన్ని
జాబిలి కనురెప్పల కింద లాలించాలని
ఎన్నెన్ని రంగులు కలలుకన్నామో!

సముద్ర గర్భంలో పూసే
నీటినవ్వుల ఇంద్రచాపంలో
సప్తవర్ణాల ఛాయలేమిటో
చేపకన్ను చెబుతుందేమోనని
అలల భూతద్దంలో ఎంతలా అన్వేషించామో!

చీలిక పేలికలుగా ఎదురైన
ఎన్ని సందర్భాలను సంధానపరచి
తెరచాపగా మలచి
బతుకునావను నడిపించుకున్నామో!
యత్నదోషాల కాలసంద్రంలో
ఎంతటి సుదీర్ఘ సాహసయానం
సాగించుకొచ్చామో!

ఎన్ని యుగాల శ్రమతో
ఈ సొగసైన యింటిగూడు నిర్మించుకున్నామో!
ఎన్ని తరాల ఆశలతో
ఇన్ని సౌరభాల పూదోటలు పెంచుకున్నామో!
ఎన్ని దీపాల ఉత్సవ గుబాళింపుగా
ఈ మట్టి లోగిలిని అలంకరించుకున్నామో!

ఎంతటి సృజన ప్రోదిచేసి
ఇన్నిన్ని కొత్త దారుల్ని ఏర్పరుచుకున్నామో!
ఎన్నెన్ని వినూత్న ఎత్తుగడలను
మనుగడ పోరాటానికి
ముందువరుసలో మోహరించుకున్నామో!

నీటిచుక్క జాడల్లో తలమునకలుగా సాగే
నాగలి గీతల సాగుబడిలో
ప్రతి పంటగింజ ఓ అనుభవ పాఠమే!
ప్రతి లిప్తకాలం ఓ విజ్ఞాన యోగమే!
బతుకుపోరులో ఓ తడవకు ఓడినా
తరుణోపాయంతో తేరుకొని



విజయ ప్రకటన చేసితీరాలని సంకల్పించి
ఎన్నెన్ని అపజయాలను దాటుకొచ్చామో!

ఏ పేరాశ పన్నిన వలలో చిక్కుకున్నామో
ఇపుడు వియోగ రుతువులమై చతికిలపడ్డాం
చూపు విశాలమయ్యేకొద్దీ
విశ్వరహస్యాలన్నీ మన మస్తిష్కంలోనే
వెలుగు చూస్తున్నాయి కానీ
కృష్ణబిలాలైపోతున్న మెదళ్ళను కట్టడిచేయడమెలాగో
అన్వేషించలేకపోతున్నాం!
ఆపదలను గట్టెక్కించే అంతర్నేత్రమేదో
మన దారిని వెలిగిస్తూనేవుంది కానీ
చీకటి దారులు తొక్కే అడుగుల ఆశని
అదుపుచేసుకోలేకపోతున్నాం!

మన ఊహల తీరాలకు ఆవల
ఎన్ని గోళాల చీకటి
తిష్టవేసి కూచుందో చూడాలి
మన లోపలి పెంజీకటి పేటిక నిండా
ఎన్ని నక్షత్రరాశుల వెలుగు
పోగుపడివుందో వెతకాలి
రాత్రి గుట్టను తొలిచే తొలి కిరణాన్ని
వెలిగించేందుకు
ఒక చిగురించే ఒత్తికోసం మన లోపల గాలించాలి
నీటి వేణువు పచ్చని గాలిపాట పాడుతుంటే
పసి దోసిళ్లతో ఆహ్వానించాలి!
ప్రాయపు పరవళ్ళను ఆస్వాదించాలి!

- కంచరాన భుజంగరావు
94415 89602

# నవనవోన్మేషమై ...



**ను**వ్వు చేతులు
కట్టుకున్నంత కాలం
వాడు నీపై సవారి చేస్తూనే ఉంటాడు.
నువ్వు చెవులు
వదిలేసినంత కాలం
వాడు పువ్వులు పెడుతూనే ఉంటాడు.
నువ్వు వినయ విధేయ రాముడివైతే
వాడు నీ ఆలిని సైతం
ఎత్తుకుపోయే రావణుడవుతాడు.

నీకేం తెలుసు..?
నీకు తెలియకుండానే వాడు నిన్ను
సంతలో పశువులా అమ్మేస్తున్నాడని
నీకేం తెలుసు?
నీ నెత్తిమీద అప్పుల కుంపటి పెట్టి
నీతో పొత్తు నటిస్తూ
మొక్క జొన్న పొత్తులా నిన్ను కాల్చుకుతింటున్నాడని
నీకేం తెలుసు?
నీకు తెలియకుండానే
నిన్ను నీవు కోల్పోతున్నావని..


అయినా నీ పిచ్చి గాని
నీ వంటి మీద అంబరం
చిల్లుల జల్లెడైతే వాడికేం?
వాడు పట్టు బట్ట పదిలంగా కట్టుకున్నాడు కదా..!
నీ పిచ్చిగాని..
నువ్వు కూడు తినే సొట్ట గిన్నె
తనను తడిమే మెతుకు కోసం
ఆత్రంగా ఎదురు చూస్తే వాడికేం..?
వాడి వెండి కంచంలో..
షడ్రుచుల విందు
పసందుగా ఆరగిస్తున్నాడు కదా..!


నీ పిచ్చి గాని
నీ గీములో రవి చంద్రులు
నిత్య అతిథులై
నిన్ను పలకరిస్తే వాడికేం..!
వాడికి ఇంద్ర భవనంలో
రంభా, ఊర్వశి సేవలు
రంజుగా అందుతున్నాయి కదా..!

నీ పిచ్చిగాని
ఇదంతా నీ స్వయంకృతాపరాదమే!
కాదంటావా..!?
ఐదు వేలు కోసం
ఐదేళ్లు నిన్ను నువ్వు
అమ్మేసుకోవడం నిజం కాదా!?

ముడిసిన చేతిని
పిడికిలి బిగించి చూడు..
వింటున్న చెవిలో
చైతన్యం నింపి చూడు..
వంగిన నడుముని..
విల్లులా ఎక్కుపెట్టి చూడు..
కలాన్ని కదిలించి..
గళాన్ని విదిలించి..
తాడిత, పీడిత జనాన్ని
ఒక్క తాటిపైకి తెచ్చి చూడు..
నవ సమాజం నీ ముందు
నవనవోన్మేషమై వెలుగులీనుతుంది.

- కోరాడ అప్పలరాజు
95502 34204



# సజీవ జీవన విహంగాలు విహారి కథలు

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**వెల కట్టలేని ఆస్తి- అనుభవం!**
**అధ్యయనానుభవం. సృజనానుభవం.**
**పరిశీలనానుభవం. పరిశోధనానుభవం.**

అమూల్యమైన అలాంటి ఆస్తిని పుష్కలంగా సంపాదించు కున్న సాహితీవేత్త విహారి. పద్యకవిగా, వచనకవిగా, కథ-నవలా రచయితగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞను కూడబెట్టుకున్న సరస్వతీ పుత్రుడాయన. సాహిత్య ప్రస్థానంలో షష్టిపూర్తి జరుపుకొన్న అరుదైన మూర్తిమంతు డాయన. 'జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి' కాస్తా సర్వ సంపూర్ణంగా 'విహారి'గా రూపాంతరం చెందటం- తెలుగు సాహిత్యానికో చేర్పు.

1980 నుంచి 2015 వరకు విహారి గారు రాసిన కథల్లోని ఆణిముత్యాలను గుదిగుచ్చి, 'విహారి కథలు' మకుటంతో పాఠకుల చేతిలో పెట్టింది నవచేతన పబ్లిషింగ్ హౌస్. సుదీర్ఘ సాహిత్య ప్రయాణంలో కొన్ని మైలురాళ్లు ఇవి. మానవ జీవితాన్ని విభిన్న పార్శ్వాల్లో ఆవిష్కరించిన ఆయన దృక్కోణాలకు దర్పణాలివి. కాలినడకకు సైతం కనికరించని రహదారుల దగ్గర్నుంచి పల్లెల్నీ పట్టణాల్నీ నగరాల్నీ డిజిటల్ కాలుష్యం కమ్ముకున్న ఆధునిక యుగం దాకా కాలం ఆనవాళ్లను కథలుగా రికార్డు చేస్తున్న రచయిత అనుభవం నిస్సందేహంగా అపారమే.

ఉమ్మడి కుటుంబాల్లోని ఆత్మీయానుబంధాలు, పొరపొచ్చా లు, అలకలు, రాజీ పడటాలు; మధ్య తరగతి సంసారాల్లోని సాధకబాధకాలు, అత్తెసరు సంపాదన, ఆచార వ్యవహారాలు, ఆర్థిక ఇబ్బందులు, సర్దుకుపోవటాలు; కాలానుగుణంగా జీవితాల్లోకి చొచ్చుకొచ్చే మార్పుచేర్పులు... ఇవే విహారి కథాసామగ్రి. ఊహాపోహలు, కల్పనలు, కృత్రిమ సందర్భాలు, జీవంలేని సంఘటనలు, వాస్తవదూర వాతావరణం... ఇవేవీ ఈ కథల్లో కనిపించవు.

ఈ కథల్నిండా మనుషులుంటారు. మమతలుంటాయి. అనుబంధాలు, ఆరాటాలు, కలవటాలు, కలిసుండటాలు, విభేదాలు, విడిపోవటాలు... ఇవన్నీ అక్షరాల్లోంచి ఎగిరొచ్చి మనముందు పక్షుల్లా వాలతాయి. కువకువలాడుతూ ఆ పరిణామాలను వివరిస్తాయి.

ప్రతి మనిషీ మోయక తప్పని బరువు- బాధ్యత. జీవన గమనంలో అనుభవం మీద పడేకొద్దీ బాధ్యత అదనపు భారం మోపుతుంది. 'వలయం' కథలో 'ఆయన'కు పెళ్లి చేయటం ఓ బాధ్యత. కోడలికి సాయంగా పల్లె నుంచి పనిమనిషిని ఢిల్లీకి పంపటం ఓ బాధ్యత. అయిన వాళ్లకు సంబంధాలు కుదర్చటం, ఆనక ఆలుమగల మధ్య రాజీలు కుదర్చటం, కోడలి ప్రతిపాదనతో ముడిపడిన చిన్న కొడుకు పెళ్లి విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి రావటం... ప్రతి బాధ్యతా ఆయన మోయక తప్పని బరువే! "ముప్ఫై ఏళ్ళనాడే తండ్రి ఉండి కూడా కుటుంబంలో సంపాదనాపరుడిగా, ఏకైక పుత్రుడిగా అన్ని బాధ్యతల్నీ స్వీకరించాల్సి వచ్చిన' ఆయన 'ఏమిటీ బతుకు నడక? బాధ్యతల వలయంలోనేనా?' అనే ఆలోచన్ల మధ్య నలిగిపోయిన తీరును విహారి చిత్రీకరించిన తీరు అద్భుతం.

తరాల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. ఆధునిక సౌఖ్యాల సంకెళ్లలో చిక్కుబడిపోతున్న యువత అలవాట్లను

మొన్నటి తరం జీర్ణించుకోలేకపోతోంది. అవసరాలూ ప్రాధాన్యాలూ మారుతున్నాయి. రుచులూ అభిరుచులూ భిన్నంగా ఉంటున్నాయి. 'కొత్త నీరు' కథలోని పెద్దాయనకు మనవడి వేషధారణ నచ్చదు. మనవరాలి టాటూ నచ్చదు. గదులు అస్తవ్యస్తంగా ఉండటం నచ్చదు. అటు పెద్దోళ్లకు నచ్చజెప్పాలో, ఇటు ఈ తరాన్ని బుజ్జగించాలో తెలీక నిన్నటి తరం నిశ్శబ్దంగా ఉండిపోతోంది. చూస్తూ కూచోలేని పెద్దాయన మాత్రం సూచనలూ హెచ్చరికలూ జారీ చేస్తూనే ఉన్నాడు. ఏమైంది మరి? ఆయన మాటలు పిల్లల చెవుల వద్దే ఆగిపోయాయా లేక మనసు దాకా ప్రయాణించి మార్పునకు బీజం వేశాయా? ఆసక్తికర కథనంతో ఆకట్టుకునే ఈ కథ చదివి తీరాల్సిందే.

'నేనంటే యిట్టంగుండు. లేదంటే ఆ యమ్మాయి గతే' అని ఓ పోకిరీ బెదిరింపు! 'ఎట్టా పెంచేదే బిడ్డా నిన్ను? ఏం చేయించేదే? ఏడ దాచగలనే తల్లీ? పెట్టవన్నా కాకపోతివే– ఏ గంపకిందో దాచేదాన్ని' అని ఆ తల్లి ఆక్రోశం. ఇవాళ్టికీ మండుతున్న సమస్య గురించి ఒకటిన్నర దశాబ్దాల క్రితమే రాసిన కథ 'బతుకంత చావు'.

మునసబు కొడుకు సూరి, మునసబు దగ్గర పాలేరుగా పనిచేసే సుబ్బయ్య కొడుకు చంద్రం క్లాస్‌మేట్స్. ఓ సందర్భంలో ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. యాభై తాటిముంజలు తింటే అయిదు రూపాయలిస్తానని పందెం కడతాడు సూరి. చంద్రం సరేనంటాడు. పందెం మొదలైంది. మన కళ్లు అక్షరాల వెంట పరుగులు తీస్తుంటాయి. ఒక దశలో 'అసలు ఇదేం పందెం! ఇదేం కథ?' అని మనలో ఏదో అసంతృప్తి మొదలవుతుంది. కానీ, ఒక బరువైన ముగింపు వాక్యం మనల్ని పట్టి కుదిపేస్తుంది. అక్కడే రచయిత అనుభవం అబ్బురపరుస్తుంది. అతి సాధారణంగా కనిపించే సూరి, చంద్రం పాత్రల ద్వారా కలిమి లేముల అంతస్సారాన్ని తెలియజెప్పిన తీరు ప్రశంసనీయం. ఈ కథకు 'చిరంజీవి ఆశ' అనే శీర్షిక పెట్టడం సముచితం.

పాపపుణ్యాలు కేవలం ఊహాకల్పనలేనా? అవి నిజంగా మన చుట్టూ పరిభ్రమిస్తాయా? మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయా? తండ్రి చేసిన పాపం కొడుక్కి గాయం చేస్తుందా? తాత చేసిన పుణ్యం మనవరాలిని శిఖరం ఎక్కిస్తుందా? అన్నీ తాత్విక ప్రశ్నలే. సమాధానాల కోసం సంఘటనల్ని జల్లెడ పట్టాలి. జీవనఖాతాలో జమ పడుతున్న సుఖదుఃఖాలను విశ్లేషించుకోవాలి. 'ఇల్లు– ఒక చేదు మాత్ర' కథలోని రామ్మూర్తి జీవితాన్ని ఇదే కోణంలో సాకల్యంగా విశ్లేషించారు విహారి.

తల్లి చనిపోయినప్పుడు విదేశాల్లో ఉన్న కొడుకులిద్దరూ వచ్చారు, వెళ్లారు. తండ్రి మంచాన పడ్డాడు. పనిమనిషి సాయంతో వెంకటేశ్వర్లు (బాబాయి) చూసుకుంటున్నాడు. ఇండియా వచ్చిన పెద్ద కొడుకుతో 'ఇక నా వల్ల కాదు, మీ నాన్నను మీరే చూసుకోవా'లంటూ వెంకటేశ్వర్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. స్టీలు సామాను అమ్ముకునే దంపతుల రూపంలో కాస్త ఆదరవు దొరుకుతుంది. ఆ విషయాన్ని చిన్న కొడుకు మాధవకు చెప్పినప్పుడు, అతని భార్య అడిగిన ప్రశ్నకు వెంకటేశ్వర్లులో కోపం కట్టలు తెంచుకుంటుంది. ఫోన్ పెట్టేసి వెంకటేశ్వర్లు అన్న మాటలు...

"వాడేమో రామయ్యా యాదమ్మా చేయబోయే సహాయంలో వ్యాపార సంబంధాన్ని చూస్తున్నాడు. ఈవిడేమో– తన చెల్లెలు ఇంగ్లీష్ వాణ్ణి చేసుకున్నా ఆమోదించిన అభ్యుదయవాది– ఇక్కడ కులప్రసక్తి తెస్తోంది. ఇంతలో వుంది మానవ సంబంధాల విలువ! వీళ్ళ మనసులన్నీ ఇరుకూ మురికీ!"

కథాసమయానికి కనకాభిషేకం చేస్తూ 'రోగం' కథలో ఓ పాత్ర ద్వారా ఈ ఆగ్రహ ప్రకటన చేసిన విహారి గారి సాహితీ పరిజ్ఞానానికి ప్రణామాలు.

గంపెడు సంసారాల్ని ఈ తరం పిల్లలు చూసి ఉండక పోవచ్చు. నిన్న మొన్నటిదాకా ఆ సంసారాల సమాహారమే సమాజం. తాతతండ్రులు, జేజమ్మలు, అమ్మలు, చిన్నమ్మలు, పెద్దమ్మలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, వదినా మరదళ్లు, బావలు, మరుదులు... వీరందరి సారథి ఆ కుటుంబ పెద్ద. అతడి లేదా ఆమె బాధలూ బాధ్యతలూ దేవుడికే ఎరుక. ఎన్ని ఇబ్బందులున్నా అందరినీ సమన్వయం చేసుకుంటూ, అందరి అవసరాలూ తీరుస్తూ, అంతిమంగా రాత్రి ఏకపంక్తి భోజన సూత్రాన్ని పరిరక్షించగలిగే ఆ కుటుంబపెద్ద నైపుణ్యం అనిర్వచనీయం. 'మౌనలిపి' కథలోని వదిన పాత్ర ద్వారా ఆ పెద్దరికాన్ని దృశ్యమానం చేశారు రచయిత.

సుభద్ర, ఆమె భర్త టీచర్లు. రిటైరైనా, భర్త మరణించినా ఆమె అదే ఊరిని అంటిపెట్టుకొని ఉంటుంది. ఉదయం నుంచీ సాయంత్రం దాకా వివిధ సేవాకార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటుంది. తల్లిని తన వెంట తీసుకెళ్లాలనుకుంటాడు కొడుకు భాస్కరం. తల్లి తిరస్కరిస్తుంది. భాస్కరం, అతని అక్క పద్మ కలిసి ఆస్తుల పంపకంపై వ్యూహం రచిస్తారు. వారి పథకాన్ని పసిగట్టేసిన తల్లి తెలివిగా స్పందించిన తీరు రచయిత ఊహాశిల్పానికి ప్రతీక. ఈ కథకు 'దోసిట్లో నీళ్ళు' అనే శీర్షిక పెట్టాలన్న ఆలోచన అంత తేలిగ్గా రాదు.

■■■

ఈ సంపుటిలోని 'ప్రాప్తం' కథను ప్రత్యేకంగా ప్రస్తావించ దలిచాను. వర్ధమాన రచయితలకు పాఠం వంటిది ఈ ప్రాప్తం. ప్రారంభం చూడండి...

"దుర్దినం. కాకపోతే అంతమాట అంటాడా? మాటా అది?

కొలిమిలో ఖణఖణ కాల్చితీసిన కడ్డీతో పెట్టిన వాత!
పుండు సలుపుతోంది."

కథకు క్లుప్తత ప్రాణం. ఒకే ఒక్క పదవాక్యంతో కథను ప్రారంభించటం ఓ సాహసం.

ఏమాత్రం ఆలస్యం చేయకుండా మన ఆసక్తిని కొలిమిలా మండించే మరో వాక్యం. ఆగుతామా! అమాంతం మనం కూడా ఆ సాహసయాత్రలో భాగం కామూ! ఈ కథలోని ప్రతి విభాగం చివరా 'పుండు సలుపుతూనే ఉంది' అనే వాక్యం ఉంటుంది. ఆ గాయం తాలూకు బాధను అనివార్యంగా మనం కూడా అనుభవించి తీరాల్సిందే.

ఈ కథలోని మరో విశేషం– వాక్యాల మధ్య గొలుసుల నిర్మాణం! చెట్టు మీదున్న చిన్ని ప్రాణి ఒక కొమ్మ నుంచి మరో కొమ్మకు చెంగుచెంగున దూకుదున్న దృశ్యం కనువిందు చేస్తుంది. అట్లాగే పదాల నుంచి పదాలు పొంగుకొచ్చి, అవి వాక్యాలుగా రూపాంతరం చెందుతూ కథనం చిక్కగా ఆవిష్కృత మవుతుంటే పాఠకుడిలో ఉద్విగ్నమైన అనుభూతి ఉప్పొంగుతుంది. ఉదాహరణకు...

"సున్నకి సున్న. హళ్లికి హళ్లి. మళ్లీ మళ్లీ పాత సామెత? పాత ఏడుపు. కరి మింగిన వెలగపండు!

'కరి' ఎవరు? హరి. అవును హరి.

హరి ఏం చేశాడు? హరించేశాడు. హరియను రెండక్షరములు హరియించును!"

ఇట్లా పదాలను ఒరుసుకుంటూ వాక్యాలు, వాక్యాలను హత్తుకుంటూ పేరాలు కథను చిక్కబరుస్తాయి.

"వెల్లకిలా పడుకున్నాను. గోలీకాయల్లాంటి కళ్లతో చూస్తున్నాను. పేరుకు ఇల్లు. పెంకు జారిన కప్పు. పొగచూరిన బొంగులు. బూజుపట్టిన మూలలూ, మసిబారిన బాదులూ. పక్కకి చూస్తే– మసిగుడ్డ కట్టినట్లు నల్లచారికల గోడలు. పాతవాసన వేస్తున్న సామాను. కుంటి కుర్చీ. విరిగిన రెండు బెంచీలు..." అంటూ సుదీర్ఘ జీవన ప్రస్థానాన్ని కథానాయకుడితోనే చెప్పించిన విధానం వైవిధ్య భరితం. మనసు ప్రక్షాళన పొందితే మునుల శాపాలు సైతం గాల్లో కలిసిపోతాయని; స్వచ్ఛమైన, పవిత్రమైన జీవనాశయంతో సంసారాన్ని సవ్యంగా నడిపించవచ్చుని 'ప్రాప్తం' ప్రాథమిక సందేశం.

"చలనం" కథలో "పెరట్లో పాడుబడిన బావి– వంటింట్లో దణ్ణెం మీది మడిబట్టలు– తల వెనక్కు మొలిపించే నాన్న అర్చకత్వం– పులుసులో పడిన బొద్దింకల్లా ఇంట్లో ఆడవాళ్లు – ఆ యింటి జనానికే మూసుకుపోయిన లోవాకిళ్ల"ను ఛేదించుకుని– ఉనికినీ ఆచారాల్నీ వదిలిపెట్టి పరుగులు తీసిన శ్రీనివాస్ జీవిత చలనం మన ఊహకందదు. అరటిపండు ఒలిచినట్లుగా సాఫీగా నడిపించి, ఆఖరికి శుభం కార్డుతో ముగింపు పలికే కథలు వెలువడుతున్న 1980లలోనే నర్మగర్భ శైలితో విహారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ముగింపులో పాఠకుడికీ భాగస్వామ్యం కల్పించే పరిణతితో వ్యవహరించారు.

ఆలుమగలంటే సుఖదుఃఖాల సంగమం. చీకటివెలుగుల సమ్మేళనం. "గోరంత దీపం" కథలో భార్యను గెలిపించాలని శివయ్య, భర్తను గెలిపిస్తూ ఉండాలని జయమ్మ అమలు పరిచే అన్యోన్య సూత్రాలు అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ తిరుగులేని సాంకేతిక చిట్కాలు. 1983లోనే ఇంత అద్భుతమైన కథ రాశారంటే నమ్మశక్యం కాదు.

చాలా సమస్యలకు భూమి అమ్మకమే పరిష్కారంగా మారుతున్న అంశాన్ని 'భూ'మధ్యరేఖ కథలో సీరియస్‌గా చర్చించారు. ఓ పెద్దాయన బతుకు పుస్తకంలోని అధ్యాయాల అభినందనీయ సారాంశం "పోల్చుకోగల రాతే!".

■■■

పాత్రల నిర్మాణంలో రచయిత పనిమంతుడై ఉండాలి. పునాదుల్లేకుండా ఎవరెవరినో ప్రవేశపెడుతూ పోతే కథ గందరగోళంగా తయారవుతుంది. కథలమేస్త్రిగా రాణిస్తున్న విహారి గారి నుంచి ఈ మెలకువలు తెలుసుకోవాలి. ఉదాహరణకు 'భ్రష్టయోగి' కథానాయకుడి ద్వారా అతని తల్లిదండ్రుల్ని కథలోకి ఎలా ఆహ్వానిస్తారో చూడండి...

"మా నాన్న మండువా అరుగుమీద పడుకుని రాత్రుళ్లు గొంతెత్తి ఏ త్యాగరాజ కీర్తనో, భజగోవింద శ్లోకాలో ఎత్తుకుంటే ఆ రాగ ప్రస్తారంలో కమ్మతెమ్మరలు ఊరంతటికీ మధుర స్పర్శలిచ్చేవి. మా అమ్మ ఏభై యేళ్ల క్రితమే పదో తరగతి. నాన్న సాన్నిహిత్యం, వేణుగోపాలస్వామి దేవాలయంలో పురాణ శ్రుత పాండిత్యం ఆమెకీ యింత మర్యాదా, మన్ననా, మంచీ, మాటతీరూ వొంట పట్టించాయి".

ఇట్లా హాయిగా, హృద్యంగా సాగుతున్న కథనం హఠాత్తుగా కుదుపులకు గురవుతుంది. ఊపిరి తీసుకోవటం మర్చిపోయిన పేషెంటులా మనం గింజుకుంటాం. కాలం విసిరిన వలలో చిక్కి, శల్యమైన తన తండ్రి వైఖరిలో వచ్చిన మార్పుల్ని కళ్లప్పగించి చదువుతుంటాం. అదీ, రచయిత విజయం.

పదాల సమాహారం పదునుగా ఉంటేనే వాక్యం భావగర్భితంగా ఉంటుంది. వాక్యం రసభరితంగా ఉంటేనే కథనం కమనీయంగా ఉంటుంది. 6500కు పైగా పద్యాలతో పదచిత్ర రామాయణం రచించిన పండితుడికి భాషపై ఎంత పట్టు ఉంటుందో ఊహించుకోవచ్చు. ఆ సామర్థ్యం ప్రతి వాక్యంలోనూ కనిపిస్తుంది. కథారచనలోనూ ఆ భావగాంభీర్యం అడుగడుగునా తొణికిసలాడుతుంది. కొన్ని వాక్యాలు చూడండి...

*వాతావరణం మూఢంగా ఉంది. మాటలు ఆశ్చర్యాన్ని దొర్లించినై. (రోగం)*

*వడగాలి వసారాని దాటి నడవని దబాయిస్తున్నది. (దోసిట్లో నీళ్ళు)*

*పరామర్శ సాగింది. తన ప్రవర చెప్పుకున్నాడు. బతుకు దౌర్భాగ్యపు చినుగుల్ని కప్పుకోకుండా, విప్పుకున్నాడు. (ప్రాప్తం)*

*నరనరాల్లో వొక్కసారిగా ఆ ఘటన తాలూకు పులుపుదనం వ్యాపించింది! (గోరంత దీపం)*

*పెరట్లో మందారచెట్టు దిగంబరంగా స్నానం చేస్తోంది. గడ్డివాములు తడిసిన ఏనుగుల్లా నిలబడి వున్నై. (గోరంత దీపం)*

*సూర్య శకలంలా మండిపోతున్నాడతను; ఇరుసున బెట్టిన కందెనలా కారిపోతున్నాడతను! (చలనం)*

*మనసంతా గచ్చపొదలా ఉంది. (సహజాతాలు)*

*మనిషికి భూమి అంటే దేశానికి జెండా వంటిదర్రా.*

*('భూ'మధ్యరేఖ)*

■■■

పాతకాలం నాటి ఇళ్లు, వాకిళ్లు, భోషాణం, కావడిపెట్టి, కవిలెకట్ట, గంగాళం, ఎద్లు, గేదెలు, రైతులు, రైతుకూలీలు, శ్రమ జీవనం, సంఘటిత సంసారాలు; కాలానుగుణంగా అవన్నీ బక్కచిక్కిపోతున్న దుఃఖభరిత దృశ్యాలు ఈ కథల నిండా కనిపిస్తాయి.

ఆధునిక యుగపు అవలక్షణాలు కనిపిస్తాయి. మనసుల మధ్య విస్తరిస్తున్న అగాథాలు కనిపిస్తాయి. అగాథాలు చదును చేసుకోటానికి అవసరమైన మౌలిక సూత్రాలు కనిపిస్తాయి. పురాజ్ఞాపకాల్లోంచి పునర్నిర్వచించుకోవాల్సిన మానవీయ మూలాలు కనిపిస్తాయి. నండూరి రాజగోపాల్ తన ముందు మాటలో అన్నట్లు... "చాలామంది కథకులు కొంతకాలానికి పెన్ను మూసేసినా, కళ్లజోడు తీసేసినా విహారి మాత్రం నిర్విరామ శ్రామికుడిగా కథా వ్యవసాయాన్ని చేస్తూనే ఉంటారు".

తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన కథాసంపుటి 'విహారి కథలు'.

**(ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకొన్న విహారి ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ప్రతిభా పురస్కారం పొందారు)**

■

**"సాగిపోవుటె బతుకు**
**ఆగిపోవుటె చావు**
**సాగిపోదలిచిన**
**ఆగరాదిచటెపుడు "**



– కాళోజి



## మట్టి ప్రేమ

**కా**సింత కాలం వెళ్ళిపోయాక
గుండెలో దిగులు తన్నుకొస్తుంది.

జ్ఞాపకాలు పిలుస్తున్నట్లు
ఊరి పొలిమేర పలవరిస్తున్నట్లు
ఇంకా సమయమౌతున్నట్లు
గూటికి చేరుకోమనే సందేశం
వంత పాడినట్లు
మనస్సంతా భారంగా ఉంటుంది.

కళ్ళలో పొలాలు
కన్నీళ్ళలో అనుభవాలు
అనుబంధాలు దొర్లి
ఇప్పుడున్న చోట నిల్చోనీయవు.

పక్షులు ఎంత దూరం కదిలినా
గూటిని మరవనట్లు
చూపులు ఇంటివైపే
దుముకుతుంటాయి.

ఉద్దేశం విశ్వమానవుడిగానే
అయినా
కాలం పొరలు కదిలిన కొద్దీ
నా మట్టి వేళ్ళు లాగుతుంటాయి.
నా మట్టి ప్రేమ
నా మూలాలికి చేర్చుతుంది.
ఇప్పుడు కుదురుగా ఉండలేను
నా మట్టి పై అలా వాలేవరకూ ...!

**– గవిడి శ్రీనివాస్**
70192 78368



# చచ్చేంత ప్రేమ

హిందీ మూలం : **రాధేశ్యామ్ భారతీయ**
అనువాదం : **డా. వెన్నా వల్లభరావు**

"**ను**వ్వు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నావా?" గదిలోకి అడుగు పెట్టగానే ఆ వ్యక్తి వేసిన మొదట ప్రశ్నే అది.

"నీకు ఏ పని చెయ్యమని డబ్బిచ్చానో, అది పూర్తిచేసి వచ్చావా లేదా?" టేబుల్ ముందు కూర్చున్న యువకుడు కరుకు స్వరంతో కోపంగా అడిగాడు.

"ముందు నేను అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పు"

"సమాధానం చెప్పాల్సింది నువ్వు, నేను కాదు. నీకు డబ్బిచ్చింది నేను. అందువల్ల ప్రశ్న వేసే హక్కు నాకే ఉంది" కోపంతో నాలిక మడత వేశాడు యువకుడు.

"ఇదిగో నువ్విచ్చిన వెధవ డబ్బు" జేబులో నుంచి నోట్ల కట్ట తీసి టేబుల్ పైకి విసిరి కొట్టాడు ఆ వ్యక్తి.

"అంటే, నువ్వు ఇచ్చిన మాట తప్పుతున్నావా?"

"అలా అని నేను అనలేదే! చేస్తాను, కానీ నేను వేసిన ప్రశ్నకి నీ సమాధానం తెలుసుకున్న తర్వాత."

"తెలుసుకోవాలని అనుకుంటున్నావా? అయితే విను. నాకు ఆ అమ్మాయంటే చచ్చేంత ప్రేమ. పొద్దున లేవగానే అందరూ దేవుణ్ణి తలుస్తారు, కానీ నేను మాత్రం ఆ అమ్మాయినే తలుస్తాను. ఆ అమ్మాయి నామ జపమే చేస్తాను రోజంతా. రాత్రి నిద్రపోయే ముందు నా స్మృతిలో తానే, కలల్లో కూడా తానే... నన్ను పిచ్చివాణ్ణి చేసేస్తుంది. ఆ అమ్మాయి కనపడాలని నేను అనుక్షణం తపిస్తూ ఉంటాను. తన అందం నన్ను తన్మయుణ్ణి చేసేస్తోంది. ఆ బ్రహ్మదేవుడు ఎంతో తీరుబడిగా తనని తయారుచేసుంటాడు. తన కళా నైపుణ్యాన్నంతటిని ఆమెను రూపుదిద్దటానికే ఉపయోగించడేమో అనిపిస్తుంటుంది నాకు. దేవుని మీద ఒట్టు, ఆ అమ్మాయి నాకు దక్కితే ఈ లోకంలో నన్ను మించిన అదృష్టవంతుడు ఎవరూ లేరని భావిస్తాను. కానీ, తాను నావైపు కన్నెత్తి చూడటానికి కూడా ఇష్టపడటం లేదు. ఎదురుపడితే తల తిప్పుకుని వెళ్ళిపోతోంది" అని ఆక్రోశంతో ఎదురుగా ఉన్న టేబుల్‌పై పిడికిలితో గట్టిగా ఒక గుద్దు గుద్దాడు.

"నీ మాటల్ని బట్టి చూస్తే నువ్వు ఆ అమ్మాయిని నిజంగానే ప్రేమిస్తున్నట్టు కనబడుతోంది. నువ్వు ఆమె కోసం ఏమి చెయ్య గలవో చెప్పు?"

"కొండమీద కోతిని తెమ్మన్నా తీసుకొస్తాను. ఆకాశం నుంచి చంద్రుణ్ణి-నక్షత్రాల్ని తెమ్మన్నా తెస్తాను."

"ఆ ఆ చాల్లే అపు. నీ పిచ్చి కవిత్వం వినటానికి నాకు టైమ్ లేదు. నువ్వు ఆ అమ్మాయి పేరు తలుచుకుని ఈ బిల్డింగ్ మీద నుంచి దూకమంటే... దూకుతావా?"

"దూకి చూపించమంటావా?"

"అక్కర్లేదులే... నువ్వు దూకగలవు."

"ఒకవేళ నీ రెండు చేతులు కట్టేసుకోమని చెప్పాననుకో, కట్టుకోగలవా?"

"తాడు ఉందా నీ దగ్గర?"

"ఉంది. కానీ చిన్నది" అని జేబులో ఉన్న తాడు తీసి యువకుడి వైపు విసిరేశాడు.

"నువ్వే కట్టెయ్యి" నువ్వే వెళ్ళి ఆ అమ్మాయితో 'నీ ప్రియుడు నీ పట్ల ప్రేమతో ఏమి చెయ్యమన్నా చెయ్యటానికి వెనకాడలేద'ని చెబుదువుగాని. అది సరేగానీ, ఇంతకీ నా చేతులు కట్టేయాలని ఎందుకు అనుకుంటున్నావు?"

"ఇప్పటి దాకా డాంబికాలు పలికావు. ఇది చేస్తాను, అది చేస్తాను అని. ఇప్పుడేమో..."

"సరేలే కట్టేసెయ్యి..." చేతులు చాచాడు యువకుడు.

ఆ వ్యక్తి ముందుకొచ్చి యువకుడి రెండు చేతులు కట్టేశాడు.

"ఇప్పుడు నీ ప్రశ్నకి సమాధానమూ దొరికింది, నా చేతులు కట్టేయాలన్న నీ కోరికా నెరవేరింది. ఇక ఇప్పుడు చెప్పు.. నీకు అప్పగించిన పని ఎప్పటికి పూర్తిచేస్తావు?"

"పని అయిపోయింది."

"అయిపోయిందా? నిజామా? దాని మొఖంమీద యాసిడ్ పోశావా? కాలిపోయి ఉంటుందిగా దాని మొఖం! ఎంత పొగరో దానికి, తాను పెద్ద అందగత్తెనని! ఒక్కసారిగా పెద్దపెట్టున అరిచి ఉంటుంది బాధతో. లబోదిబోమని కేకలు పెట్టుంటుంది. చెప్పు చెప్పు ఎలా అరిచింది.. ఎలా ఏడ్చింది..?" అంటూ సంతోషం తో కుర్చీనుంచి ఎగిరినంత పనిచేశాడు.

"చెప్పటం ఎందుకు, చూపించమంటావా?"

"ఆ.. ఆ.. చూపించు, చూపించు భలే మజాగా ఉంటుంది. చూపించు."

"నేను కాదు. నువ్వు చూపిస్తావు, నువ్వే..."

"నేనెలా చూపిస్తాను? ఆ అమ్మాయి బాధతో గిలగిలలాడటం నేను చూడలేదుగా!"

"ఏమీ పర్లేదు. ఇప్పుడు గిలగిలలాడేటట్టు చేస్తానుగా! ఈ సీసాలో సగం యాసిడ్ మిగిలి ఉంది. దీన్ని అనవసరంగా పార బోయటం ఎందుకు, సద్వినియోగం చేద్దామని అనిపించింది. ఎక్కడో ఎందుకు నీ మొఖం మీదే ఉపయోగిస్తే పోలా?"

"పిచ్చేమన్నా ఎక్కిందా నీకు?"

"పిచ్చోడిననే అనుకో"

"వద్దు... వద్దు... నువ్వలా చెయ్యలేవు"

"ఎందుకు చెయ్యలేను? ఒక అమ్మాయి మొఖంపై యాసిడ్ పోయగలిగినవాణ్ణి నీమీద ఎందుకు పోయలేను? నేను మూడు లెక్క పెడతాను. ఒకటి... రెండు..."

"వద్దు, వద్దు... అంతపని చెయ్యొద్దు..."

"పోసేది పోసేదే. నువ్వు అరిసినా– గీపెట్టినా పోసే తీరతాను. అరువు. అరువు, ఎంత గట్టిగా అరవగలవో అరువు. నీ అరుపులు– కేకలు ఆ అమ్మాయి కేకల కంటే హృదయ విదారకంగా అయితే ఉండవు. నేను చాలామంది అమ్మాయిల అరుపులు, గావుకేకలు విన్నాను. వాళ్ళ అరుపులు ఆకాశపు గుండె చీల్చుకొని వెళ్ళి ఆ పరమాత్మ చెవుల చెంతకు చేరి 'నువ్వు సృష్టించిన ఆడబిడ్డల ఆర్తనాదాలు నీకు వినపడటం లేదా' అని ఆయన్నే అడుగుతున్నాయి. అరువు.. అరువు! ఏ తెల్ల తోలు చూసుకుని నిన్ను నువ్వు హీరో అనుకుంటున్నావో, క్షణంలో ఎలా మాడిపోతుందో చూద్దువుగాని. అప్పడంగా మారి లేచి వచ్చేస్తుంది నీ తెల్ల తోలు కాస్తా, కాసేపట్లో..."

"వద్దు..వద్దు, నీ కాళ్ళు పట్టుకుంటాను. అంతపని చెయ్యొద్దు. నన్ను క్షమించు. ఆ భయంకరమైన బాధ నేను భరించలేను...!"

"అరె, మగాడివై ఉండి భయపడ్డావా? మరి ఆ అమ్మాయి... పాపం అమాయకురాలు. తాను చేసిన తప్పేమిటి? చెప్పు... చెప్పు?" అరిచి కోపంతో యువకుడి ముందున్న టేబుల్ని కాలుతో ఒక్క తన్ను తన్నాడు ఆ వ్యక్తి. టేబుల్ తిరగబడింది.

"నాది తప్పు..."

"అయితే శిక్ష నీకు కదా పడాలి" అని ఆ వ్యక్తి యాసిడ్ బాటిల్ ఎత్తాడు. యువకుడు విలవిలలాడుతూ కేకలు వేశాడు, ప్రాధేయపడ్డాడు.

"వద్దు.. వద్దు, నన్ను క్షమించు. కాపాడండి. నేను చచ్చిపోతాను...!" అరుస్తూ కుర్చీలోంచి కింద పడ్డాడు.

అవేమీ పట్టించుకోకుండా బాటిల్ అతనిపై గుమ్మరించాడు ఆ వ్యక్తి.

"ఇదేంటి? అరె, నాకేమీ కాలేదు. హమ్మయ్య నాకేమీ కాలేదు. బతికిపోయాను. లేకపోతే నా జీవితం... అమ్మో!... బహుశా యాసిడ్ నకిలీదై ఉంటుంది."

"...ఒకవేళ అసలైనదే అయ్యుంటే?"

"అమ్మతోడు, ఆ బాధ భరించలేక, అందవికారంగా బతకటం ఇష్టంలేక నేను ఆత్మహత్య చేసుకునేవాడిని."

"ఒరేయ్ దుర్మార్గుడా! మరి ఆ అమ్మాయి గురించి ఆలోచించావా? నీ జీవితం నీకు ప్రియమైనదైతే, ఆమెకి కూడా తన జీవితం ప్రీతిపాత్రమైనదే కదా! నువ్వు ప్రేమ అని దేన్నైతే అంటున్నావో, నిజానికి అది ప్రేమే కాదు. ఎవరినైనా దక్కించుకోవాలనుకోవటం ప్రేమకాదు. ఎవరి కోసమైనా త్యాగం చెయ్యటం ప్రేమ. నిజంగా ప్రేమించినవాళ్ళు తమ ప్రియురాళ్ళ నడిచే బాటలో సంతోషాల పుష్పాలు పరుస్తారు గానీ నీలాగా ముళ్ళు పరవరు. మీలాంటివాళ్ళకి వాస్తవంగా ప్రేమంటే అర్థమే తెలియదు. కోరికని, కామాన్ని ప్రేమ అనుకుంటున్నారు. నీకు ఆ అమాయకురాలి పట్ల ఉన్నది ప్రేమ కానే కాదు. ప్రేమే అయితే నువ్వు ఎన్నటికీ ఇలాంటి అకృత్యానికి పాల్పడి ఉండేవాడివి కాదు."

"ఇక చాలు నువ్వు మాట్లాడింది. ఇంకా ఎక్కువ మాట్లాడకు. నిన్ను ఊరకే పని చెయ్యమని కోరలేదు నేను."

"ఛీ.. ఛీ.. నీ పాపిష్టి డబ్బు ఎవడిక్కావాలిరా? మేము కబ్జా అయిన ఆస్తుల్ని విడిపించి లక్షలు సంపాదించగలం, కానీ ఒక ఆడపిల్లపై ఇలాంటి అఘాయిత్యం మాత్రం ఎప్పుడూ చెయ్యం. నువ్వు జ్ఞాపకం పెట్టుకో, ఇకమీదట ఇలాంటి ఆలోచన మళ్ళీ ఎప్పుడైనా నీ మెదడులో పుట్టిందా, ఈ నకిలీ యాసిడ్ని అసలైనదిగా మార్చటానికి పెద్ద టైమేమీ పట్టదు. సిగ్గు తెచ్చుకుని బుద్ధిగా మసులుకో!" అని ఆ వ్యక్తి వెళుతూ వెళుతూ యువకుణ్ణి కాలితో గట్టిగా ఒక తన్ను తన్నాడు. ■

## ఆకలి

చెత్త కుండీలో ఉత్తగనే పాచిపోవాలా అని...
చిరిగిన విస్తరాకులనంటిన మెతుకులు
మొత్తుకుంటున్న ఘోష
చిల్లులు పడిన కర్ణభేరుల నుంచి కారిపోతోంది...
ఓ మసిబారిన పసితనపు
పవిత్ర హస్తాల స్పర్శతో
ఆ మెతుకుల్లో మెరుపొచ్చింది...
హఠాత్తుగా
వెనకనున్న ఓ శునకం ఆ పసితనాన్ని పక్కకు నెట్టింది...
ఘనీభవించాల్సిన ఆ దృశ్యం
కన్నీరై కారిపోయింది...
పసితనం పాచి పోయి మనిషి తనం లేచి పోయి
భారతావనిలో సోమాలియాను
పరకాయం చేస్తుంది!
కడుపులు పొయ్యిలోని కట్టెల్లా కాలుతున్నా
ఆకలి వంటను ఉడికించలేకపోతున్నాయి...

బడా బాబుల పెళ్లిళ్లూ సందళ్లలో
వండిన క్వింటాళ్ల కొద్దీ వంటకాలను
పెంట పాలు చేస్తున్నారు...
ప్రతిష్ట కోసం ప్రదర్శించే ప్రతీ వంటకం
కంట నీరు పెడుతోంది...!

వ్యర్థమౌతున్న అన్నం మెతుకులు అన్నీ కలిపితే
ఎన్నో బతుకుల ఆకలి మంటలను ఆర్పేస్తాయి...
ఆ మెతుకులనేరుకొచ్చి
ఎండిన కడుపులను నిండుగ నింపేటి
దండి చూపున్న 'అన్నం'అయ్యలం అవ్వాలి...!

- అల్లాడి శ్రీనివాస్
85559 09060



## చివరిగా ఒక్క మాట!

మోసుకెళ్తున్న కాలానికీ తెలుసు
మోసానికి ఎక్కడో వీడ్కోలు పలకాల్సిందేనని
తరుముకొస్తున్న గాలానికీ తెలుసు
తప్పుచేసిన నీడను కూడా వదలకూడదని
అయినా, ఈ మనిషెందుకో..
వంచనను పెంచుకుంటూ
కుసంస్కారులను వంధిమాగదులుగా పోషించుకుంటూ
దీర్ఘాయుష్మడినని భ్రమపడుతున్నాడు!

నమ్మిన స్నేహానికి నయవంచనే ఫలితమని
కంచే చేను మేస్తుంది ఒక పక్క..
చిమ్ముతున్న విషంతో చిరునవ్వులు మొలిపించుకుని
కాటేసే కామపిశాచాలొక పక్క.
పెంచుకున్న ప్రేమలన్నీ యమపాశాలేనని
తెగిపడిన బొడ్డు పేగు తెగేసి చెబుతోంది మరో పక్క

కాలం ఇప్పుడు కత్తుల వంతెనమీద నడుస్తోంది
మనిషిని మనిషి నమ్మని రోజులు దాపురించాయి
బంధుత్వాలన్నీ బందిఖానాలోకి జారుకుంటున్నాయి
స్వార్థం రంగులద్దుకుని విశృంఖలత్వం చూపుతుంటే
నీతీ న్యాయం నడిబజారులో పంచనామా జరుపబడుతోంది

పంచభూతాల సాక్షిగా, ప్రలోభాలకు గురై మనిషి
పరకాయ ప్రవేశం చేస్తున్నాడు
నిప్పుల కుంపటిలా మారిన మనసు దాహానికి
తను కాలుతున్న సంగతే మరిచిపోతున్నాడు

చివరగా ఒక్కమాట..!
వ్యర్థంలా మారుతున్న వ్యక్తిత్వాలు
అర్థాన్ని సంతరించుకోవాలి
గాయపడిన మౌనానికి ఓదార్పుల జల్లులు కావాలి
రాయబడే గేయానికి పరిణతి చెందిన పదాలు కావాలి
అనురాగాలను పలికిస్తూ అమృత హృదివై సాగాలి!

- మచ్చ రాజమౌళి
9059637442




# ఎన్నో విశేషాల సమాహారం
# మనకు తెలియని మన పిఠాపురం



- పేపకాయల ప్రసాద్
94907 12967

తెలుగునాట స్థానిక చరిత్రలపై మౌలిక పరిశోధన ఒకప్పటితో పోల్చితే ఇపుడు చాలా తక్కువే కాని... మన సంఘ చరిత్ర బహుముఖ పార్శ్వాల మీద వ్యయ ప్రయాసలకోర్చి – సమగ్రమైన పరిశోధన జరిపి, ఎన్నో విశేషాలు వెలికితీసి, అమూల్యమైన సమాచారాన్ని అందిస్తోన్న జాస్తి దుర్గాప్రసాద్, ఈమని శివనాగిరెడ్డి వంటి మంచి పరిశోధకులు ఇప్పటికీ కొందరున్నారు. స్థానిక చరిత్రల పరిశోధనను ప్రోత్సహించేందుకు ఏర్పడిన తెలంగాణ సాహిత్య అకాడమీ వారి 'మన ఊరు – మన చరిత్ర' వంటి ప్రణాళికలు ఆంధ్రప్రదేశ్‌లో లేవు. ప్రభుత్వం మాట అటుంచి, ఇప్పటి సాహిత్య పత్రికలు గాని, ఇతర పత్రికలు గాని సృజనాత్మక సాహిత్యానికి... అందునా ఆధునిక కవిత్వానికి, విమర్శకు ఇస్తున్న ప్రాధాన్యం చరిత్రకు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో చరిత్ర రచనకు పూనుకుంటున్న రచయితలు సొంత ఖర్చులతో పుస్తకాలు ముద్రించుకుంటే తప్ప వారు చెప్పదలచిన అంశాలు పాఠకులకు చేరే అవకాశం ఉండటం లేదు. స్థానిక చరిత్రల శకలాలను పూర్వ పరిశోధనల గనుల నుంచి తవ్వి తీసి, వాటినన్నిటిని ఒకచోటికి చేర్చి, ఓ చక్కని చారిత్రక విశేషాల సమాహారంగా పుస్తకం రూపంలో సంతరించడం అనేది పెద్ద సాహసమే. ఆ సాహసాన్ని పిఠాపురం చరిత్ర విషయంలో ధైర్యంగా చేయగలిగారు బండి రాజకుమార్. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రాజకుమార్ తరగతి గదిలో ఒకనాడు అడిగిన ప్రశ్నకు – పిల్లలు అజ్ఞానంతో చెప్పిన సమాధానం – మనకు తెలియని మన పిఠాపురం పుస్తకం పుట్టుకకు ప్రధాన కారణమైంది.

రామగిరిని చూస్తూ – 'తలపోసి, తలపోసి – ఆనాడు యీ స్థలం యేలా వుండెనో... బౌద్ధులు యేమి యేమి చేసేవారో?' అని గురజాడ వారి 'మీ పేరేమిటి' కథలో కథకుడికి కలిగిన జిజ్ఞాస లాంటిదే చరిత్ర పరిశోధకులెందరికో ఉంటుంది! ఆ ప్రేరణతోనే కాబోలు – పిఠాపురంపై మౌలిక పరిశోధనను 50 ఏళ్ల కిందటే దాదాపుగా పూర్తిచేశారు కుందూరు ఈశ్వర దత్తు, కురుమెళ్ళ వెంకటరావు, శ్రీరామ పరబ్రహ్మ కవి వంటి ఉద్దండులు. వీరు పిఠాపురం చరిత్రపై లోతైన పరిశోధన వ్యాసాలు వెలువరించారు. 'కథలు – గాథలు' పేరుతో చెళ్లపిళ్ల వారు, దిగవల్లి వెంకటశివరావు గారు కూడా పిఠాపురం గాథలు కొన్నింటిని కథనం చేశారు. అయితే అక్కడొకటి ఇక్కడొకటిగా ఉన్న ఆయా కథలన్నింటినీ ఒకచోటికి చేర్చి, ఈ తరం పాఠకులకు పరిచయం చేసిన ఘనత మాత్రం బండి రాజ కుమార్‌దే! 2021 ఆగస్టులో ఆవిష్కృతమైన ఈ పుస్తకంలో పొందుపరిచిన అంశాలన్నీ వ్యాసరూపంలోనే ఉన్నా – చాలా మటుకు కథన శైలిలోనే కనిపిస్తాయి. ఏ విషయాన్నైనా – కథల రూపంలో చెప్పినపుడు హృదయానికి హత్తుకునేలా చెప్పే అవకాశం ఉంటుంది. ఈ అభిప్రాయంతోనే If history were taught in the form of stories, it would never be forgotten అన్నాడు రుడ్యార్డ్ కిప్లింగ్ అనే ఇంగ్లిష్ నవలాకారుడు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం ఇప్పుడొక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం. మన దేశంలో ఇపుడు మనుగడలో ఉన్న ప్రధాన ధర్మాల్లో చాలావరకు ఈ పట్టణంలో కనిపిస్తాయి. ఊరినిండా పరుచుకున్న ఇరుకుదారులు, మలుపులు,

మెలికలతో కూడిన పిఠాపురం భౌతిక స్వరూపం – సందర్శకులను పెద్దగా ఆకర్షించక పోవచ్చు కాని.. ఆ ఊరి గర్భంలోను, పరిసర ప్రాంతాల్లోను దాగున్న ఎన్నో చారిత్రక విశేషాలు ఎందరో పరిశోధకులను పిఠాపురం వైపు సదా ఆకర్షిస్తాయి.

శ్రీమచ్చంకర భగవత్పాదులు, మహా వీర జైనుడు వంటి పలువురు ధార్మికులను; ఖారవేలుడు, సముద్ర గుప్తుడు, చాళుక్య పులకేశి వంటి సామ్రాట్టులను; యువాన్ చాంగ్ వంటి విదేశీ యాత్రికులను సైతం ఆకర్షించి, పిఠాపురానికి రప్పించిన చరిత్ర ఈ నేలది. సామ్రాట్టులు మొదలు సామంతుల వరకు ఎందరో వీరుల ప్రతాపాలకు సాక్షిగా నిలిచిన పిఠాపురం క్రీస్తు పూర్వం నుంచి జమీందారీ యుగం వరకు తెలుగు భాషా సాహిత్యాల పోషణతో పాటు దేశ రాజకీయాల్లోను కీలకపాత్ర పోషించింది.

వక్తవ్యాంశాలను ఓ చక్కని ప్రణాళికతో వింగడించి, వాటి మధ్య సమన్వయతను సాధించిన రచయిత సుమారు 240 పుటల్లో, 13 ప్రధాన వ్యాసాలుగా ఈ పుస్తకాన్ని కూర్చారు. మొదటి వ్యాసంలో పిఠాపురం భౌగోళిక – చారిత్రక విశేషాలు వివరించారు. క్రీ.శ.210 నుంచి జమిందారీ వ్యవస్థ రద్దయ్యేంత వరకు ఉన్న చరిత్రను స్థూలంగా పరిచయం చేస్తూ సాగిన ఈ వ్యాసంలో జమిందారీ యుగపు వ్యక్తుల వివరాలే ఎక్కువగా ఇచ్చినప్పటికీ – పిఠాపురం చరిత్ర అనగానే – వెంటనే స్ఫురించేంత పేరు ప్రఖ్యాతులున్న రావు గంగాధర రామారావు, సూర్యరాయ బహుద్దూర్, రాణి చిన్నమాంబల జీవిత విశేషాలను మరో 3 వ్యాసాల్లో పొందుపరచడం సముచితంగా ఉంది.

జైనం, బౌద్ధం, శైవం, శాక్తం, వైష్ణవం, గురు సంప్రదాయం అనే విభిన్న ధర్మాలు పాటించే వారందరికీ పిఠాపురం గొప్ప ప్రదేశమే! దేశంలోనే అత్యంత ప్రాధాన్యమున్న ఆధ్యాత్మిక క్షేత్రంగా పిఠాపురం వన్నెకెక్కిన విశేషాలను తరువాతి వ్యాసంలో కథనం చేశారు రచయిత. సంగీత, సాహిత్య, నాట్య రంగాలకు పిఠాపురంలో లభించిన ఆదరణను; రంగస్థలం పై రాణించిన ధ్రువతారలను – రంగుల తెరపైన, తెర వెనుక ప్రసిద్ధులైన విభిన్నులను; సంఘ సంస్కరణలో పాలుపంచుకున్న మహనీయులను గూర్చిన వివరాలను తదుపరి వ్యాసాల్లో విశదీకరించారు. History is merely a list of surprises అన్నారు అమెరికన్ రచయిత కర్ట్ వానెగట్.

పిఠాపురం కథల్లో పఠితలకు సంభ్రమాశ్చర్యాల్ని కలిగించ గల విశేషాలెన్నో ఉంటాయి. కోపం వస్తే ఎంత వారికైనా సిగ తెగ్గోయించే రాజా గంగాధర రామారావు కాలంలో పిఠాపురం సరస్వతీ నిలయమై భాసించిందట. శ్రీ కుంతీ మాధవాలయంలో తొమ్మిది రాత్రులు – శ్రీ కృష్ణ సత్యభామల ప్రణయగాథను 'నవజనార్దన పారిజాతం' పేరిట నృత్యంగా స్త్రీలు మాత్రమే ప్రదర్శించేవారట. ఈ నృత్యంలో ఆనాటికి సాటిలేని మేటి నర్తకి పెండ్యాల సత్యభామ. ఆమె అభినయాన్ని వీక్షకులు ఆద్యంతం రెప్పవేయకుండా చూచేవారట. గుత్తుర్తి వీరాస్వామి 'శంఖం వీణ' అనే కొత్త రకం వీణను తయారు చేసారట! ప్రముఖులెందరో పిఠాపురంలో వీణలు తయారు చేయించి, పట్టుకువెళ్లారట! ఇలాంటి సంగతులు పఠితలను విశేషంగా ఆకట్టుకుంటాయి.

శ్రీరంగం కోవిలలో ఆళ్వారులతో పాటు పిఠాపురం వారి మూలపురుషుడైన మాధవ రాయణిం గారూ పూజలందుకుంటున్నారన్న సంగతి ఆశ్చర్యం కలిగిస్తుంది. పొరుగునే ఉన్న పెద్దాపురం ప్రభువులతో పిఠాపురం వారు చేసిన పొత్తులు – ఇరు రాజ్యాలూ దూసిన కత్తులు; ఉందూరు, దోమాడ యుద్ధాలు తదితర గాథలను రచయిత పరిచయం చేసిన తీరు బాగుంది.

పరమ గ్రాంథికవాదిగా ప్రసిద్ధిగాంచి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు అనే ఓ మహాసంస్థను పోషించి, రూ.20 లక్షల భారీ వ్యయంతో నిఘంటు నిర్మాణం చేపట్టి, ధన్యుడైన సూర్యారావు బహద్దర్ గారి గాథ చదువుతున్నపుడు రచయిత రాజకుమార్ ఈ పుస్తకానికి ముఖచిత్రంగా సూర్యారావు గారి చిత్రాన్ని పెట్టడంలో ఉన్న ఔచిత్యం అర్థమవుతుంది. ఈ జమీందార్ – బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి శిష్యులై, బ్రహ్మ సమాజాన్ని నడిపించారు. దివాన్ మొక్కపాటి సుబ్బారాయుడు గారి సలహాలతో, నాయుడు గారి ఆశీస్సులతో గాంధీగారి కంటే ముందే మద్యపాన నిషేధం, హరిజనోద్ధరణ, స్త్రీ అభ్యున్నతి లక్ష్యాలుగా త్రికరణ శుద్ధితో కృషిచేశారు. పదుల సంఖ్యలో కవి పండితులను, శాస్త్ర విద్వాంసులను, కర్మిష్ఠులను, కళాకారులను పోషించి అభినవ శ్రీ కృష్ణ దేవరాయలుగా నుతులందారు. కవి పండిత పోషణ – వేద, శాస్త్రాల వ్యాప్తి; భాషా సాహిత్య వివాదాల్లో ప్రముఖపాత్ర, కళాశాల స్థాపన, సంఘ సంస్కారం, కళలు, పత్రికలు, పరిషత్తులు, గ్రంథ సంపాదనలు – ప్రచురణలు; శరణాలయాలు – ప్రార్థన మందిరాలు ... ఒకటా రెండా! ఈ పాలకుల ఔదార్యాన్ని చాటే విశేషాలెన్నో ఈ పుస్తకంలో గుదిగుచ్చారు రచయిత. ఆనాటి పిఠాపురం సంస్థానాధీశులు, వారి ఆశ్రితులు అనుభవించిన వైభవాన్ని; రాజకుటుంబంపై జరిగిన కుట్రలు, అంతఃపుర విశేషాలు తదితరాలను తెలుసుకోవడానికి పనికివచ్చే సాధికార రచన యువరాజు గంగాధర రామారావు గారి ఆత్మకథ. అందులోని కొంత భాగాన్ని ఈ సందర్భంలో పొందుపరచడం బాగుంది.

భీమేశ్వర పురాణం – ద్వితీయాశ్వాసంలో శ్రీనాథుడు వర్ణించిన పిఠాపురం దేవతా మూర్తుల్లో కొన్నింటి ఉనికిని

గుర్తించలేకపోయారని చెబుతూ – కుక్కుటేశ్వరాలయం, పురుహూతికా శక్తిపీఠం పాదగయ, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, ఆర్ష – సూఫీ తత్త్వాల సమ్మేళనమై భాసిల్లుతున్న 'విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం' తదితర ఆధ్యాత్మిక సంస్థల గాథల్ని చక్కగా వివరించారు రచయిత. పిఠాపురం సంస్థానం లోని సారస్వత మూర్తులు, సంగీతవేత్తలు, నాట్యకారులు, నటులను గురించి సంతరించిన విశేషాలు ప్రధాన గ్రంథంలో సగభాగాన్ని ఆక్రమించాయంటే – కళలకు ఆనాటి ప్రభువులు ఎంత ప్రాధాన్యం ఇచ్చి ఉంటారో మనం అర్థం చేసుకోవొచ్చు.

కవులు, కళాకారులకు నిలయమైన పిఠాపురాన్ని ఇంగ్లాండు లోని 'లేక్ ల్యాండ్'తో పోల్చవచ్చునేమో! అక్కడి కళా సృజనకి సుందర ప్రకృతి ప్రేరకం కాగా ఇక్కడ మన వారికి – ఏలేరు తీరాన కొలువైన ప్రభువుల కళాతృష్ణ, కవిత్వాభిరుచి ప్రేరణగా నిలిచాయి.

పిఠాపురం అంటే గుర్తుకు రావలసినవి దత్తాత్రేయ క్షేత్రము, పురుహూతికా శక్తి పీఠం మాత్రమే కాదు! 'దేహాన్తే తవ సాయుజ్యమ్మ'నుకుంటూ – కుక్కుటేశ్వరుని సేవలోనే తనువు చాలించి, తరించిన కూచిమంచి తిమ్మకవి, సాహిత్య స్పర్ధ కారణంగా తిరుపతి వెంకటకవులను వాదాలలో ఢీకొట్టిన వెంకట రామకృష్ణ కవులు, ఒక విశ్వవిద్యాలయం చేయాల్సిన పనిని తామొక్కరే చేసి, 'వర్ణన రత్నాకరం' కూర్చిన దాసరి లక్ష్మణ కవి, సాహిత్యాన్ని సంఘ సంస్కార సాధనంగా ఉపయోగించుకున్న పానుగంటి లక్ష్మీ నరసింహారావు, భావుకతా పట్టభద్రునిగా నతులందుకున్న మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి వాఙ్మయ మూర్తులు... ఇలా పిఠాపురాన్ని కవితావనంగా భాసింపజేసిన పలువురు కవిశేఖరుల్ని గూర్చి సరళ సుందరమైన భాషలో తెలియజేసారు రచయిత.

శాంతినికేతన్‌లో వీణావాదన చేసి, విశ్వకవిని తాదాత్మ్యంలో ముంచెత్తిన వైణికవరులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి సాటిలేని ప్రతిభ, లలిత సంగీతాన్ని సామాన్యులకు చేరువ చేసిన బాలాంత్రపు రజనీకాంతరావు నిరుపమానమైన ఉభయకారిత్వం; ఆసేతు శీతాచలం తమ సంగీత రసధారలతో రసజ్ఞులను మైమరపించిన నేదునూరి కృష్ణమూర్తి నైపుణ్యం, మధుర గాయకుడు పిఠాపురం నాగేశ్వరరావు గారి స్వరంలోని కమ్మదనం, తెలుగు నాటకరంగ విజ్ఞాన సర్వస్వంగా పేరు గాంచిన మలిరెడ్డి బాబీ కార్యవ్యగ్రత, అందాల కథానాయకుడు హరనాథ్ అభినయం, బారిష్టర్ పార్వతీశం పాత్ర ద్వారా తెలుగునాట నవ్వుల తోటను విరియించిన మొక్కపాటి నరసింహ శాస్త్రి హాస్యం; ఉమర్ అలీ షా, అభ్యుదయ కవి ఆవంత్స సోమసుందర్‌ల కవిత్వ విశిష్టత ... ఇలా పిఠాపురం కీర్తిని ద్విగుణం, బహుళం చేసిన విశేషాలెన్నో – ఈ రచనలోని ప్రతి పుటలో పాఠకులకు తారసపడతాయి. పిఠాపురంలో తయా రయ్యే నూర్జహాన్ సెంటులా మనసును పట్టేసి గుబాళిస్తాయి.

అయితే – ఇంత చక్కని ఈ రచనలో – చరిత్ర విశేషాల ప్రకరణంలో కొన్ని దోషాలున్నాయి. మలి ముద్రణలో అలాంటివి లేకుండా జాగ్రత్త పడాలి. ఏలేరుని పిఠాపురంలో 'చెరుకుల కాలువ' అంటారు. తీయని చెరకుల కోసం మారాం చేసిన పిఠాపురం రాకుమారుల కోసం పెద్దాపురం రాజులు ఏలేటిలో చెరుకులు పడవేయించి, పిఠాపురం పంపేవారని ఓ కథ ఉన్నట్లు చెప్పారు రచయిత రాజకుమార్. 'శత్రువుల నుంచి ప్రాణహాని ఉన్నందున – ప్రతి పదార్థాన్నీ ఓ సేవకుడు తిని చూస్తేనే కాని పిఠాపురం రాజులు ఆహారం ముట్టేవారు కాదని' యువరాజు గంగాధర రామారావు ఆత్మకథలో రాసిన మాటలను బట్టి చూస్తే ఈ చెరుకుల కాలువ కథ – సరదాగా ఎవరో పుట్టించిందని అనిపిస్తుంది. బహుశ ఏలేరును జలరవాణా కోసం ఉపయోగించి ఉంటారని ఊహించవచ్చు.

'బండి రాజకుమార్ కూర్చినది బంగారు పిచ్చుక గూడు కాదు. రచనలో మెళకువలు, సోయగాలు లేనందున – ఇది ఓ కాకిగూడే. కాని ఈ ప్రయత్నాన్ని చిన్నచూపు చూడరాదు' అన్నారు ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో శ్రీ ఏకా మన్మథరావు గారన్నట్లు – ఇది పిఠాపురం చరిత్రపై మరో లోతు పరిశీలన కాకపోయినా ఈ తరానికి తెలియని ఎన్నో విషయాలను సేకరించి, వీలైనంత సమగ్రంగా అందించేందుకు రచయిత రాజకుమార్ చేసినది మాత్రం సఫల ప్రయత్నమే! ఇది కాకిగూడే కావచ్చు! కాని ఈ గూటిలో సంతరించిన అమూల్యమైన సమాచారం సమీప భవిష్యత్తులో ఎన్నో కోకిల లకు ఆధారమవుతుందని అనుకోవచ్చు.

అమెరికన్ రచయిత అలెక్స్ హేలీ రాసిన Roots నవలలో – ఏడుతరాల మూలాలు సేకరించడానికి కృషి చేసిన కథా నాయకుడి పాత్ర తన పరిశోధనకు ప్రేరణ కలిగించిందన్నారు రచయిత తమ మనవి మాటల్లో. పెద్దల వద్ద విని, వివిధ గ్రంథాల్లో చదివి, సేకరించిన అంశాలను సమన్వయపరచి పాఠకులకు ఒక మంచి పుస్తకంగా అందించిన రాజకుమార్ కూడా ఆ కథానాయకుడి లాగే శ్రమించారనడంలో సందేహం లేదు. పూర్వ పరిశోధకుల కృషి ఫలితంగా లభిస్తున్న సమాచారంతో పాటు మరెంతో విలువైన సమాచారాన్ని మౌఖిక ఐతిహ్యాలు, ఆచారాల నుంచి గ్రహించి, శోధించి అందలి సత్యాలను కథారూపంలో అక్షరీకరించారు రచయిత. పిఠాపురం జొన్నపొత్తులకు ప్రసిద్ధి అని సమాధానం చెప్పిన విద్యార్థి ఎవరో కాని – అతడిచ్చిన జవాబు రచయితను కర్తవ్యోన్ముఖుణ్ణి చేసి, ఓ మంచి పుస్తకం రాయడానికి కారణమైంది! పిఠాపురాన్ని గూర్చి ఈ తరానికి తెలియజేయాలనే రాజకుమార్ తపన ఈ పుస్తకం ద్వారా నెరవేరినట్టే భావించాలి. ■



## మాటివ్వండి.. మహాశయులారా..!

ఇప్పుడంటే
నాలుగు వాక్యాలు రాస్తున్నాను గానీ,
ఇదే కవిత్వం అన్న భ్రమలో మాత్రం లేను
ఆకాశంలో అన్వేషణ చేస్తూ
అబద్ధాల మధ్య కూర్చుని
కొంత భయం కొంత ధైర్యంతో
యుగయుగాల పీడితుల కోసం
నెత్తుటి యేరుల్ని పారించలేకపోయినా
ఎక్కడో మెదళ్ల చిగురిస్తాయన్న ఆశతో
ఓ విముక్తి గీతాన్ని
ఆలపించేందుకు సిద్ధమవుతున్నాను

మాటివ్వండి మహాశయులారా!
మేం ఓడిపోమని ...
పాటల రోడ్డుమీద
పోటెత్తుతామని!
చిత్తడి నేలల్లో
నురగలు కక్కుతామని!
అయినా గోడకు కొట్టిన పిడకలా
పద్యం నేను రాయలేనుగాక రాయలేను!

- ఏటూరి నాగేంద్రరావు
74166 65323

## జీవభాష

నేనిప్పుడొక కొత్తభాష
నేర్చుకోడానికి ప్రయత్నిస్తున్నాను
చెట్టు భాషో, జంతువుభాషో, నది భాషో
ఏదో ఒకటి
కనీసం పువ్వో, కాయో, పండో
దేనిదో ఒక భాష
భాషంటే ప్రయాణం కదా! ప్రసారం కదా!
కనీసం చీమతోనో, దోమతోనో, ఈగతోనో
దేనితోనో ఒకదానితో మాట్లాడి తీరాల్సిందే
విద్యుత్తు ట్రాన్సుఫార్మరు వద్దనే నిలిచిపోయినట్లు
ప్రవహించే భావాలు
మెదడులోనే గడ్డ కట్టుకుపోతే
శరీరం దహించుకొని పోదూ?
సిరలు, ధమనుల్లోనైనా ప్రవహించి
హృదయాన్ని తాకాలి కదా!
ప్రేమించాలన్నా ప్రేమించబడాలన్నా
కనీసం నలదమయంతిలా
హంసభాషన్నా నేర్చుకొని తీరాలి కదా!
చేతి వేళ్ళతో మాట్లాడటం మొదలెట్టిన తర్వాత
మాట్లాడాల్సిన అంగాలన్నీ మాట్లాడ్డం మానేసాయి
మౌనం దాల్చిన పెదాలకు మూగభాషైనా రాదు
ఇంక హృదయ భాషను పలుకగలదా !
ఒక్కొక్క అంగానికీ ఒక్కో భాష ఉంటుంది
కానీ ప్రసారానికి ప్రాణి కావాలి కదా!
ఇక ఒక్కో అంగానికీ ఒక్కో కొత్త భాష నేర్పుతాను
సమస్త ప్రాణికోటితోను వాటిదైన భాషలో మాట్లాడతాను
మనిషితో మాట్లాడి ఎన్నాళ్లో అయింది కదా !

- రత్నాల బాలకృష్ణ
94401 43488



# ఒక వాన సంగీతం


- శిఖా ఆకాశ్
93815 22247



ముసురులోంచి లోకమంతా
చలి చలిగా మొదలవుతుంది
వెచ్చ వెచ్చని ఒక ప్రపంచం కోసం
ఒక ఆలోచన మెదడు కొసన
నిప్పురవ్వై రగులుకుంటుంది
బయట వాన- లోన కూడా ... వెచ్చని వాన!
మసక మసక మబ్బుల్లోంచి
హఠాత్తుగా సూర్యుడు పొడుచుకొచ్చినట్టు
నాలోన ఒక మొగ్గ మెలమెల్లగా పువ్వవుతుంది
అందరి చలిని దూరం చేసే
ఒక నులివెచ్చని కవితా దుప్పటి తయారవుతుంది
చినుకుల మొగ్గలు మట్టిలోంచి పూలై లేస్తాయి
ఆ పరిమళంలో బాల్యం చిందులేస్తుంది
వాగులు వంకలకు దారెవరు చూపాలి?
బాల్యానికి అల్లరి ఎవరు నేర్పాలి?
వాటి సందడి అంతా ఇంతా కాదు
వాటి అందం ఇది అని నిర్వచించేదీ కాదు
కొలతల కందని మనసంత ఆనందం!

ఎప్పుడొస్తుందో.. ఎలా వస్తుందో.. ఎటు పోతుందో..
ఇట్టా వచ్చి అట్టా ఎక్కడకో జరజర
మేఘం ఒలింపిక్ రన్ చేస్తుంది
దానివేగం పసికట్టలేనిది.
ఒక్కో చినుకూ తీగ మీద
నాజూగ్గా క్యాట్ వాక్ చేస్తుంటే
ఆ అందం ఎంతగా మెరుస్తుందో..!
సముద్రమెంతగా శంఖుపూదుతుంది
గాలి మరింతగా ఫ్లూట్ వాయిస్తుంది.
చెట్లు ఎంతగానో సాధనతో కోరస్ పాడతాయి
తడిచిన పిట్టలు మునగడ దీసుకుని
పియానో మెట్ల మీద మెల్లమెల్లగా నాట్యం చేస్తాయి.
పిల్లలెంతగా పరవశగీతాలు ఆలపిస్తారో..
గుట్టు చప్పుడుగా వచ్చి
దండెం మీద ఆరేసిన బట్టలన్నింటినీ
ఇట్టే తడిపేస్తుంది
మనల్ని బాల్యంలోకి లాక్కొచ్చి మరీ
ముంచేస్తుంది!
మూలనెక్కడో దాక్కున్న
నల్లని వాన మొగ్గలేవో విచ్చుకొని
మనల్ని తడవనీయకుండా
తోడు వస్తాయి
టపటపా రెక్కలు కొట్టుకుంటున్న
చెట్లని రెపరెపల జండాలై ఎగురుతాయి
మృదువుగా ఒక ఆకుపచ్చని కలల పరిచయం
కలాలకు బహుమతిగా ఇస్తుంది.
వెచ్చని తేనె టీకి ఆర్డర్ జారీ చేస్తుంది!

ప్రతి ఇంట తొలకరి ఒక
సంతోష సరిగమల సవ్వడి అయ్యి
ఎక్కడి వారిని అక్కడే ఖైదు చేసి
కాలక్షేపం బఠానీల
మానవ సంబంధాల రాగాలాపన చేస్తుంది! ■




# బుచ్చిబాబు కథలు - భాష

- కె.ఉషాబాల

'కథ'ను రసవత్తరంగా ఎలా రాయాలి? మంచి కథ అంటే ఏమిటి? ఈ అంశాలు కథా రచన ప్రారంభంలో బహుశా ఏ రచయిత తనను తాను చర్చించుకోడు. క్రమేపి కథా రచనలో అనుభవం, అనుభూతి, గాఢత వంటివి ఏర్పరుచుకొని వస్తువు, నేపథ్యం, పాత్రలు, అనుభవాలు, అనుభూతి వంటి వాటిని అర్థం చేసుకుంటాడు. ఓ గొప్ప ఆలోచనలో కథను ప్రారంభించాలని అనుకొన్నా, చివరకు అది పేలవంగా తయారవచ్చు కారణం – ఆలోచనలోని బలం, సాంద్రత 'కథా గమనం'కు ఉపయోగపడే పాత్రలు, నేపథ్యం, వస్తువు, భాష వంటి వాటి వద్ద తేలిపోతాయి. ఎందరో ప్రసిద్ధులు ఒక ఆలోచనకు సంవత్సరాల తరబడి 'చిత్రిక' పట్టి కథారూపంగా తీర్చిదిద్దిన సంఘటనలున్నాయి. కథగా ప్రారంభమైంది 'నవల'గా మారిన సందర్భాలు ఉన్నాయి. రా.వి.శాస్త్రి గారి 'మూడు కథల బంగారం' 'ఇల్లు' వంటివి ఇందుకు ఉదాహరణ. పూర్వ కవులు, పాశ్చాత్యులు కూడా కథలను కావ్యాలుగా తీర్చిదిద్దే కృషి చేసారు. చెకోవ్, ఓహెన్రీ, మొపాసా వంటి వారి కథలు ఇందుకు ఓ గొప్ప ఉదాహరణ. వారి కథల్లో 'మెరుపులు' ఎలా సాధ్యమయ్యాయి? కాఫ్కా కథల్లోని 'గాఢత' ఎక్కువ మందికి అర్థం కాదు. 'అబ్సర్డిటీ' గా పెర్కొనవారు ఉన్నారు. కారణం – పాత్రలు వాటి మధ్య ఓ 'అంతు చిక్కని లోతైన' ఆలోచనా విధానం, భాష వంటివి ఇందుకు ప్రత్యేకంగా చెప్పకోవచ్చు. అనుభవాలు, అనుభూతులుకు తగిన భాగస్వామ్య అవసరం. మామ్, శరత్, చలం వంటి వారి పాత్రలు – వాటి భాషలను పరిశీలిస్తే 'ఒక స్థాయి' లో ఉంటాయి. వారి కథా వస్తులు తగిన పాత్రలతోనే ఈ 'విశేషం' సాధించారు. అసలు ఏ భాషా ఎటువంటి భాష అనేది సమస్య కాదు. ప్రాంతం, పాత్ర పరిధి, అర్హతలు, స్థాయి, రాజకీయ, సామాజిక, మతపరమైన 'అంశాలను దృష్టిలో ఉంచుకొని 'భాష'కు ప్రాధాన్యతనివ్వాలి. ఒక్కొక్కసారి 'పాత్రను' మించిన భాష కూడా ఇబ్బందికరమైన అంశంగా ఉంటుంది. కనుకనే కథకునికి జాగూరుకత అవసరం చలం, శ్రీపాద వంటి వారి కథలు చదివితే 'భాష' యొక్క ప్రాధాన్యత తెలుస్తుంది. కథ రమ్యమై రూపం ఇవ్వగలిగేది 'భాష'. చదువరులను ఎన్నాళ్లయినా వెంటాడగలిగేది కూడా అదే. కనుకనే కథల్లో భాషకు ప్రాధాన్యతనిచ్చారు. 'భాష' అనేది 'శైలి–శిల్పం' అనే వాటికి ఉపయుక్తంగా ఉంటుంది. ప్రతీ రచయితకు తనదంటూ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. దానికనుగుణమైన 'శైలి' అలవర్చుకుంటాడు. శైలికి తగిన భాషను ఎన్నుకుంటాడు. చలం, శరత్, బుచ్చిబాబు, శ్రీపాద, కా.రా మాష్టారు, భూషణం, విశ్వనాథ, శ్రీశ్రీ, అరుద్ర ఇలా చెప్పకుంటూ పోతుంటే ఆయా రచయితల 'శైలి – భాష' అనేవి చదువరుల మనస్సులో 'ముద్ర' వేస్తాయి. వెనువెంటనే 'ఒక చిత్రం' వారికి తడుతుంది. వీరి కథలు చూడండి (చదవండి) 'విభిన్నత' అర్థమవుతుంది. అదేవిధంగా సతీష్‌చంద్ర, బీనాదేవి, పతంజలి, ముళ్ళపూడి యర్రంశెట్టి, మల్లాది, వీరేంద్రనాథ్ తదితరుల కథలను గమనిస్తే వారి శైలి – భాష – వ్యక్తిత్వాలు స్పష్టం. ఏతావాతా చెప్పేదేమిటంటే 'మంచి రచనకు మంచి భాష' అవసరం. ఇక్కడ గమనించవలసిన అంశం ఒకటుంది. మన దేశం, రాష్ట్రం, ప్రాంతం తదితరాలను 'కథల్లోని వస్తువుగా స్వీకరిస్తే ఆ ప్రాంతపు వాతావరణం, ప్రాంతీయత, వ్యవసాయం, ప్రకృతి, వ్యక్తులుకు దగ్గరగా పాత్రలు, భాష అవసరం చిత్తూరు (మధురాంతకం) శ్రీకాకుళం (కా.రా, అట్టాడ, భూషణం) తెలంగాణా, రాయలసీమ (బి.ఎస్‌రాయులు, కేశవరెడ్డి, సన్నపురెడ్డి) ఇలా ఒక్కొక్క ప్రాంతానికి ప్రత్యేక భాష, యాస ఉన్నాయి.

కాని బుచ్చిబాబు వంటి రచయితలు మాత్రం మానవ సమస్తత్వ విశ్లేషకు ప్రాధాన్యతనిచ్చి చివరివరకు ఆ దిశగానే తమ రచనలు కొనసాగించారు. చలం, పాలగుమ్మి, భానుమతి,

బుచ్చిబాబు ఇంకా ఎందరో తమదైన 'ముద్ర'ను ఏర్పరుచుకున్నారు. రచనకనువైన 'భాష'ను ఏర్పరుచుకున్నారు.

బుచ్చిబాబు గారు కథా రచయితగానే సుప్రసిద్ధులు 'చివరకు మిగిలేది' ఒక్కటే ఆయన నవల, దాదాపుగా 50 వరకు ఆయన కథలున్నాయి. అన్నింటిని పరామర్శించే సమయం, స్థలం లేదు కనుక కొన్నింటిని మాత్రం స్పృశించుకుంటున్నాను. కథా నేపథ్యంను వివరించే క్రమంలో ఓ ప్రధానమైన ఆయుధం భాష. కథలోని వాస్తవికతను తెలియజేసేది భాషతో పాత్రలు తమ భావాలన వ్యక్తం చేసే వారధి. పాత్రలు చెప్పకోని వాటిని రచయిత చెబుతాడు (బుచ్చిబాబు రచనల్లో ఇది ఎక్కువ). పాత్ర మాట్లాడే భాష 'ఆ పాత్ర పైన నమ్మకం'ను కలిగిస్తాయి. 1910 లో గురజాడ 'దిద్దుబాటు' ను మొదటిలో గ్రాంధిక భాషలో రాసి, తరువాత వ్యవహారిక 'భాష'లోనికి మార్చారు. శ్రీపాద వారు 'కథకు' సాధారణమైన భాషకు శ్రీకారం చుట్టారనే చెప్పాలి. నేపథ్యానికి, పాత్రలకు, కథాంశానికి మధ్య ఉన్న సజీవ సంబంధాన్ని చిత్రించే ప్రయత్నం చేసిన తొలి కథా రచయిత శ్రీపాద వారనవచ్చు. ఇటువంటి భాషా కథనాలు బుచ్చిబాబు రచనల్లో కనిపిస్తాయి ఈయన కథ 'పొగలేని నిప్పు' శీర్షికలోనే ఓ విచిత్రం ఉంది. ఇది కథలో కూడా కనిపిస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్రలు నాగయ్య, భార్య సీతారత్నం, భాస్కరం అతని భార్య పార్వతి. ఈ నాలుగు పాత్రలనడుమనే కడప, చిత్తూరు, బళ్ళారి ప్రాంతాల నడుమనున్న 'సంభాషణలోని' విరుపులు క్రొత్త క్రొత్త పదాలును తెలియజేస్తారు. 'నువ్వుశానా మంచి మొగుడువేగా, నాగయ్యలాగా పీకులాట మనిషి కావులే' అని అనటంలోని ఓ 'రహస్యంతో కూడిన సరసం' ఉంటుంది. సీతారత్నమంటే భాస్కరానికి ఇష్టం. ఇది ఏ రకం ఇష్టం అనేది చివరి వరకు 'సస్పెన్స్' – ఎవరికి తోచిన నిర్వచనాలు వారివి. నాగయ్యకు, పార్వతికి కూడా ఈ 'చనువు' తెలుసు. అందరూ కలిసే ఉంటారు. 'మరి చాశ్మరత్నం' 'మీది మీది కొస్తావేం, పాడు పిల్లడ' 'మజుబూతిగా (అనగా – గట్టిగా అన్న మాట) 'అయుత్తు పరుస్తాలే' 'తలంటుపోసుకుంటే' 'జులాయిస్తుందిలే' (మైకంగా ఉంటుందనుకో)' యెండగొట్టబడి నట్లుండావు – ఇలా ఆ సోదా వేసుకో' ఇలా ఎన్నెన్నో సంభాషణల్లో ఓ 'చిత్రమ'యిన భాష ఉంది. మరో కథ 'నేటి పావురం రేపటి నెమలి' ఇందులో కామేశం, కుమారి, రామ్మూర్తి వంటి పాత్రలున్నాయి. పాత్రల వ్యక్తిత్వాన్ని 'భాష'కు అనుగుణంగా వాడుకోవటం బుచ్చిబాబు రచనా చమత్కృతి. ఆయన సంభాషణల్లోనే కాదు 'వర్ణన' లోను ఓ 'ప్రత్యేకమైన పదబంధాలను' ఉపయోగిస్తారు. కామేశం గురించి 'చెబుతూ నడివయిస్సు స్తబ్ధత దిగవిడిచి, వెనక్కి యవ్వనంలోకి ప్రయాణం సాగిస్తున్నామా' అన్న అనుమానం అతనిది' అంటారు. 'చెడ్డ వాళ్ళ మంచితనం అంతటి ప్రమాదం' మరో కథ 'నిరంతరత్రయం' కరుణాకరం, కామేశం, సుగుణ, రచయిత ఇందులోని పాత్రలు ముగింపులో 'కరుణాకరం' ఆత్మహత్య చేసుకుంటాడు. ఎందుకు అనేది పాఠకులు (రకరకాలుగా) ఊహించుకోవచ్చు. ఇక్కడ రచయిత మాట 'చటుక్కున నా మనస్సుకి వోభావం స్ఫురించింది. అదేమిటో చెప్పేసి, తర్కించి, పాఠకుల కాలం వృథాపరచటం అన్యాయం అంటారు. ఈయన ఉపయోగించే భాష 'ఓ రహస్య మార్మికత' ఉంటుందనిపిస్తుంది. కథా ప్రారంభంలో 'ప్రపంచంలో నేటి అరిష్టాలకి కారణం తెలివిహీనులు నిస్సంకోచంగా ప్రవర్తించడం, తెలివిగలవారు శంకలతో, సందేహాలతో బాధపడి అసహాయులవడం' అని మొత్తం కథను 'సంకేత భాష'లోనే చెప్పేస్తారు. ఈ విషయం కథ చివర్లో తెలుస్తుంది. కరుణాకరం ఏ కోవలోకి వస్తాడు అనేది. ఎందుకు ముగింపు వాక్యాలు ఆ విధంగా ఉన్నాయి అని కూడా తెలుస్తుంది.

కథలో మరో సందర్భంలో 'మనస్సు శరీరాన్ని కలవర పెడుతుంది. శరీరం మనస్సును చిరాకు పరుస్తుంది. ఆ రెంటి సమన్వయం సంపూర్ణ ఆరోగ్యం'. సుగుణ, కరుణాకరం, కామేశం అనారోగ్యం వెనుక ఈ చిన్న సూత్రం వారికి తెలియకపోవటమే అనుకుంటారు చదువరులు. ఓ ప్రహేళిక యుతమైన భాషను ఉపయోగిస్తూ, సంభాషణలతో ముందకు వెలుతున్న కొద్దీ గాఢతను పెంచుతూ చిరవకు 'పజిల్'న తెలియనట్టు అమాయకంగా 'గడుసుతనంతో' విడదీయటం ఆయన శైలికి వన్నెలద్దిన 'భాషా' నిపుణత. సుగుణను గూర్చి ఒక వర్ణనలో 'తీక్షణమైన ప్రాచీన మానవత్వాన్ని , పురుషత్వాన్ని సూచిస్తున్నాయి.' అంటారు. 'నిండైన అందమైన ప్రేమలో విషాదం ఉంది కాబోలు' సుగుణ గురించి చెబుతూ, 'ఆమె అనారోగ్యానికి ముందు 'నర్సింగ్ హోమ్ కాదు. రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం' అంటారు. ఆమె బహిరంగంగా పది మందిలో ఉన్నప్పుడే తీక్షణంగా జీవించగలుగుతుంది(ట) మరో కథ' అరకులోయలో కూలిన శిఖరం' 'ఎల్లోరాలో ఏకాంత సేవ' అనే కథల్లో కూడా ఈ విధమైన 'వర్ణణాయుత' 'ప్రయోగాత్మక' 'ప్రణాళికయుతమైన' 'ఓ రహస్య సందేశాత్మకమైన' భాష ముమ్మరంగా కనిపిస్తుంది. ఈ కారణం చేతనే ఆయన కథలను తొలిసారి కన్నా రెండు, మూడు సార్లు చదివిన తరువాతనే వాటిలోని 'వాస్తవిక దృక్పథం' 'జీవన తాత్వికత' 'జీవనసారం' అవగతమవుతాయి. నేపథ్య చిత్రణలో, పాత్రలను పరిచయం చేస్తూ వాటి వ్యక్తిత్వాల్లోని గాఢతను వివరించడంలో 'భాష' ప్రాముఖ్యతను తూకం వేసి చిత్రించ గల నేర్పరి – బుచ్చిబాబు గారు.

■

## విజయపథం

సలసల మరిగే నీళ్లలా నిత్యం రగులుతూ
భయంకర భయాన్నే నీలినీడలా వెంటాడుతూ
కర్కశకాలంపై గెలుపు కత్తులను రువ్వుతూ
మసిబారిన అద్దంలో ప్రతిబింబాన్ని దర్శించగలిగితే
బతుకు పోరులో విజయపథం అధిరోహించవచ్చు

అపజయ సునామీలు జీవన యానాన్ని ముంచెత్తినా
అవరోధ ప్రమాదాలు మృత్యు ఘంటికలను మోగించినా
ప్రతికూలతలు పగలబడి మనసును కకావికలం చేసినా
ఉజ్వల భవితకై స్వచ్ఛ మనసుతో ముందుకెళితే
మునకలేస్తున్న జీవన నావను గట్టెక్కించవచ్చు


కారు చీకట్లు వెలుగు దివ్వెలను ముసిరినా
అర్థం లేని ఆలోచనలు భవిష్యత్ ఆశలను చుట్టుముట్టినా
భయపు రక్కసి దీప దేహాన్ని ఊబిలోకి నెట్టినా
జీవన గమనంలో ధ్యానమోక్షాన్ని వెలిగిస్తే
వినువీధిలో విజయకేతనాన్ని ఎగురవేయవచ్చు

బ్రహ్మాండమైన ఆలోచనలు ఈగల్లా ముసరకపోయినా
ఆకాశ వీధుల్లో నల్లని కాకుల్లా ఎగరకపోయినా
చిట్టి చీమల్లా చక్కని వరుసల్లో పాకకపోయినా
మనసు కుంపటిలో సహజజ్ఞానాన్ని రగిలిస్తే
జీవన మజిలీలో రాజహంసవై వెలగవచ్చు!

అలసిన మదిలో అలలు అలజడులు రేపినా
నవ్వుల హేళనలు గుప్పెడు గుండెను గాయపరిచినా
విముఖత సర్పం మనసు స్థిరత్వాన్ని కాటేసినా
ఆపద కల్లోలాలను బుద్ధి జ్ఞానంతో ప్రకాశింపజేస్తే
నిర్వికార మదితో విజయ ద్వారాన్ని తెరవవచ్చు!

పుష్ప గుచ్ఛం మెడహారమై మెరవాలన్నా
విజయలక్ష్మి గృహ మందిరాన్ని తాకాలన్నా
వ్యతిరేకతలు తోకముడిచిన పిల్లుల్లా మారాలన్నా
సానుకూల ఆలోచనలు మదిగదిలో అంకురింపజేస్తే
పచ్చని తోటలో విజయ ఫలాలను అందుకోవచ్చు!

- పిల్లి హజరత్తయ్య
98486 06573



## పల్లె పిలుస్తోంది ..!

చిగురుటాకుల్లో వెన్నెల చూపుల్లో తడిసి
లేలేత గాలులతో మురిసి
పల్లె నిండుగా పులకరిస్తోంది.
చిన్ని సరదాల్ని సూర్య కిరణాల్ని వొంపుతూ
ముఖంలోంచి ఆనందాలు ఉదయిస్తున్నాయి!

ఆరుబయట అట్లానే
చిరు నవ్వులు వేచివున్నాయి
పల్లెతనం అమ్మతనం ఎంచక్కా
ఆప్యాయంగా నిమురుతున్నాయి!
వేసవి అయితే చాలు
పిల్లలు పల్లెకు రెక్కలు కట్టుకుని
ఎగురుతున్నారు!
అడుగులు వడివడిగా మురిసి పోతున్నాయి ...

మట్టి పరిమళాల్ని అద్దుకుని
మంచు బిందువుల్ని పూసుకుని
ఎగిరే పక్షుల వెంట ఆనందాలు సాగిపోతున్నాయి.
కరిగిపోతున్న కలల్ని ఎత్తుకుని
నా పల్లెలో వాలిపోతాను!

దోసిళ్ళలో చిరు నవ్వుల్ని వెలిగించుకుని
అలసిన క్షణాల నుంచీ
అలా సేదదీరుతుంటాను!

- గవిడి శ్రీనివాస్
70192 78368





# కూలి రోగులు

- వి.రెడ్డెప్ప రెడ్డి
94400 44922

**పా**టూరుకు వెళ్ళే పల్లెవెలుగు నైట్ హాల్టు బస్సు బస్టాండులో ఆగంగానే, తూర్పుపతానికి భయపడి సర్రుమని బిలాల్లోకి దూరి పోయే రెయిమేత గువ్వల్లా తోసుకుంటూ, తొక్కుకుంటూ, కసురుకుంటూ, అరుచుకుంటూ బస్సులోకి దూరడం, దూకడం ప్రయాణీకుల అలవాటు. ఎవరికి వారు కర్చీఫ్, టవల్, బ్యాగు ఏది అందుబాటులో ఉంటే అది వేసి సీట్లు రిజర్వు అనడం, వాటిని పక్కకు తోసేసి ముందుగా బస్సెక్కిన వాళ్ళు సీట్లు ఆక్రమించుకోవడం కూడా అలవాటే. అలాంటిది ఆ రోజు ఒక్కొక్కరు ఒకో సీట్లో కూర్చున్నా బస్సులో ఇంకా సీట్లు మిగిలి ఉండటం దోణప్పకు ఆశ్చర్యం కలిగించింది. చిన్నపుడు వాళ్ళ నాన్న అడిగిన, 'యెన్నుకొగటి కూసుంటే వొగ గువ్వ మిగుల్తుంది, రెండేసి కూసుంటే వొగ యెన్ను మిగుల్తుంది, చేన్లో గువ్వలెన్నో, యెన్నులెన్నో చెప్పు' ప్రశ్న గుర్తొచ్చింది.

తల్లిదండ్రులను సొంతూరులో వదలి దోణప్ప భార్యాపిల్లలతో బెంగళూరులో స్థిరపడి పదేళ్ళవుతూ ఉంది. పదేళ్ళలో ఇసుక, కంకర, సిమెంటు అందించే కూలీ స్థాయి నుంచి నాణ్యమైన తాపీమేస్త్రీగా ఎదిగాడు. నాలుగిళ్ళలో పాచిపనికి కుదిరిన తన భార్య శంకరమ్మ ఇపుడు ఆ పని మానేసి పిల్లల వెంటపడి చదివించడం మొదలెట్టింది. రోజువారి పనుల్లో సతమతమయ్యే దోణప్ప దంపతులకు వేసవి సెలవుల్లో పిల్లలతో సొంతూరికి పోవడం అలవాటు.

రాత్రి ఎనిమిది గంటలకు బస్సు పాటూరు చేరింది. అది యాభై ఇండ్ల పల్లె. రెండే వీధులు. ఎగువ వీధిలోని దోణప్ప ఇంటికి బీగం వేసి ఉంది. ఆవుదూడ మాత్రం పక్కన సపారిలో కట్టేసి ఉన్నాయి. దోణప్ప అమ్మానాన్న ఎక్కడికెళ్ళారో చెప్పడానికి ఆ వీధిలో ఎవరూ లేరు. పక్కింటి వాళ్ళు, ఎదురింటి వాళ్ళు కూడా లేరు. ఇండ్లన్ని బోసిగా ఉన్నాయి. ఎక్కడికెళ్ళారా? ఆలోచిస్తూ ఆలుమగలు నిలబడ్డారు. నానమ్మ, తాతయ్య ఒడిలో వాలి పోవాలనుకున్న నాగరాజు, నాగమణి నిరాశలో మునిగారు.

'ఇప్పుడెలా?' అనుకుంటూ దోణప్ప వీధి వెంట చూస్తున్నాడు. ఏళ్లుగా వెలిగి వెలిగి అలసిన వీధి లైటు వెలిసిపోయి ఒకింత పసుపు రంగు కలుపుకుని గుడ్డి వెల్తురు పరుస్తున్నది. 'కొత్త రక్తం గావు' అన్నట్లు కుప్పలుగా దోమలు వీళ్ళ చుట్టూ తిరుగుతూ పొలికేకలు పెడుతున్నాయి. రాత్రంతా దోమలకు ఆహారమైతే మాత్రం నలుగురూ అనారోగ్యం మూటకట్టుకు పోవాల్సిందే, మరి ఎక్కడుండాలని ఆలోచిస్తున్నాడు దోణప్ప.

వీరి ఆలోచనలను తుంచేస్తూ ఓ బస్సు వచ్చి ఎదురుగా ఆగింది. రెండుసార్లు 'కుయ్ కుయ్' మంటూ హారన్ మోగగానే, అలవాటైన స్కూలు పిల్లల్లాగా ఊరి దిగువ వీధినుంచి పిల్లాజెల్ల కలిపి యాభైమంది ఉరుకులు పరుగుల మీద బస్సులోకి ఎగబడ్డారు. బస్సులో నుంచే దోణప్పను గుర్తుపట్టిన బాల్యమిత్రుడు యెంగటేసు "మీ నాయనోళ్ళు ఆసుపత్రికి బొయిండారు, మీరుగుడక రాండి" అన్నాడు.

ఆసుపత్రికి పొయినారనంగానే ఊపిరాగినంత పనైంది దోణప్పకు. పల్లెలో మిగిలిందేమైన ఉంటే పట్నానికి ఎగేసుకు పోదామనొచ్చాడు. అలాంటిది అమ్మానాన్న ఆసుపత్రి పాలైతే పట్నంలో బుడుక్కొచ్చిందంతా పల్లెలో ఖర్చుపెట్టాల్సొస్తుందనే భయపడ్డాడు. మరో ప్రశ్న వేయకుండా బస్సెక్కాడు, వెనకే భార్యాపిల్లలు కూడా.

ఐదు కిలోమీటర్ల ప్రయాణం తరువాత ఓ పెద్ద గేటు గుండా లోపలికి చేరింది బస్సు. ప్రయాణంలో మిత్రుడు చెప్పిన వివరాల ప్రకారం.. 'మెడికల్ కాలేజీ కొత్తగా ఏర్పాటయింది. కాలేజీ నడపాలంటే అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో రోజుకు కనీసం రెండు మూడొందల మందయినా రోగులుండాలి. కొంతమంది ఆసుపత్రిలో ఇన్–పేషంట్లుగా ఉండాలి. మిగతావారు అవుట్–పేషంట్లుగా వైద్యం అందుకుంటూ ఉండాలి.

కానీ ఇక్కడి ఆసుపత్రికి అంత మంది రోగులు రారు. రేపటినుంచి మూడు రోజులు మెడికల్ కాలేజీ తనిఖీ ఉంది. ఆ మూడ్రోజులూ రోగులు కావాలి. అందుకే చుట్టూ నాలుగు గ్రామాల్లో ఉన్న జనాలను ఆసుపత్రికి బస్సులో తరలిస్తున్నారు. ఇలాంటి తనిఖీ సందర్భంలో చాలావరకు వైద్యం ఉచితంగా అందుతుంది. ఇదే అదునని కొందరు పేరబెట్టుకున్న జబ్బులకు వైద్యం చేయించుకుంటారు. మిగతా అవసరమైన రోగుల సంఖ్యకోసం ఏ రోగమూ లేకపోయినా వచ్చి బెడ్లపై పడుకుంటారు. ఒకో రోగి ఎన్ని రోజులుగా ఆసుపత్రిలో ఉంటున్నారనేది డాక్టర్లే తనిఖీ అధికార్లకు చెబుతారు. ఒక వేళ తనిఖీ అధికార్లు అలాంటి ప్రశ్న రోగులను వేస్తే, డాక్టర్లు చెప్పిన మాటలే రోగి అప్పచెప్పాలి. ఏదైనా విభాగంలో రోగులు తక్కువైనపుడు ఈ విభాగం నుంచి వెళ్లి డాక్టర్లు చెప్పిన మరో విభాగంలో చేరాలి. ఈ పద్ధతిని 'పేషంటు సైక్లింగ్' అంటారు వాళ్ళు. అలాగే ఆసుపత్రిలో రోగులు చేరుతున్నట్లు, ఆరోగ్యం కుదటపడి డిశ్చార్జి అవుతున్నట్లు కనిపించాలి. రోగులుగా చేరిన వాళ్లకు రోజుకు ఐదువందల రూపాయల కూలి ఇస్తారు. మూడు పూట్ల భోజనం, పాలు, బ్రెడ్, పండ్లు ఇస్తారు. అత్యవసర వార్డులో చేరిన రోగులకు అదనంగా వంద రూపాయలు ఇస్తారు.'

బస్సు దిగంగానే ఒక్కొక్కరి పేరు, వయసు, లింగం, రోగం రాసుకుని ఎవరు ఏ వార్డుకు వెళ్ళాలో అక్కడున్న డాక్టర్లు నిర్ణయించారు. ఏ రోగం లేదన్న వారికి వయసు, లింగం, శరీర పరిస్థితి ఆధారంగా రోగం నిర్ణయించారు. మిడాలు, మోకాళ్ళు, నడుములు నొప్పులనే ముసలివాళ్ళను ఎముకల వార్డులో చేర్చుకున్నారు. వాళ్ళలో పదిమందికి సెలైన్ ఏర్పాటు చేశారు. ఇద్దరు యువకులకు, నలుగురు పిల్లలకు కాలో చెయ్యో విరగకపోయినా కట్లు కట్టారు. అంతకు ముందెన్నడో తీసిన ఎక్స్‌రేలు వీళ్ళ మంచాలకు వేలాడదీశారు. అదే వయసు పిల్లలకు సంబంధించిన ఎక్స్ రేలు వాడారు. రోగులకు ఎముకల విరగలేదు కాబట్టి ఎక్స్ రేల ఆధారంగా కట్లు కట్టారు. కొందరికి ఐవి ఇంజక్షన్ వేయడానికి వీలుగా చేతికి కాథ్ ఏర్పాటు చేశారు. కాథ్ ఏర్పాటుకు ఒప్పుకున్న వాళ్లకు యాభై రూపాయలు అదనంగా ఇస్తారు. దోణప్ప పిల్లలను చిన్నపిల్లల వార్డులో రోగులుగా చేర్చుకున్నారు. పిల్లలకు చాకోలెట్లు, బిస్కట్లు కూడా ఇచ్చారు. అలా ఏ విభాగానికి కావలసిన రోగులను ఆయా విబాగాధిపతులు చేర్చుకున్నారు. దోణప్పను కార్డియాలజీ విభాగంలో చేర్చుకున్నారు. రెండురోజుల ముందు రాత్రి గుండె నొప్పి వచ్చినట్లుగా రికార్డు తయారయింది. అప్పటికే అతడి తండ్రి అదే విభాగంలో రోగిగా నమోదయి ఉన్నాడు. దోణప్ప తల్లి కాళ్ళు నొప్పులంటూ అప్పుడప్పుడు ఎదారి పడుతుంటుంది. ఆమె ఎముకల వార్డులో చేరింది. దోణప్ప భార్య ప్రసూతి విభాగంలో గర్భసంచి తీయించుకోవడానికి నమోదయినట్లుగా పత్రాలు తయారు చేశారు.

రోజుకు రెండుపూటలా పెద్ద డాక్టర్లు వచ్చి ప్రతి బెడ్డుకు కట్టిన ఫైళ్ళలో ఏవేవో రాసి పోతున్నారు. పెద్ద డాక్టర్ల వెనక కోడిపిల్లల్లాగా చదువుకొనే పిల్ల డాక్టర్లు వస్తున్నారు. పెద్ద డాక్టర్లు చెప్పిన వివరాలు పిల్ల డాక్టర్లు తమ నోటు పుస్తకాల్లో రాసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన తనిఖీ అధికార్లు వివిధ వార్డులకు వచ్చారు. భాష రాకపోవడంతో రోగులతో మాట్లాడే అవకాశం వాళ్లకు లేకపోయింది. మూడు రోజులు ఆసుపత్రిలో గడిపిన దోణప్ప కుటుంబానికి రూ. 8 వేల 'రోగి కూలి' ముట్టింది. వాళ్ళిచ్చిన కూలి డబ్బుల కంటే, ఆ ఏసి గదుల్లో ఉండటం గొప్ప అనుభవం వాళ్లకు. దోణప్ప బయటకు వస్తూ 'ఎబ్బుటికైనా బిడ్డలను యిట్టా చోట వైదిగం చదివించాల.' అనుకున్నాడు.

❖❖❖

కథలో రాజుగారి ఏనుగు దారినబోయే దానయ్యకు పూలమాల వేయడం, అతడిని రాజుగా పట్టాభిషేకం చేయడం ఒక పేరా తేడాలో జరిగిపోతుంది. అలాగే దోణప్ప జీవితంలో కూడా స్వల్పకాలంలో మార్పొచ్చింది. మెడికల్ కాలేజీనుంచి ఇంటికి రాగానే ఆస్తి అమ్మడానికి తల్లిదండ్రులను ఒప్పించి ఐదెకరాలు భూమి ఐదు లక్షలకు అమ్మి బెంగుళూరుకు డబ్బు తెచ్చుకున్నాడు.

కూలీగా మొదలై తాపీ మేస్త్రీగా ఎదిగిన క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం వాసన వంటబట్టింది. కుడిచేతికి మొలిచిన అదనపు చెయ్యి తాపీని పక్కన పడేశాడు. యాభై లక్షలకు ఎకరం బేరం చేసి, ఐదు లక్షలు అడ్వాన్సుగా ఇచ్చి అగ్రిమెంటు రాసుకున్నాడు. ఆరునెలల్లో ప్లాట్లు వేసి కోటి రూపాయలకు అమ్మాడు. బెంగళూరు కార్పొరేషన్ అనుమతి పొందడానికి, రోడ్లు వేయడానికి, కరెంటు స్తంభాలు నాటడానికి పెట్టిన ఖర్చులు, భూమి సొంతదారుడికి కట్టాల్సిన డబ్బులు పోగా ఇరవై లక్షలు మిగుల్చుకున్నాడు. ఈసారి ఇరవై లక్షల అడ్వాన్సుతో ఐదెకరాల భూమికి అగ్రిమెంటు రాయించుకున్నాడు. అలా అడ్వాన్సు ఇచ్చి భూములుపై అగ్రిమెంట్లు చేసుకోవడం, ప్లాట్లు వేసి అమ్మడంతో పదేళ్ళలో కోటీశ్వరుడయ్యాడు. నిర్మాణాలు చేసుకునే వారికి సిమెంటు, ఇసుక, రాయి, నీళ్ళు, కూలీలు, తాపీ మేస్త్రీలను సమకూర్చడంతో మరో నాలుగు మెట్లెక్కాడు. తాపీ మేస్త్రీలకు ట్రైనింగ్ ఇప్పించి భవన నిర్మాణంలో నాణ్యత పెంచాడు. గంజికి కష్టపడ్డ దోణప్ప బెంజిలో తిరగడం మొదలెట్టాడు. ఇరవై మంది ఆఫీసు ఉద్యోగులతో పాటు ఇండ్లు, ఇండ్ల ప్లాట్లు అమ్మే ఏజెంట్లు యాభై మందికి పని కల్పించాడు. అతడి భార్య కూడా రియల్ ఎస్టేట్ పనుల్లో చేదోడు వాదోడుగా నిలుస్తున్నది.

పాటూరులో తల్లిదండ్రుల జీవనానికి వదలిన ఎకరం నేలలో పెద్ద బంగళా కట్టాడు. తల్లిదండ్రులను బంగాళా అంటీరూముల్లో ఉంచాడు. తల్లిదండ్రులకు కావలిసిన సామగ్రి బెంగుళూరు నుంచి పంపిస్తున్నాడు. బెంగళూరు రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు సంబం ధించి ఏవైనా పెద్ద డీల్స్ చేయాల్సొస్తే ఈ బంగళాలోనే జరుపుతుంటాడు. ఈసారి వేసవిలో పిల్లలతో గడపడానికి బంగాళాకొచ్చాడు.

❖ ❖ ❖

దోణప్ప కొడుకు, కూతురు మెడికల్ కాలేజీ అడ్మిషన్ కోసం నాలుగోసారి ప్రవేశ పరీక్ష రాసినా ఎంబిబిఎస్ సీటు రాలేదు. "పిల్లలకు మెడికల్ కాలేజీల్లో సీటు సంపాదించలేని రియల్ ఎస్టేట్ డబ్బెందుకు?" అనుకున్నాడు. పదేళ్ళ క్రితం తను రోగిగా వెళ్ళిన మెడికల్ కాలేజీ సీనియర్ డాక్టర్లకు బంగాళాలో మందు పార్టీ ఇచ్చాడు. పదిహేను మంది డాక్టర్లు వచ్చారు.

ఆ డాక్టర్లతో మాట్లాడి విదేశాల్లో ఎంబిబిఎస్ చదివిన పిల్లల గురించి తెలుసుకున్నాడు. "విదేశాల్లో చదివిన వారు ప్రాక్టీసు చేయాలన్నా, పిజి ప్రవేశ పరీక్ష రాయాలన్నా దేశ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష పాసవ్వాలి. అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించినా వారు పిజి ప్రవేశ పరీక్ష ద్వారా సీట్ సంపాదించడం గగనం. వారిలో చాలామంది పిజి సీట్ల కోసం ఏళ్ల తరబడి ప్రవేశ పరీక్షలు రాస్తూ, ప్రైవేటు ఆసుపత్రులలో డ్యూటీ డాక్టర్లుగా చేరి ముప్ఫై నలభై వేల నెలసరి జీతానికి పనిచేస్తుంటారు." వచ్చిన వాళ్ళలో ఓ డాక్టర్ చెప్పిన విషయం నిజమేననిపించి, బయట దేశాల్లో తమ పిల్లలను ఎంబిబిఎస్ చదివించకూడదని నిర్ణయించుకున్నాడు.

కాలేజీ ప్రిన్సిపాలుతో మాట్లాడాలనుకున్నాడు దోణప్ప. తను వెళ్ళినరోజు మెరిట్లో సీట్లు వచ్చిన విద్యార్థులు చేరే రోజు. తల్లిదండ్రులతో కలిసి వచ్చారు పిల్లలు. కాలేజీ నిండా మనుషులు. ఎక్కడ చూసినా రోగులే, పదేళ్ళలో ఎంత మార్పు అనుకున్నాడు. దోణప్పకు కాఫీ, కూల్ డ్రింక్ లాంటి పానీయాల ఆఫర్ ఇచ్చారు. ప్రిన్సిపాల్ తనకిచ్చిన గౌరవానికి దోణప్ప మురిసిపోయాడు.

పిల్లలిద్దరినీ మేనేజ్మెంటు కోటాలో ఎంబిబిఎస్ కోర్సులో చేర్చాడు. రియల్ ఎస్టేట్ సంపాదన ముందు ఎంబిబిఎస్ సీటు యాభై లక్షలు పెద్ద ఖర్చుగా అనిపించలేదు.

ఆసుపత్రిలో రోగుల సంఖ్యలో పెద్ద మార్పేమీ లేదు. రోజువారి రోగులు యాభైకి మించడం లేదు. ప్రాక్టికల్ పరీక్షల కోసం రోగులను కూలికి తెస్తున్నారు. మధ్యలో ఒకరిద్దరు విద్యార్థులు 'రోగులు లేకుండా వైద్యవిద్య ఏమిటి?' అనుమానం వ్యక్తం చేశారు. అనుమానం వ్యక్తం చేసిన వారిని మరుసటిరోజు ప్రిన్సిపాల్ పిలిపించి, 'హాస్టల్లో అన్నం బాగాలేదని చెపుతున్నారట, ఏమిటి మీ పిచ్చి వేషాలు?" అంటూ గద్దించాడు. ప్రిన్సిపాల్ అనుకుంటే 'పదేళ్ళయినా ప్రాక్టికల్సులో పాస్ కాలేరని' సీనియర్స్ చెప్పిన మాటలు గుర్తొచ్చి ఇంకెప్పుడు 'రోగులు లేరేమిటని' ఏ విద్యార్థీ ప్రశ్నించలేదు.

ఐదున్నరేళ్ళకు ఎంబిబిఎస్ కోర్సు పూర్తయింది. తరువాత మూడేళ్ళు దోణప్ప పిల్లలు వరసగా పిజి ప్రవేశ పరీక్ష రాశారు.

'తొలేటుకు తోలు తెగంది మలేటుకు మాను తెగేనా?' ప్రవేశ పరీక్షల్లో ఎంబిబిఎస్ సీట్లే రాలేదు, ఇక పిజి సీట్లు వస్తాయా? మేనేజిమెంటు కోటాలో కోటిన్నర లెక్కన సీట్లు కొనక తప్పలేదు. దోణప్ప కొడుకు ఆర్థోపెడిక్స్, కూతురు గైనకాలజీ డాక్టర్లయ్యారు.

❖ ❖ ❖

ఎంబిబిఎస్, పి జి కోర్సులకు ఇద్దరి పిల్లలకు కట్టిన రెండు కోట్ల డొనేషన్, చదివే సమయంలో ఇతరత్రా ఖర్చుల కోసం పెట్టిన కోటిన్నర కలిపి వడ్డీతో సహా తిరిగి రాబట్టే ఆలోచనలో పడ్డాడు దోణప్ప.

మెడికల్ కాలేజి డాక్టర్లకు మరోసారి పార్టీ ఇచ్చాడు. తన పిల్లలు చేసిన స్పెషలైజేషన్లతో పాటు ఏ ఇతర స్పెషలైజేషన్లు చేసినవాళ్ళు కలిసి ఆసుపత్రి పెట్టుకుంటే వ్యాపారం బాగుంటుందో తెలుసుకున్నాడు. అలాంటి స్పెషలైజేషన్లు చేసిన వాళ్ళనే కోడలు, అల్లుడుగా ఎంచి, ఒకే ముహూర్తంలో పెళ్లి చేశాడు. కోడలు, అల్లుడు కూడా మేనేజ్మెంటు కోటాలో చదివిన బాపతే.

భవన నిర్మాణంలో దోణప్ప పొందిన నైపుణ్యాన్ని ఆసుపత్రి కట్టడంలో ఉపయోగించాడు. ఆరునెలల్లో ఆసుపత్రి కట్టడం పూర్తయింది. రోగుల పరీక్షలకు సంబంధించిన మెషీన్లు ఆసుపత్రిలో సమకూరాయి. 'దోణప్ప హాస్పిటల్స్' అనే బోర్డు చూసి మురిసిపోయాడు. ఆసుపత్రి కోసం వీళ్ళు నలుగురు కాక పదిమంది డ్యూటీ డాక్టర్లను నియమించుకున్నారు. వాళ్ళు పి జి సీట్ల కోసం ప్రయత్నిస్తూ ఉద్యోగాలు చేసేవాళ్ళు. కావలిసిన సంఖ్యలో నర్సులు, ఆయాలు, సాంకేతిక సిబ్బందిని నియమించుకున్నారు. మేనేజ్మెంటు కోర్సు చదువుకున్న ఐదుమంది యువకులను హెల్త్ కన్సల్టెంట్లుగా నియమించుకున్నారు. పత్రికల్లోనూ, టి వి చానెళ్ళలోనూ ఆసుపత్రి గురించిన అడ్వర్టైజ్మెంట్లు ఇబ్బడిముబ్బడిగా ఇప్పించారు.

పేషంటు ఆసుపత్రిలోకి అడుగుపెట్టగానే హెల్త్ కన్సల్టంట్లలో ఒకరిద్దరు చుట్టుముడతారు. వైద్య పాకేజీల రేట్ల గురించి, ఏయే పాకేజీలో ఏయే టెస్టులు చేయబోయేది, ఏయే టెస్టులు చేయించుకుంటే, ఏయే టెస్టులు ఉచితమో వివరిస్తారు. ఇతర హాస్పిటల్లతో పోలిస్తే ఇక్కడ ఉచితంగా చేసే టెస్టుల గురించి వివరిస్తారు. రోగులకు ఏసి రూము, నాన్ ఏసి రూములకు, కామన్ బెడ్స్ కలిగిన హాల్లకు ఉన్న తేడాలు వివరిస్తారు. ఆరునెలల్లో ఆసుపత్రిలో బెడ్లు దొరకడం గగనమైంది. అంత తొందరగా బెడ్లు దొరకని స్థాయికి ఆసుపత్రి ఎదుగుతుందని దోణప్పతో పాటు ఎవరూ ఊహించలేదు. ఆసుపత్రి భవనం కార్పొరేట్ స్థాయిలో ఉన్నట్లుగానే, బిల్లులు కూడా కార్పొరేట్ స్థాయిలో వేస్తున్నారు.

❖ ❖ ❖

కథలో ఒక పేరా తేడాతో పేదవాడు రాజు అయినట్లుగానే, రాజు పేదవాడయ్యే ప్రమాదమూ లేకపోలేదు. 'దోణప్ప హాస్పిటల్స్' మొదలెట్టిన ఏడాదిలోపే యాభై పైగా మరణాలు సంభవించాయి. ఈ ఆసుపత్రి వ్యాపారం గమనించి కన్ను కుట్టిన ఇతర హాస్పిటల్సుకు చెందిన సీనియర్ డాక్టర్లు హైకోర్టుకు ఉమ్మడి లేఖ రాసారు. కోర్టు ప్రభుత్వాన్ని సంజాయిషీ అడిగింది. ప్రభుత్వం ఎంక్వయిరీ కమిటీ వేసింది. ఎంక్వయిరీ కమిటీ వస్తుందనే ఒత్తిడిలో దోణప్పకు ఎదలో నొప్పి మొదలైంది. కుటుంబంలోని నలుగురు డాక్టర్లు కలసి దోణప్పకు గుండె జబ్బని తేల్చారు.

మరుసటిరోజు ఎంక్వయిరీ కమిటీ ఆసుపత్రికి వచ్చింది. రికార్డులు స్వాధీనం చేసుకుంది. ఆసుపత్రికి సీలు వేయించింది. అప్పటికే చికిత్స పొందుతున్న రోగులను ఇతర ఆసుపత్రులకు పంపారు. వేరే ఆసుపత్రిలో చేరిన దోణప్పకు 'గుండెజబ్బు కాదు గ్యాస్ సమస్య' అన్నారు. గ్యాస్ తగ్గించే టాబ్లెట్లు వేసుకోవడంతో ఆ సమస్య తీరింది. అసలు సమస్య మొదలయింది.

ఎంక్వయిరీలో రెండు రకాల వివరాలు బయటకొచ్చాయి. అందులో మొదటి రకం.. ఆసుపత్రి భవనాలు, రూములు, ఎ సి, టాయిలెట్లు, మెషినరీ లాంటివి కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయి. మందులు ఉత్తమమైన కంపెనీల నుంచే తెప్పించి వాడుతున్నారు. రోగుల అవసరాల దృష్ట్యా కాక, మెషిన్ల లబ్ధి ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మెషిన్ల ద్వారా చేసిన రోగనిర్ధారణ మినహా డాక్టర్లు చేస్తున్న రోగ నిర్ధారణ లోప భూయిష్టంగా ఉంది. పని చేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్లలో రోగనిర్ధారణ జ్ఞానం బహు తక్కువగా ఉంది. చనిపోయిన రోగుల్లో తొంబై శాతం పైగా రోగ నిర్ధారణ లోపం వల్లనే మరణించారు. ఇక రెండవ రకం.. చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఆసుపత్రి చెల్లించాలి. రోగ నిర్ధారణ లోపంతో చనిపోయిన వారి వయసును బట్టి ఇరవై లక్షల నుంచి, రెండు కోట్ల వరకు పరిహారం చెల్లించాలి. అందుకు అవసరమైన డబ్బు ఆసుపత్రి యాజమాన్యం భరించాలి. యాజమాన్యం సమకూర్చలేని పక్షంలో ఆసుపత్రి ఆస్తులు అమ్మి చెల్లించాలి. ఆసుపత్రి నడుపుతున్న దోణప్పపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి.

❖ ❖ ❖

డాక్టర్ల రోగనిర్ధారణ శక్తిలో లోపాల పరిశీలనకు ప్రభుత్వం మరో కమిటీని వేసింది. రోగనిర్ధారణ లోపాల కారణాలను వెతికే పనిలో భాగంగా నలుగురు డాక్టర్లు ఒకే కాలేజీలో, మేనేజ్మెంటు కోటాలో చదవడం గుర్తించారు. 'ఈ డాక్టర్లు మీ వద్ద చదివింది నిజమా? అని కాలేజీకి, మీ యూనివర్సిటీ డిగ్రీ పొందిన వారేనా?' అని యూనివర్సిటీకి ఉత్తరాలు రాశారు. చదివింది, యూనివర్సిటీ డిగ్రీలు ఇచ్చింది నిజమేనని జవాబులు వచ్చాయి. డాక్టర్లు మంచి మార్కులతో పాస్ అయినట్లుగా సర్టిఫికెట్లు కూడా చూపిస్తున్నాయి. అయితే డాక్టర్లతో మాట్లాడినపుడు వాళ్ళ మేధోసంపత్తి స్పెషలైజేషన్ స్థాయిలో లేదని, రోగనిర్ధారణ శక్తి లోపభూయిష్టంగా ఉందని విచారణ కమిటీ సభ్యులు సులభంగానే గ్రహించారు. కానీ ఈ పరిస్థితి ఎలా దాపురించిందో కనుక్కోవాలని, ఆ కమిటీ నలుగురు డాక్టర్లు చదివిన కాలేజీకి వెళ్ళింది.

ఈ కాలేజీ ఒక మేజర్ పంచాయతీలో ఏర్పాటయింది. అక్కడ జనాభా 30 వేలకు మించదు. కాలేజీలో రెండొందల ఎంబిబిఎస్ సీట్లు, యాభై పిజి సీట్లు ఉన్నాయి. ఎంసిఐ పర్యవేక్షణ రోజుల్లో మాత్రమే ఆ కాలేజీకి సంబంధించిన ఆసుపత్రిలో రోగులు, డాక్టర్లు, నర్సులు, ఆయాలు అవసరమైన సంఖ్యలో ఉండేవారని, మిగతా సమయాల్లో అందులో నాలుగోవంతు కూడా ఉండరని కమిటీ గ్రహించింది. జీతం చాలలేదనో, ఇతరత్రా కారణాల వల్లనో కాలేజీ వదలిన డాక్టర్లు ఈ వివరాలను ధృవీకరించారు. కాలేజీ చుట్టుపక్కల గ్రామాల్లో విచారణలో 'ఎంసిఐ తనిఖీ సమయంలో రోగులుగా ఆసుపత్రిలో చేరుతామని' వివరించారు. ఈ ఎంక్వయిరీ కమిటీ మెడికల్ కాలేజీకి గుర్తింపునిచ్చే ఎంసిఐకి సంబంధించినది కాదు, నలుగురు పాత విద్యార్థుల గురించే గనక కమిటీ వచ్చిన సందర్భంలో 'కూలి రోగులు' అనవసరమని నమ్మి వాళ్ళను సమకూర్చుకోలేదు. రోగులు లేకుండా మెడికల్ కాలేజీ నడపడంతో రోగనిర్ధారణ మేధస్సు లేని డాక్టర్లు తయారవు తున్నారని కమిటీ సభ్యులు నిర్ధారించారు. రోగులు లేని మెడికల్ కాలేజీలకు అనుమతి ఇవ్వరాదని ముగింపు వాఖ్యలు చేశారు.

కేసు ఎదుర్కొంటున్న నలుగురు డాక్టర్లు స్పెషలైజేషన్లు అయ్యాక కూడా ఎంబిబిఎస్ స్థాయిని మించి సబ్జెక్టు నాలెడ్జి లేదని కమిటీ నిర్ధారణ చేసింది. నలుగురికి పిజి డిగ్రీలు కాన్సిల్ చేయమని ఎంసిఐకి రెకమెండేషన్ చేసింది. తమ నలుగురిని పార్టీ చేయకుండా 'తమ గురించి కాలేజీలో ఎంక్వయిరీ కమిటీ విచారణ చేసిందని, అలా చేయడం చట్ట విరుద్ధమని' డాక్టర్లు నలుగురు కలిపి హైకోర్టులో కేసు వేశారు. 'కోర్టులో విచారణ పూర్తయ్యే వరకు ఎంక్వయిరీ కమిటీ రిపోర్టుపై ఎలాంటి చర్యలు తీసుకో రాదని' హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

'డాక్టర్ల విద్యార్హతపై నిర్ణయం రాకముందే పరిహారం చెల్లించ మనడం, ఆసుపత్రి మూయడం చట్ట విరుద్ధమని' దోణప్ప హైకోర్టులో కేసు వేశాడు. కేసు కొలిక్కి రాలేదు. 'మా ఆసుపత్రి ఎదుగుదలను ఓర్చుకోలేని ఇతర ఆసుపత్రి వ్యాపారస్తులు కేసులు వేశారని ప్రచారం చేశారు.' హాస్పటల్ తిరిగి వ్యాపారం మొదలెట్టింది. దోణప్ప 'ఆరోగ్య వ్యాపారం' మూడు టెస్టులు, ఆరు ఆపరేషన్లుగా కొనసాగుతూనే ఉంది.

రోగులు లేని ఆసుపత్రి, మెడికల్ కాలేజీల కంటే, రోగులు ఉన్న ఆర్ఎంపి వైద్యుల వద్ద వైద్యం బాగా నేర్చుకోగలరని వైద్య విద్య గురించి తెలిసిన వారి నమ్మకం. పేషంట్లు లేని మెడికల్ కాలేజీల్లో వైద్యం నేర్చుకోవడమంటే 'దున్నకుండా చల్లితే కొయ్యకుండా పండే పంటలాంటిదని' కొందరన్నారు. 'పిల్లి లేని చీకటిగదిలో నల్ల పిల్లిని వెతకడం లాంటిదే' అన్నారు ఇంకొందరు. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన డాక్టర్లు సొంతంగా ప్రాక్టీసు చేసే సాహసం చేయలేక గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో సీనియర్ రెసిడెంట్లుగా చేరడం, ప్రైవేట్ ఆసుపత్రులలో డ్యూటీ డాక్టర్లు, ఫెలోస్ అంటూ చేరడం రోగ నిర్ధారణలో మెళుకువలను నేర్చుకోవడం కోసమేనన్న సత్యం చాలామంది గుర్తించారు.

కాసులు కాలేజీ మేనేజ్మెంటుకు విసిరితే సర్టిఫికెట్లతో డాక్టర్లు రావొచ్చు కానీ, రోగాలు కుదిర్చే డాక్టర్లు రారని దోణప్ప తెలుసుకోగలిగాడు. ఆరోగ్య శాఖ మంత్రులు, అధికార్లు ఇంకా తెలుసుకోవలిసి ఉంది.

■

## రోజూ ఎగిరే పిట్టలు

ఇప్పటి పిట్టలదో గమ్మత్తు
చెట్టు అంతరంగం మీద
వాలీ వాలకుండానే ఉడాయిస్తున్నాయేమిటి
పిట్టల ఆయుష్షు
ఒక్కటంటే ఒక్కరోజూ ఉండటంలేదు.
అవి కాలం ఘర్షణలో పుట్టినవా
మాయల ఫకీర్లు చిలుకకు బదులు
శునకంలో దూరి పుట్టించినవా?

అప్పుడప్పుడు అత్యంత సహజంగా
ప్రకృతి కన్న కలలలాంటి విహంగాలూ
సూటిగా దూసుకొచ్చి
మన అంతఃసీమలను వైబ్రెంట్ చెయ్యబోతాయా
లక్ష్యపీఠాలు క్షణాల్లో
వాటికి రంగులద్దేస్తాయి
అప్పుడవి కృత్రిమత్వపు బరువెక్కి
మన పెదవుల మీద కొన్నాళ్ళు రెపరెపలాడతాయి
చివరికి అవి అబద్ధపు చావన్నా చస్తాయి
ఎవడన్నా కనిపించని దారాలతో లాగేస్తే
ఎగిరన్నా పోతాయి
ఇంతకీ .. ఎక్కడా కుక్కను మనిషి కరవకున్నా
కుతకుతమనే వార్తల కూరాడు ఉడుకుతూనే ఉంటది
ప్రాణాక్షరాన్ని విపణి సీమలో పెట్టని
దర్పణమేదన్నా ఉందేమోనని
అమాయకపు కవి ఒకడు
దుర్భిణీ వేసుకు తిరుగుతాడు!
కొన్ని అందలాల తయారీ కోసం పుట్టినవి
కొన్ని నీలిద్రవ్యాన్ని తెల్ల కాసులుగా
మార్చుకుందామని జన్మలెత్తినవి
మరికొన్ని ఏకంగా తూకం రాళ్ళ కోసం
దినం దినం వేషం మారేవి
మరికొన్ని వ్యక్తుల్ని వ్యవస్థల్నీ
వేటాడి వెంటాడి దారి తప్పించేవి.
అక్కడ వార్తల పిట్టలన్నీ
హైబ్రిడ్ వంగడంగా పుట్టుకొచ్చి
మనుషుల్ని వర్ణ సమూహాలుగా చీలుస్తె
అధర్మ విభాగాలుగా మారుస్తె ...

- ఏనుగు నరసింహారెడ్డి
89788 69183

## అక్షర ప్రయాణం

అప్పటిదాకా మనసులో
ఏదో తెలియని వెలితి
జీవితంలో ఏదో సాధించాలనే తపన
నిన్నటి దాకా
మా ఊరి కోసం జనం బాగుకోసం
మంచి చెయ్యాలనే ఉబలాటం
మనసంతా పరుచుకున్న గందరగోళం


అంతర్జాలంలో వెతికాను
తెలిసినవాళ్ళని అడిగాను
ఆ క్షణంలో .. గ్రంథాలయంలోని పుస్తకాలు
నా మస్తకాన్ని ఆవహించాయి
మనసంతా ఉత్సాహంతో ఉప్పొంగింది!

అధ్యయన క్షేత్ర తలుపులు
తెరచి చూసాను
అదొక చదువుల సముద్రంలా
నన్ను చుట్టి ముట్టింది
మేధోమధన వికాస కేంద్రంలా
అక్షరాలతో వెంటాడింది
ఒక్కసారిగా మస్తిష్కం నిండా ఆలోచనలతో
పురివిప్పిన అక్షరాలు

గురజాడ దేశభక్తి గీతం
రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి
తిలక్ కవిత్వం, చాసో కథలు
మార్క్స్ లెనిన్ మావో జీవితాలు
గొప్ప ప్రభావితం చేశాయి
నన్ను మనిషిని చేస్తూ
కొత్త దారిని చూపించాయి
వాటి వెంటే అడుగులు వేస్తుంటే
మనోవిజ్ఞాన అక్షర ప్రపంచం
కళ్ల ముందు విచ్చుకోవడం మొదలుపెట్టింది!

నా జీవితానికి
ఓ దిక్సూచి కనిపించింది
నన్ను నాలోంచి వేరుపడుతూ
కొత్త ప్రపంచాన్ని
అన్వేషించడం మొదలుపెట్టాను!

- రెడ్డి శంకరరావు
94943 33511




# 'బూడిద చెట్ల పూలు' రాల్చుతున్న నిష్ఠుర సత్యాలు

- పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

A poem is an adventure, a run away horse of leaps and surprises, words that toss you out of the saddle.

**— Chris Beckett, The poetry paper**

కవిత్వం నిజంగానే ఒక సాహస క్రియ అయితే కవి సాహసి. పొగరుబోతు కవిత్వ గుర్రాన్నీ ఒక్క పెట్టున లంఘిస్తా డు. కళ్లెం బిగించి దౌడు తీయిస్తాడు. జీను మీద లేచి, వెళ్లే దారిలో పదఘట్టనల దుమ్ము రేపుతాడు. మలుపుల్లో ఒక కొత్త పదంతో ఒక కొత్త ముక్తాయింపుతో ఆశ్చర్య కదనకదం తొక్కిస్తాడు. కానీ మార్గం దుర్గమం.

కాలం ఒక అవరోధం. గాలి ప్రతికూలం. రోగ భూయిష్టం. ప్రాణ చెలగాటం. రాజ్య సహాయం పూజ్యం. గత ప్రావీణ్యాలు పని చేయవు. పాత ఆయుధాలు పనికిరావు. ధైర్యమే శిరాస్త్రణం. కొత్తగా చెక్కిన విల్లంబులే శరణ్యం. శత్రువు కనిపించదు. వినిపించదు. చప్పుడు చేయకుండా కమ్ముకుంటాడు. చుట్టూ ప్రజలు నేలకొరుగుతుంటారు.

ఇది పరాయి దేశంతో తలపడే యుద్ధమా.. తన దేశంతో కలిసి, తన దేశంతో వెరచి, చేసే యుద్ధమా... తనలో ఇంకా బతికున్న మనిషితో చేసే యుద్ధమా? ఇది యుద్ధం అవుతుందో.. పరిసర ప్రకృతి పట్ల ఒక సామరస్య ఒప్పందం అవుతుందో.. ఈ అనంత విశ్వంలో ధూళికణం లాంటి తన ఉనికి కోసం పెనుగులాట అవుతుందో...

ఈ సాహస అశ్వికుడు, కవి నిజం శ్రీరామమూర్తి.

'బూడిద చెట్ల పూలు' కవిత్వంలో కొత్త దారులు తొక్కుతాడు. కొత్త కందకాలు, కంటకాలు దాటుతాడు. భీకర నగరారణ్యాలలో నుంచి ప్రయాణిస్తాడు. కల్లోలిత కాలం మీద నుంచి పోతూ తన చేవ్రాలు పత్రాలు జారవిడుస్తూ వెళతాడు. చీకటిలోకి చికిలించి చూస్తాడు. కవి ఒక్కడిగానే నగరమంతా కలవరపడుతూ కలయ దిరుగుతాడు. దిగులు చీకటి మాటున దాగున్న జీవితాలు చూస్తా డు. రాజ్య పదఘట్టనల కింద కొనప్రాణాల ఆర్తనాదాలు వింటా డు. 'బూడిద చెట్ల పూలు' రాలుస్తున్న నిజాలు చూడమంటాడు.

"అక్షరాల పూలబుట్ట
మురుగువాసన కొడుతోంది.
కొత్తవి పేర్చాలి

భావాల సరోవరం
కలువలు పూయడం మానుకుంది.
మూలాలను సవరించాలి." అనే స్పృహతో బాధ్యతతో బరువుతో దిగులుతో బయలుదేరతాడు.

నగరమంతా లోకమంతా కరోనా వైరస్ సోకి భయవిహ్వాల కనులతో చావడానికి సిద్ధంగా వున్న అనాధ ప్రేతంలా వుంది. కవి నగర నగ్న స్వరూపం కళ్లారా కంటుంటాడు. మనుషుల మరగుజ్జుతనమే విరాట్ స్వరూపంతో ఎదురవుతుంది. మాటల వెనుక మేట వేసి ఒక కూరూపితనం వుంటుంది. కవి చూపు అక్కడే నిలుస్తుంది.

"మనసు మైలపడి
అంతస్తుల అడుగు జారి
కింద పడతామని

వీధులను మేల్కొలిపే చీపురును
ద్వేషించడం మనకెంతో హాయి
దూరాలను పెంచేదే మనక్కావలసింది
ప్రాణాలను కోరకుంటే కరోనాను
కలకాలం ఇంట్లో కాపురం వుండమనేవాళ్లం' అని అసింట మనుషుల లేకితనాన్ని ఈసడించుకొంటాడు.

"శవాలను మోస్తూ జీవచ్ఛవాలను చూసి
ఒలుకుతున్న కన్నులతో
ప్రాణాలరచేత పట్టుకుని
పరుగులు తీస్తున్న నదులు
గుండె పగిలిన జెండా కింద
ఊపిరి పాయల్లో
నాగులు నర్తిస్తున్న చిద్విషాద నేల" అని భీతావహంగా

"ప్రాణాలరచేత పట్టుకొని/ పరుగులు తీస్తున్న నదులు" అని నదిలో శవాల వరద పారడాన్ని జీర్ణించుకోలేకపోతాడు. దీని కింద పారుతున్న నిజాల్ని పసిగడతాడు.

"వున్నట్టుండి కాదు ఆరిపోయింది
కావలసినవారి కన్నీటి మడుగుల్లో / చితులు తేలుతున్నాయి."

.........

చేతగానితనానికి సమాధి కట్టమని
మరణానికి గౌరవాగౌరవాలుండవని
గంధపు చెక్కలతో కాల్చినా
అయ్యే బూడిద అదేనని" కాష్టాల కాడ కూచొని కవి కాలని కట్టెలుగా మిగిలిన కావలసినవారికి వ్యర్థంగా బూడిద చెట్ల పూలను పంచుతుంటాడు.

కరోనా మీద రాబందులా వాలింది రాజ్యం. తప్పెట్లు దీపాలతో మృత్యుగంటని మరింతగా మోగించింది. మంది మాగధుల పురమాయింపు, చాదస్తుల గదమాయింపు పెచ్చుమీరాయి. రాజముద్ర వేసిన మతజాంబీల invasion.

"ప్రయోగశాలలో మనిషి మాటల మృగాలు పుడుతున్నాయి, కామరూప కాయలై నాట్యం చేస్తున్నాయి. యెవరి శవాల మీద వారినే కొత్తగా పుట్టించి తమలా మారుస్తున్నాయి. ఇప్పుడు నేను నా మృతదేహ క్షేత్రంలో మొలిచిన కొత్త మృగాన్ని." అని కనుగొన్నాడు.

కవి సర్వాంతర్యామి. సర్వభక్షకుడు. ఏ రూపంలోకైనా.. ఏ పాత్రలోకైనా.. ఏ స్థితిలోకైనా.. ఏ స్వరంలోకైనా మారగలడు. కరోనా లాగ మారగలడు. కరోనాలా మాట్లాడగలడు. కరోనా బాధిత జనమవ్వగలడు. కరోనా సాకుతో ప్రజలను పీలుస్తున్న ప్రభుతవ్వగలడు. A poet can transform into anything. కళ్లనిండా కన్నీళ్లు తీసుకొని, ఒక Giant Serpent లాగ బుసలు కొడుతున్న రాజ్యం ముందు యుద్ధం మరచిన యోధుడిలా నిస్పృహ ఆవరించిన సగటు మనిషిలానూ మారి, వారి ఓటమి మాటలను ఒప్పచెప్పగలడు.

"గోదాముల్లో నిల్వ వున్న కోటి టన్నుల ఆహార ధాన్యాలతో
పియమ్ కేర్స్‌లో మూలుగుతున్న లక్షల కోట్లతో దయ్యాల
రాజ్యం ఏలుకొమ్మని, వల్లకాటి సేద్యం చేసుకొమ్మని నూట ముప్పై కోట్ల సంతకాలతో వుత్తరం రాసి పెడదాం."

.......

"ప్రతిపక్షం, ప్రతి కంఠం లేని నల్లేరు మీది పాలనారథాన్ని బడా పెట్టుబడుల కంచుకోటల కనుసన్నల్లో అప్రతిహతంగా నడుపుకోవచ్చని, గరీబులు, గర్భ దరిద్రులు, భూమిబంధం కోసం మాసాల తరబడి రాజధానిని ముట్టడించే మూర్ఖ రైతుల బెడద వుండదని జన విశ్లేష సామ్రాజ్యాన్ని కలకాలం పాలించు కోవచ్చని, కో బలి అంటూ కోవిడ్‌ను దేశమంతటి మీదికి, ప్రజలందరి ప్రాణాలపైకి ఒకేసారి ఆవాహనం చెయ్యాలని సాష్టాంగ పడి ప్రార్థిద్దాం.."

..........

"అనుక్షణ రూకల మిలమిలల దేవతారతిలో, కార్పొరేట్ల కబేళాల మెత్తని కత్తుల వస్తు సుఖాల నిలువు దోపిడీల కాసులమై, తాము చేసిన జనగాయాల మీద తామే చల్లే సంక్షేమ కారాల మెరుపులకు మైమరచి ఓటు ఆరోప్రాణాన్ని/ ముందురాత్రి ఖాళీ చేసిన కోటర్ బాటిల్ మత్తులో ఇవియమ్‌లలోని వారి పాతాళ గోతుల్లో పడవేచి, పూనా బ్లక్మెయిల్ వొప్పందంతో సంతకం చేసి పశ్చాత్తాపడ్డ మహామేధావి నేతలా, అంతటా అన్ని వేళలా మోసపోతున్న, ఆదిమానవ సంతానమై...." అని అన్నీ తెలిసి తెలవలబోతున్న తమ స్థితిని లోతుగా ఆలోచించి చెప్పగలడు. పామరుడి కన్నా పాట ఎవరు కూర్చగలడు? మట్టి మాటలు ఎవడు చెప్పగలడు? ఓటమిని తల్చుకొని వలవల ఎవడు ఏడవ గలడు? గుండెను బండలుగా పరచి ఎవడు తన చావుని వాడే కవితగా చాటగలడు? పదవిన్యాసంతో అబద్ధపు గోడలు బద్దలు కొట్టగలడు?

Poetry, that the art of the marvelous, of a simultaneous compression of language and an endless expansion of meaning అని, అందుకే Fred D agviar (strong words) చెప్పింది. అర్థ తాత్పర్యాల లోతులు కొన్నింటికి అందవు.

కవి బహిరంగ విషాద నేపథ్యాన్ని భరించడానికి తనలో తాను ఒక outlet ఏర్పాటు చేసుకుంటాడు. అది ఒక్కోసారి వ్యంగ్యంగా, Satiricalగా బయట పడుతుంది. కవి స్వరంలో ఒక అవహేళన ప్రత్యక్షం అవుతుంది. ఒకో వాక్యం వెనుక ఒక తిరగబడిన మానవ విషాదముంటుంది.

"ఆసుపత్రి వంక చూడొద్దు
బెడ్ కోసం కల కనొద్దు
వ్యాక్సిన్ బాటిల్ లో వున్నది టీకానా
మురికినీరా అని అడగొద్దు
సిలిండిర్ ఫుల్లా ఖాళీయా అని అసలే వాకబు చేయొద్దు."

ఇది కవి తాను పాడుకుంటూ వెళ్లిన కవిత్వమంతా అంతర్ప్రవాహంగా వుంటూనే వుంటుంది. బాధ్యత మరిచిన సాధారణ పౌరుడికైనా, కార్పొరేట్ల కోరలు తోముతున్న మత రాజ్యాలకు అయినా ఒకటే చురక. వాత. కవి తను జారవిడుస్తున్న తన చేవ్రాలు పత్రాల నిండా ఈ అధిక్షేపనమే అక్షరాలా మనసుకు మంట పుట్టిస్తుంటుంది.

కవి ఒకోసారి తన కవితాశ్వాన్ని తనలో నిర్నిద్రంగా వుంచి నడుస్తుంటాడు. అపుడు కవితాశ్వం కవిలో అదృశ్యంగా వుంటుంది. ఒకోసారి కవి కవితాశ్వాన్ని నడిపిస్తుంటే.. ఒకోసారి కవితాశ్వం కవిని లాక్కుని అమితవేగంతో దౌడు తీస్తుంది. కవి, అశ్వికుడు ఒకడే అయిన క్షణాలు కవి సమయాలు. ఇలాంటి సమయాల్లో కవి చూపు జ్వాలామయంగా వుంటుంది. తెర వెనుక కప్పబడిన నిజాల్ని నిర్భయంగా బయటకు లాగుతుంది.

"ఒంటరిగా నువ్వు పోరాడుతుంటే, ఎకె ఫార్టీ సెవన్లతో,

కిరాయి గన్లతో కాకుంటే 'ఉపా'లతో అనంత గోడల వికృత బలాలతో ఆవు గాండ్రిస్తుంది. నీ తోలొలుస్తుంది"

ఇదీ రాజ్యం. రోజువారీ మనం చూస్తూనే వుంటాం. చదువుతూనే వుంటాం. మాట్లాడలేం. నిజం చెప్పలేం. గొంతు అనేక కారణాల చేత పూడుకుపోయుంటుంది. కవి ఇక్కడే తన గొంతు విప్పుతాడు. కారణాలు పాడతాడు. జరిగింది వైనంగా చెపుతూ కళ్ల పొరలు విప్పుతాడు.

"రూపాయి ఉయ్యాల గానానికి జోగిపోయి నిద్రపోడానికి అలవాటు పడినప్పుడే అంతా అయిపోయింది./ ఎంత పైకి ఎగిరినా దారం పట్టుకున్నవాడి పాదాల వద్దకు వచ్చి తీరవలసిన గాలిపటాలమయ్యాము." ఈ నిస్సహాయతకి కారణం తెలియని తనమా... తెలివిడిలేని తనమా.. తప్పు దారి పోతున్నా కాంచలేని తనమా?

"తామున్న గుడిసె కప్పుకున్న ఆకు దుప్పటి
ఏ తాటిదో చెప్పగలరు కాని
అందులోని దీపాన్ని ఆర్పేస్తున్న చేతులను
శాసించేదెవరో వూహించనైనానా లేరు"

ఈ అల్ప పరిస్థితిలో మార్పు కోసమే కవి కవిత్వ కత్తి పట్టాడు. లో చూపుతో ఒక మాట... చాలా లోతైన మాట జనానికి చెపుతున్నాడు... : "వేలి సిరాగుర్తు ఇక్కడ సువిశాల శిలువ"

ఇది గుర్తెరగాలి. ఈ శిలువ దించుకోవాలి. ఈ సమాధి స్థితిని పెకలించుకు రావాలి. కళ్లు తెరుచుకు చూడాలి. మేలుకోవాలి. కాలం కాలం పొడుగున అవకాశాలు ఇవ్వదు.

"మేలుకోవడం తెలియని జాతికి
గుండు గొట్టించే వారే గురువులు." అనడానికి కవికి కాలం అవకాశం ఇచ్చింది. బుజువవుతున్న వాస్తవాలే కవి చేద్రాలు పత్రాలు కదా.. కాలాన్ని తమ పంచన కట్టేసుకోవడం తెలియని వారి దగ్గర మంచికాలం వుండదు కదా...

కొన్నేసిసార్లు కవి తనలో తాను పాడుకుంటాడు. సమూహం మరచిన పాట. 'మా ఇంటి వాన' జ్ఞాపకాల వాన లాంటి పాట. తనలో బాల్యాన్ని బతికించుకునే పాట. తన జాతిని నిద్రలోంచి లేపే పాట. ఒకరికొకరు చేతులు కలిపి, గొంతులు కలిపి గానం చేయాల్సిన పాట.

"ఒక నువ్వు వొక నేను / రెండు వాగులై నాగులై
జగన్నాట్యం చేయగలం
మడి, గింజయి దిక్కులను కలిపే
హరిత బంధమై అలరించగలం /
ఒక నువ్వు వొక నేను/ చేద తాడై బావిని పారించగలం
చేయి సమ్మెటై, కొలిమిని పనిముట్లను చేయగలం/
ఏకలింగ ప్రసవాలు, వొంటి చేతి తప్పట్లు
గాలి లేని కొమ్మల పూనకాలు/ ద్రవం లేని ధారలు
ఒకే కుల ఒకే మత జాతులే ప్రకృతి విరుద్ధాలు"

ఇదే దారి. నడవాల్సిన దారి. వేసుకోవాల్సిన దారి. కలకనాల్సిన దారి.

'కాలం మారినప్పుడల్లా కాలనియమాలు మారతాయి. ప్రభుత మారినపుడల్లా అణచివేత విధానాలు మారతాయి.' ఆట స్థలమొకటే.. ఆట మారింది.' మతం ముఖచిత్రంగా మారణ హోమాలు ఆరని మంటలు దేశమంతా చెలరేగుతున్నప్పుడు ఆ చితుల మధ్య కవి దిమ్మరిలా, హృదయం రాలిపడ్డ ఒక సూఫీ కవిలా.. ఒక్కడే దీనార్తరావాల్ని ప్రపంచానికి చేరవేయగలడు. ఒక విఫల గీతమయినా పాడగలడు.

"నన్ను తెలుసుకోవాలంటే నా వైపు చూడొద్దు
నా చుట్టూ వేలు లక్షల మైళ్లు పరికించండి." అని జరుగుతున్న వినాశనాన్ని వేలు పట్టుకు చూయించగలడు. కవి ఎంత కొట్టి చంపినా చావని పాము. ఎంత మొదలు కంటా నరికేసినా మళ్లీ చిరునవ్వు మొలకేసే చెట్టు.

బండరాళ్ల మధ్య తలెత్తే పచ్చదనం. కార్పొరేట్టు రాసుకునే రూపాయల కావ్యంలో పొసగని వాక్యం. లొంగని పిడికిలి.

"చెట్లు కూలుతూ/ మళ్లీ లేస్తున్నాయి.
గొడ్డలి ఎంత నెత్తురు తాగుతున్నా
హరిత రక్తాన్ని/ తిరిగి నింపుకుంటున్నాయి
పుట్టిన మట్టిని పూసుకొని/ కొత్తపూలు పూస్తున్నాయి.
.......
ఆద్యంతాల మధ్య యుద్ధం
సరికొత్త ఆదికి పునాది వేస్తుంది
వర్తమానం కడుపున రేపటి
కాంతి బీజాలను జల్లుతుంది" అని తనని తాను మళ్లీ బూడిద లోంచి కట్టుకుంటూ వస్తాడు.మళ్లీ మళ్లీ మనిషిని ఊపిరిలూదుతూ వుంటాడు. లోకమంతా ఒకవైపు.. కవి ఒకవైపు..

"ఏ పక్షినోటి బీజం, ఏ క్షేత్ర గర్భవాసి అవుతుందో..."నని కలగంటుంటాడు. కత్తి పక్కన పెట్టడు. కంఠం తెగి పడినా కవితాశ్వం దిగడు. చేతనైన నమార్గాల్లో తన మాట వదిలి పోతూనే వుంటాడు. కాల ప్రవాహాన్ని ఎదురీదుతూ.. కాల పరీక్షల రాటుదేలే వాక్యాల పదవిన్యాస అస్త్రశస్త్రాలను సదా సిద్ధం చేసుకుంటూ.

అశ్వికుడి ఎదురుగా అనంతంగా పరుచుకొని అరణ్యం.. మానవారణ్యం.. నగరారణ్యం.. పచ్చదనం ఆవిరౌతూ .. నదికళ్ల నీళ్లు అడుగంటుతూ ..

ఈ అశ్వికుడు 'నిజం' కలం పేరు కలిగిన శ్రీరామమూర్తి, మొదలు (నిజం గీతాలు 1972 ), ఎర్ర మందారాలు (1974), నివురు ( 2018 ), నాలుగో పాదం ( 2020), అలలు (2020) అంటూ కొన్ని అక్షరాల పొత్తాలతో సమాజంతో యుద్ధమూ, సామరస్యమూ ఏకకాలంలో చేశాడు. ఇంకా అలుపెరగక చేస్తున్నాడు. అశ్వికుడు కత్తిపట్టిన చేతికి ఇంకా చేతి నిండా పని వుంది. తూరుపు ఎదురుచూస్తూ వుంది. ఈ అశ్వికుడు సమాజాన్ని పహరా కాయాల్సిన అవసరం మునుముందు చాలా వుంది. **ప్రతులకు : 98483 51806** ■



# కవులు సమస్యల మూలాల్లోకి చొచ్చుకెళ్లి రాయాలి!

**- ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్ కుమార్**

**"తెలుగు వెలుగులను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశం మొత్తంకూడా నింపాలనే దీక్షతోనే ఇక్కడ నేను, నా బృందం కృతనిశ్చయులమై ఉ అన్నారు ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రం సంచాలకులు, విశ్రాంత ఆచార్యులు మాడభూషి సంపత్‌కుమార్. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరఫున ఆయనతో ముచ్చటించారు. ఆ ముఖా-ముఖి ఇదీ...**

**మొదటగా మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి ...**

నేను చిత్తూరుకు 25 కిలోమీటర్లు, తిరుపతికి 50 కిలోమీటర్లు దూరంలో ఉన్న శ్రీరంగరాజపురం మండలంలో దేవళంపేట దగ్గర కమ్మపల్లె అనే ప్రాంతంలో 17-9-1959లో ఒక పేద కుటుంబంలో జన్మించాను. మా నాన్న శ్రీనివాసాచార్యులు, అమ్మ పట్టమ్మ. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం మాది. ప్రాథమిక విద్యాభ్యాసం కోసం ఒక పల్లె దాటి వెళ్ళేవాడిని. హైస్కూలు కూడా పక్కనే ఉన్న కొత్తమిట్ట పల్లెలో చదివాను. చిన్నప్పటినుండి ప్రాచీన సాహిత్యం అంటే బాగా ఇష్టం. శ్రీశ్రీ మహాప్రస్థానం హైస్కూల్లోనే కంఠతా పట్టి వాళ్ళకు చెప్పడం చూసిన తోటి విద్యార్థులంతా ఆశ్చర్యపడేవారు. ఇంటర్మీడియేట్ చిత్తూరులో చదివాను. పి.వి.కె.ఎన్ కళాశాలలో బి.కాం చదివాను. ఆ తరువాత మదరాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ., ఎం.ఫిల్ చేశాను. ఆ తరువాత మదురై కామరాజు విశ్వవిద్యాలయంలో 1987లో చేరి 'ఎరుకల భాషకు వర్ణాత్మక వ్యాకరణం' అనే అంశంపై 1990లో పిహెచ్.డి పట్టా పొందాను. మదరాసు విశ్వవిద్యాలయంలోనే డి.లిట్ కూడా పొందాను.

**మీకు తెలుగుపై అభిమానం కలగడానికి కారణం?**

నాకు చిన్నప్పటించీ తెలుగుభాషమీద అభిమానం ఉంది. మా వూర్లో ఏడాదికొకసారి భారతం మీద నాటకాలు వేసేవారు, హరికథలు చెప్తూ ఉండేవారు. నాకు ఇవన్నీ చాలా ఆసక్తిగా ఉండేది. చిన్నప్పుడు గ్రంథాలయంలో బాలల రామాయణం, భారతం మొదలైనవన్నీ చదివేవాడిని. వార్తాపత్రికలకు ఫ్రీలాన్సర్‌గా పనిచేసేవాడిని. మా తల్లి గారు మొక్షగుండ రామాయణం పారాయణం చేస్తూ ఊరిలోని వారికి చెప్తూఉండేది. ఇవన్నీ మనసుకు బాగా పట్టుకున్నాయి. హైస్కూల్లో ఉపాధ్యాయులు తరగతిలో పద్యాలు చెప్పినప్పుడు నాకున్న ఆసక్తి వల్ల ఒకసారి వినగానే కంఠస్తం వచ్చేసేది. చదివింది కామర్సు అయినా, గురజాడ, శ్రీశ్రీ ఎక్కువగా ప్రభావం చూపడం వల్ల, నా మనసులో కవిత్వం కూడా సమాంతరంగా ప్రవహిస్తూ ఉండేది. అందువల్లనే మదరాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగులో చేరాను.

**ఆచార్య జి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తిగారితో మీ అనుబంధం గురించి క్లుప్తంగా చెప్పండి.**

నేను ఎం.ఎ చదవడానికి వెళ్ళినప్పుడు 1983 ఆగస్టులో వారిని మొదటిసారి కలిశాను. ఎంతో ప్రేమగా సన్నిహితంగా, స్నేహపూర్వకంగా మాట్లాడేవారు. సందేహాలను తీర్చేవారు. ఆ తర్వాత అక్కడే ఎం.ఫిల్ 'ఎరుకల తమిళ భాషల్లో -బంధువాచక పదాలు- సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం' అనే అంశం మీద పరిశోధన చేశాను. పిహెచ్.డి అక్కడే చేయాలని ఉన్నా మదురై కామరాజు విశ్వవిద్యాలయంలో ఉపకార వేతనం వస్తుందన్న ఉద్దేశంతో అక్కడికి మారాను. 1990లో మళ్ళీ నాకు మౌఖిక పరీక్ష నిర్వహించడానికి కృష్ణమూర్తి గారే వచ్చారు. ఆయన నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన గురువు. ఆ అనుబంధం ఆయన మరణం వరకూ సాగింది.

**తెలుగులో డాక్టరేట్ చేసిన మీరు పత్రికారంగంలో ప్రవేశించడానికి కారణం?**

నాకు పత్రికా వ్యాసంగం మొదటినుంచీ ఉండేది. బూదరాజు రాధాకృష్ణగారు ఈనాడు పత్రిక వారికి పనిచేస్తున్నప్పుడు, నేను పిహెచ్.డి ముగింపుదశలో ఉండగానే వారునన్ను ఈనాడులోకి ఆహ్వానించారు. అలా ప్రారంభమై ఈనాడే కాకుండా, ఉదయం,

వార్త, మహానగర్, మాభూమి, విజేత వంటి పత్రికల్లో పనిచేశాను. కవితలు, అనేక వ్యాసాలు రాశాను.

**మదరాసు విశ్వవిద్యాలయంలో ప్రవేశం ఎలాజరిగింది?**

ఆ సమయంలో ఆచార్యజి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి గారు అక్కడ తెలుగు విభానికి అధిపతిగా ఉన్నారు. నేను హైదరాబాదులో ఉండేవాణ్ణి. ఆయనే అప్లికేషన్ నాచేత రాయించి, విశ్వవిద్యాలయం లో ఇచ్చారు. అయితే నాకు ఉద్యోగం ఇస్తానని ఆయన చెప్పలేదు. ఇమ్మనీ నేను అడగలేదు. తరువాత ఇంటర్వ్యూలో ఎంపికయ్యాను. ఆయన చెప్పిన విధంగా నడవడం వల్ల కెరీర్ పరంగానే కాక, విద్యార్థులతో మెలిగే విధానం వీటివల్ల ఒక మంచి వ్యక్తిత్వం కూడా నాకు ఆయన బోధనల వల్లనే కలిగింది.

**మదరాసు విశ్వవిద్యాలయంలో మెరీనా క్యాంపసుకు ఒక తెలుగు ప్రొఫెసర్ డైరక్టరుగా వరుసగా మూడుసార్లు ఎంపికవడం వెనుక మీ కృషి, ఆవిశేషాలు క్లుప్తంగాచెప్తారా?**

అనేక భాషలున్న ఆ క్యాంపసుకు డైరక్టరుగా ఎంపికవడం ఒకమంచి అవకాశం. మదరాసు విశ్వవిద్యాలయ ఆచార్యుల ఫోరం౹ నేను సుమారు దశాబ్దంపాటు అధ్యక్షుడిగా పనిచేశాను. ఆ క్యాంపసుకు అంతవరకూ తెలుగు ఆచార్యుడు డైరక్టరయింది లేదు. నేనే ప్రథమం. నేను పనిచేస్తున్నకాలంలో అందరూ సంతోషంగా ఉండేవారు. ఎవరికి వీసమెత్తు ఇబ్బంది కూడా కలిగించలేదు. అదొక బాధ్యతగా భావించి పనిచేశాను. అందరి ఏకగ్రీవ ప్రతిపాదనతో పదవీ విరమణ వరకూ ఆ క్యాంపసుకు నేనే డైరక్టరుగా ఉన్నాను.

**మీరు బ్యాంకాక్ అంతర్జాతీయ సదస్సులో 'తెలుగు ఉత్తమ లిపి' అనే ఖ్యాతిని తీసుకువచ్చారు. ఆ వివరాలు చెప్తారా?**

తెలుగు సహజంగానే ఉత్తమ లిపి. నేను చెప్పినందువల్ల కాలేదు. కాకపోతే అన్ని భాషలవాళ్ళు ఆవిషయాన్ని గుర్తించే విధంగా మాత్రమే నేను కృషిచేశాను, అంతే! అక్కడ అన్ని భాషల పండితులు వచ్చి వాళ్ళవాళ్ళ లిపుల ఆవిర్భావం, గొప్పదనం గురించి చెప్పారు. నేను తెలుగు భాష గురించి చెప్పినప్పుడు మిగతా ఏ భాషకు లేని సౌకర్యం, ప్రాశస్త్యం మన భాషకు ఎలా ఉందో వివరించాను. ఆ రచనా సౌలభ్యం దేవనాగర లిపికి గానీ ఆంగ్లానికి గానీ లేదు. వాళ్ళతో జరిగిన చర్చ, వాదనల్లో ఆంగ్లం బాగా వెనుకబడ్డ లిపి అని నిరూపించాను. ఆంగ్ల పండితులు ఎక్కువసంఖ్యలో పాల్గొని బాగా వాదన చేసిన సమయంలో, నేను ఆంగ్లలిపిలో ఉన్న లోపాలన్నీ వరుసగా ఎత్తి చూపాను. ఆంగ్లలిపిలో ఇన్ని లోపాలున్న విషయం వాళ్ళకే తెలియకపోవడం వల్ల దిగ్భ్రాంతికి గురయ్యారు. తరువాత వారే హర్షామోదం వెలిబుచ్చి, అంగీకరించారు. బలవంతంగా ఒక దేశభాషను ఇంకోదేశం మీద రుద్దినంత మాత్రాన అది గొప్పభాష అవదు. లిపిలోను, మాట్లాడడంలోను, వ్యక్తీకరణలో సర్వ సౌలభ్యత ఉండడం భాషకు అత్యంత ముఖ్యమని ససాక్ష్యాలతో వాదించి నిరూపించాను. తెలుగుభాష అన్నిభాషల కన్నా సహజంగానే ఉత్తమలిపి అని విశ్వవ్యాప్తంగా మనం గర్వంగా చెప్పుకోవచ్చు.

**మీ రచనల గురించి చెప్తారా?**

ఎక్కువగా వచన కవిత్వమే రాశాను. జీవితం– కవిత్వం, శత్రువుతో ప్రయాణం, ఆలోచనలు, చివరకు నువ్వే గెలుస్తావు, మూడో మనిషి, వికారి, మొదటి అబద్ధం వంటి వచనకవిత సంపుటాలు వెలువరించాను. ఐదారు పుస్తకాలు అనువాదాలు చేశాను. వ్యాసాలు, విమర్శనాత్మక సమీక్షలు చాలా రాశాను.

**'జీవితం–కవిత్వం'లోని 'జీవితానికి పోరాటం తప్పదు. జీవితమొక ఆకాశం/ కవిత్వమొక సముద్రం. అందుకోనూ లేం/ ఈదనూ లేం' అన్న మాటల వెనుక మీ జీవిత పోరాటం ఉందా?**

ఈ మాటలు ఎవరి జీవితానికైనా వర్తిస్తాయి. జీవితంలో సాధించాలి అనే లక్ష్యం ఉన్న వ్యక్తులకు జీవితం పోరాటమే కదా! జీవితం ఆకాశం లాంటిది అంటే ఎవ్వరూ ఆకాశాన్ని అందుకోలేరు. అలాగే అది సముద్రం వంటిది. దాన్ని ఈదడం కూడా సులభసాధ్యం కాదు. జీవితంలో ఎంత సాధించినా ఇంకా ఎంతో మిగిలే ఉంటుంది. ఎవరైనా నా జీవితం పరిపూర్ణం అన్నారంటే వాళ్ళు ఎక్కడో ఒక బిందువు వద్ద సంతృప్తి చెందారని అనుకోవాలి. అలా జీవితాన్ని కవిత్వాన్ని భిన్న కోణాల్లో చూపాను.

**స్త్రీవాదాన్ని మీ కవిత్వంలో బాగా సమర్థించినట్టున్నారు?**

నిజమే! పురుషులు ఎన్నివిధాలుగా చెప్పుకున్నప్పటికి, పిల్లలకు జన్మనివ్వడం అనేది స్త్రీలు మాత్రమే చేయగలిగిన పని. అందువల్ల అంత గొప్పదనం ఉన్న స్త్రీలను అణగదొక్కడం అనేది సమర్థించ దగిన విషయం కాదు. స్త్రీకి సహజంగా ప్రకృతిపరంగా ఉన్న కొన్ని బలహీనతలను ఆధారం చేసుకుని అణగదొక్కితే ప్రకృతి ఎప్పుడైనా తిరగబడవచ్చు. వృక్షాలను అదే పనిగా నరికివేస్తుంటే ఒకరోజు మన వినాశనానికి దారితీసినట్లే, స్త్రీలను కూడా అణగదొక్కాలని యత్నిస్తే మానవజాతి వినాశనానికి దారితీసే పరిస్థితి రావచ్చు. కాబట్టి కవిత్వం కూడా స్త్రీ–పురుష అసమానత్వాలను తొలగించే విధంగా ఉండాలన్నదే నా ఉద్దేశం.

**శత్రువుతో ప్రయాణం కవితాసంపుటిలో 'దళితవాద కవిత్వం' కూడా ఉంది. మీ దళితస్పృహకు కారణం?**

చెప్పాలంటే నాకు పెద్దయ్యే వరకూ ఈ దళితులు, అంటరానితనం గురించి ఏమీ తెలియదు. నా చిన్నతనంలో విద్యార్థులమంతా కలిసిమెలిసి తిరిగేవాళ్ళం. ఒకరి పల్లెకు మరొక పల్లెవాళ్ళు రావడం, వరసలు పెట్టి పిల్చుకోవడం ఉండేది. వాళ్ళు దళితులు అనే స్పృహ నాకు ఏమాత్రం లేదు. అంటరానితనం ఉన్నదనే విషయం కూడా తెలియకుండా ఆ పల్లెల్లో పెరిగినవాణ్ణి. పాఠశాలలో నాకు అటూ ఇటూ బల్లపై కూర్చున్న వాళ్ళు దళిత విద్యార్థులన్న స్పృహ నాకు ఏమాత్రం లేదు. వాళ్ళతో కలిసి ఆడుకుంటూ పెరిగినవాణ్ణి. మేము మా పాఠశాలకు వారి పల్లెదారి గుండానే వెళ్ళేవాళ్ళం. నేను నా జీవితంలో ఎప్పుడూ అంటరాని తనాన్ని పాటించింది లేదు. ప్రపంచంలో ఉన్న ఈ దుర్మార్గాలను చూసి నా కవిత్వంలో ఎండగట్టడానికి ప్రయత్నిం

చాను.

**కవిత్వం ఎలా ఉండాలంటారు?**

కవిత్వాన్ని నిర్వచించడం లేకపోతే ఎలా ఉండాలో చెప్పడమన్నది అంత సామాన్య విషయం కాదు. ఎందరో గొప్ప గొప్ప వారు ఎన్నో రకాలుగా దాన్ని నిర్వచించారు. ఏదీ సంపూర్ణం కాదు. కవిత్వం ఇలాఉండాలి అని గీత గీయలేము. ఎలాగైనా ఉండొచ్చు. కాని, అదిఅవతలివారి మనసును స్పందింపజేయ గలగాలి. మనసుపొరల్లోకి చొచ్చుకొని వెళ్ళగలిగేదిగా ఉండాలి. ఒక మనిషిని కదిలించాలి. చైతన్యవంతం చేయగలగాలి. చదివిన క్షణాల్లోనైనా మనహృదయం స్పందించాలి. రూపం లేదా ప్రక్రియ ఏదైనప్పటికి, స్పందింపజేయ గలిగితేనే అదికవిత్వంఅవుతుంది.

**సామాజిక, రాజకీయరంగాలలో సరైన ఉద్యమాలు లేని లోటు సాహిత్యపరమైన స్తబ్దత ఆవరించడానికి కారణమౌతోంది అన్న అభిప్రాయంతో ఏకీభవిస్తారా?**

ఉద్యమాలు సాధారణంగా ఒక సమస్య కారణంగా ఉద్భవిస్తాయి. ఇప్పుడు స్వాతంత్రోద్యమం తీసుకుంటే స్వాతంత్ర్యం వచ్చేంత వరకూ సాగింది. ఉద్యమాలు ఆయా కాలాల్లో ఆయా అవసరాలకు అనుగుణంగా పుడుతూ ఉంటాయి. అక్కర తీరాక ఆ ప్రవాహ ఉధృతి అంతగా ఉండదు. అయితే సర్వకాలాల్లోనూ ప్రపంచాన్ని కొన్ని సమస్యలు పట్టిపీడిస్తూ ఉంటాయి. ఉదాహరణకు అవినీతి సమస్య ఉంటూనే ఉంటుంది. దానిమీద కవులు, రచయితలు కవిత్వంలో, కథల్లో, నవలల్లో ప్రతిఘటిస్తూనే ఉంటారు. ఉద్యమం లేనంత మాత్రాన అవినీతి అనేది కవిత్వ వస్తువు కాకుండాపోదు. ఉద్యమం అంటూ ప్రత్యేకంగా ఉండాల్సిన అవసరంలేనివి ఎన్నో ఉంటాయి. అలాగే మానవత్వం అనే కవితావస్తువు మీద కూడా కవులు కొన్ని వందల సంవత్సరాలుగా రాస్తున్నారు. అన్యాయం, అక్రమాలపై తిరబడ్డం అనే కవితా వస్తువులు నిత్యనూతనం. అలాంటి సార్వజనీనమైన కవితా వస్తువులకు ఉద్యమాలంటూ ప్రత్యేకంగా అవసరంలేదు. అలాగే రైతుజీవితాన్ని గమనించినట్లైతే విధానాల్లో ఎంతో మార్పువచ్చింది, రైతు ఉపయోగించే పరికారాల్లో మార్పు వచ్చింది కాని రైతు జీవితంలో మార్పురాలేదు. స్త్రీల జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి అయిన ఇంకా స్త్రీల సమస్యలు తీరలేదు. ఇలాంటి వాటికి ఉద్యమాలంటూ ప్రత్యేకంగా రావలసిన పని లేదు. కవులు వీటిని గురించి రాస్తూనే ఉండాలి.

**ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రానికి డైరక్టరుగా ఎంపిక కావడం మీకు ఎలాంటి అనుభూతి నిచ్చింది?**

ఈ డైరక్టరు పదవి ద్వారా తెలుగుభాషకు సేవ చేసుకునే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉంది. ఈపదవి నేను ఒకఉద్యోగంగా భావించకుండా ఈ అవకాశం ద్వారా తెలుగుకు నేను ఏఏ విధంగా ఎక్కువగా సేవచేయలగలను అనే ఆలోచనతో ఈ పదవి చేపట్టాను. నేను మదరాసు విశ్వవిద్యాలయ ఆచార్యునిగా, కొన్ని భాషలున్న విశ్వవిద్యాలయ శాఖకు డైరక్టరుగా ఒక బాధ్యతాయుతమైన పనిని సంతృప్తికరంగా నిర్వర్తించాను. తర్వాతి కాలంలో సాహిత్యానికి సంబంధించిన కొన్ని కార్యక్రమాలు నిర్వహించాను. మరలా ఈ అవకాశం లభించింది.

**ఇక ముందు ఆ కేంద్రం ఎలా రూపు దిద్దుకోబోతున్నది?**

ప్లాన్ అయితే ఉంది. ఇంకా యాక్షన్ జరగలేదు. ముఖ్యంగా ఈ ప్రాచీన తెలుగు విశిష్టకేంద్రానికి ప్రత్యేకమైన ప్రతిపత్తిని తీసుకుని రావలసిఉంది. ప్రత్యేక భవన నిర్మాణం జరగాలి. భవనానికి భూమి కేటాయింపు జరిగినప్పటికి ఏవో కొన్ని వ్యాజ్యాల కారణంగా ఆగింది. ఆ భవన నిర్మాణం అనంతరమే ప్రత్యేక ప్రతిపత్తి సాధించగలము. తెలుగువెలుగులను ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశం మొత్తంకూడా నింపాలనే దీక్షతోనే ఇక్కడ నేను, నా బృందం కృతనిశ్చయులమై ఉన్నాం. ఇక్కడ చేయడానికి చాలా పనులున్నాయి.

**తెలుగు భాషాభివృద్ధికి ఏంచేయాలంటారు?**

తల్లిదండ్రులు తమ పిల్లల్ని తెలుగులో చదివించాలి. ఇంగ్లీష్ భ్రమ నుంచి బయటపడాలి. తెలుగు మాధ్యమంలో చదివితే ఉద్యోగాలు రావు, అమెరికాకు పోవడానికి వీలు కాదు అన్న అపోహలు తొలగించాలి. అమెరికాకు పంపడానికే పిల్లల్ని కనే తల్లిదండ్రులు మారాలి. ఇప్పటికే ఒక తరం పిల్లలు సాధారణంగా ఉపయోగించాల్సిన తెలుగు మాటలు మరిచిపోయారు. ఇది ఇలాగే కొనసాగితే తెలుగంటే ఏమిటి అనే పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం తెలుగుకు ప్రాముఖ్యం ఇచ్చి మన సంస్కృతిని కాపాడాలి. తెలుగులో చదివిన వాళ్ళకు ఉద్యోగాల్లో మొదట అవకాశం కల్పించాలి. పార్టీలు తమ ప్రణాళికల్లో తెలుగు భాషకు సంబంధించిన వైఖరిని స్పష్టం చేయాలి. ప్రజలు తెలుగు భాషకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకే వోటు వేయాలి. మేధావులు పార్టీల దాణాలకు, పురస్కారాలకోసం వక్ర భాష్యాలు చెప్పకుండా ప్రజలకు మేలు కలిగించే విధంగా సలహాలు ఇవ్వాలి. తెలుగును అన్నీ రంగాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలి.

**చివరిగా వర్ధమాన తెలుగుకవులకు మీసందేశం?**

ఇంతకుముందు చెప్పుకున్నట్టు, కవులు కవిత్వం పాఠకుల హృదయాలను స్పందించే విధంగా వ్రాయాల్సి ఉంది. మనకున్న అనేక సమస్యలపై స్పందించాలి. కొత్త అలంకారాలు, కొత్త వస్తువులు, కొత్త అభివ్యక్తులు రావాలి. కవులు సమస్యల మూలాల్లోకి చొచ్చుకునివెళ్ళి వాటిపై సాధన దిశగా కృషిచేయాలి.

■


## సాహిత్య ప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**



## అచ్చం వాడిలా ..

మబ్బు పడితే చాలు
ఉరుము వింటే చాలు

లోపల
గొలుసుతో కట్టేసిన కుక్కపిల్లలా
కుండీలో మొక్క మెలికలు తిరుగుతూ,
గాలిలో, వానలో తడవాలని మారం చేస్తూ...

బయట
బోలెడు సంతోషాన్ని
ఒంటికి పులుముకున్న
ఆరుబైట చెట్లను పెనేసుకునాలని
కలవరించడం చూస్తుంటే...

అచ్చంగా
హాస్టల్లో చదివే ఐదేళ్ల కొడుకు
ఆదివారం వీడియో కాల్లో
వాళ్ళమ్మను వాటేసుకునే
ఏడుపు గుర్తుకు వస్తోంది!

- చందలూరి నారాయణరావు
97044 37247

## అదే పనిగా ...

సందెవేళ సున్నిపిండి ముద్దై
అలల బాలలకు నలుగెడుతున్న
పున్నమి చంద్రుడు
నిదుర రాతిరిలో వెన్నెల పూలద్దిన
వెలుగు దుప్పటిని కప్పిపోతాడు
చేజారిపోయిన చీకటి
కొత్త ఆశలను వెలిగిస్తూ
మరో వేకువను
అదే పనిగా ఒడిసి పడుతోంది!


పచ్చని నదిలా ప్రవహించే అడవి
రంగుపూల పడవలను ప్రసవిస్తోంది
కొమ్మ పెదవులకు వసంతం పూయించిన
నవ్వు పూలను
వేటకొడవళ్ళ శిశిరం
తుంచుకుపోతోంది!
దాహం తీరని దావానలమై
అడవి జాడను ఎండగడుతోంది
ఎండుటాకుల గోలకు ఉలిక్కి పడ్డ గ్రీష్మం
పచ్చని ప్రవాహాల అలికిడికై
అదే పనిగా వేచిచూస్తోంది ...!

గుత్తులుగా పూచిన రేలపూల పుప్పొడి
వనమంతా పసుపు పూసి
ఇసుకతిన్నెలపై ఆరేసిన
రెల్లుపూల వెండిజరీ చీర
ప్రకృతికి చుట్టేలోపు
జోరువానకు తడిచి ముద్దయిపోతోంది
కాలుజారిన చినుకు ఆత్రం



నేల బతుకును
మరోమారు
చిత్తడి చేస్తూ
జీవపు ఆనవాళ్లను
అదే పనిగా
'కని'పెడుతోంది!

- మిరప మహేష్
99480 39026






# అక్షరాల సాక్షిగా తరగతి గది ఆవిష్కారం

- పిల్లా తిరుపతిరావు
70951 84846

**బా**ల సుధాకరమౌళి .. ఒక సామాజిక ఉపాధ్యాయుడు. నేడు సమాజంలో ఉపాధ్యాయులు అనేక రకాలుగా కనబడతారు. ఒక చట్రంలో బిగించబడి పాఠశాల విధులకు పరిమితమయ్యే వారు కొందరైతే, ప్రాపంచిక దృక్పథంతో బోధనను బాధ్యతగా భావించేవారు మరికొందరు. మౌళి రెండో కోవకు చెందుతారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడంతోనే సరిపెట్టుకోరు. బోధనకు ఆవల ఉన్న సామాజిక బాధ్యతను గుర్తెరిగినవారు. ఆ బాధ్యతను పిల్లలు ఎత్తుకునేలా చేస్తారు. ఉపాధ్యాయునికి పుస్తక పఠనం అనివార్యమని నమ్మే వ్యక్తి. చారిత్రక అంశాలతో పాటు వర్తమాన విషయాలను ఆకళింపు చేసుకునేలా ప్రతి ఉపాధ్యాయుడూ ఉండాలి. అందుకే ఉపాధ్యాయుణ్ణి నిత్య విద్యార్థి అంటారు. గురువు కేవలం పుస్తకాల్లో ఉండే అంశాలనే విద్యార్థులకు బోధిస్తే సరిపోదు. రాజకీయ సామాజిక నేపథ్యాలు, ఆ నేపథ్యాల మాటున నలిగిపోతున్న జనం, వారి అవసరాలు, ఆకాంక్షలు బోధించే ఉపాధ్యాయుడే భావి పౌరులపై గాఢంగా ముద్ర వేయగలడు. విద్యార్థులలో మానవీయ కోణాలను ప్రోదిచేస్తూ, సామాజిక స్పృహను కలిగించేలా మౌళి బోధన చేస్తారు. మౌళికి ఈ బోధనలో అతడి నిరంతర సమగ్ర అధ్యయనం తోడయ్యింది. ఆ భావనలు, అధ్యయనాలలోంచి అతని కవిత్వం పుడుతున్నది. ఆ కవిత్వానికి ఒక నిర్దిష్టమైన దృష్టికోణం ఉంది. ఆ కోణంలోంచి మౌళి విభిన్నమైన సామాజిక, రాజకీయ కవిత్వ సృజన చేస్తున్నారు.

'జాతి నిర్మాణం తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది'... అన్న డి.ఎస్.కొఠారి మాటలను మౌళి గుర్తెరిగినవారు కాబట్టే తన 'తరగతి గది స్వప్నం' దీర్ఘ కవితలో 'ఈ దేశ తరగతి గదులన్నీ ఫలవర్ధకమైనప్పుడే ఈ కవితకు సజీవిత' అన్నారు. 'నా చుట్టూ అలుముకున్న రాజకీయ సామాజిక ఆవరణం ఈ కవిత పుట్టుకకు ప్రేరణ. నా కార్యస్థానం ఈ కవితకు కేంద్రస్థానం' అని ఉద్ఘాటిస్తారు. ఇంకా 'ఈ భూమ్మీద గొప్ప ప్రదేశాలుగా విద్యార్థులకు నేను తరచూ చెప్పేవి రెండు. ప్రజలు ఆకలిని తీర్చి శక్తిని కూర్చే పంటభూమి ఒకటైతే, నూతన తరాన్ని తయారు చేసే తరగతి గది రెండోది' అని నమ్ముతారు.

ఒకే వస్తువుతో నడిచేది దీర్ఘ కవిత. ఆ వస్తువు యొక్క ఇమేజస్ను కవి అర్థవంతంగా చూపాలి. ఈ కవితలో తరగతి గది వాతావరణమే పూర్తిగా ప్రతిబింబిస్తుంది. ఈ ప్రయత్నంలో మౌళి శతశాతం కృతకృత్యులయ్యారు. మౌళి తరగతిగది ఔన్నత్యాన్ని ఇలా నిర్వచిస్తాడు : 'అతనికి తరగతి గది భూమి అడవి సముద్రం/ తరగతి గది రాబోవు చరిత్రకు ఇప్పటి బీజాక్షరం/ తరగతి గది మానవ మహా చైతన్య శిఖరం/ అతనికి తరగతి గది/ ఆదిమ చూపుని జ్వలింపజేసిన/ తొలి కార్యక్షేత్రం' తరగతి గదిలో తెలియనిది, నేర్చుకోలేనిది ఉండదు. ఆట, పాట, మాట అన్నింటిలో ప్రావీణ్యత నేర్పేది. సమాజ స్థితిగతులను అర్థవంతంగా బోధించేది. విద్యార్థి నిరంతర జ్ఞాన దాహార్తిని తీర్చేది. ఇలా చెప్పుకుంటే పోతే సకల దఅశ్యాలను తరగతిగదే ఆవిష్కరింపజేస్తుంది. అందుకే తరగతిని మౌళి ఉదాత్తమైన కార్యక్షేత్రంగా ఎంచుకున్నాడు.

'అక్షరం శిశువు/ కాళ్లూ చేతులూ ఆడిస్తూ/ కొత్తగా లోకానికి పరిచయమౌతుంది/ అక్షరాన్ని తరగతి గది అమ్మై సాకుతుంది/ నాన్నై నడక నేర్పిస్తుంది/ అక్షరం బుడిబుడి అడుగులు వేస్తూ/ ఆనందంతో తుళ్ళిపడుతుంది/ తరగతి గది/ నడుస్తున్న తరాన్ని పొత్తిళ్లలో పెట్టుకుని/ అదృశ్య నేత్రాలతో కాపాడే/ మాతృమూర్తి' భావితరాన్ని తన పొత్తిళ్లలో పెట్టుకొని రక్షించే కన్నతల్లిగా కవి తరగతిని వర్ణిస్తాడు. మనిషి జీవన గమనంలో తరగతికే మొదటి ప్రాధాన్యత ఇస్తాడు.

అక్షరాన్ని గూర్చి ప్రాణప్రదమైనదిగా కవి చెబుతాడు. 'అక్షరం ప్రాణమున్న సజల నేత్రం/ రెండు గాలితిత్తుల జీవన సౌరభం/ అక్షరం ఎన్నిసార్లు గాయపడుతుందో/ అన్నిసార్లూ గాయానికి లేపనమౌతుంది/ అక్షరం గాయాల్ని మాన్పే సంజీవిని/ ఓటమిపై రౌద్రంగా పిడికిలిని బిగించే/ ధిక్కార కేతనం' అక్షరానికి ఉన్న

ధైర్యసాహసాలు, శక్తియుక్తులు మరిదేనికీ లేవంటాడడు.

'కలలు కలలు కలలు/ కలల కెరటాలు/ ఎడారి భూమిలోంచి పచ్చని అరణ్యం/ మొలిచే కలలు/ కటిక చీకటి కారుమబ్బుల్లోంచి/ కదలి హోరు వినిపించే కలలు/ కలలంటే నా తరగతి గది/ హృదయ కవాటాల చప్పుళ్లే/ కలలంటే నా తరగతి గదిలో/ క్షణ క్షణం వినిపించే/ విముక్తి గీతాల ఉప్పెనలే' తరగతిని కలలు కనే ప్రదేశమంటాడు. ఆ కలలు తీరే ప్రపంచమంటాడు. అనేక విముక్తి ఉద్యమాల గీతాలను ఆలపించే ఉద్యమ క్షేత్రంగా నిలబెడ తాడు. ఇది తరగతి గది విశిష్టతకు పరాకాష్ట.

'స్వేచ్ఛగా ఎగరాల్సిన అక్షరం/ సంకెళ్ల బరువుతో తూలి పోతోంది/ అక్షరం/ జైలుశిక్ష అనుభవిస్తుంది/ జైలుశిక్ష కలలు మరణిస్తున్న జైలుశిక్ష/ కాంతి/ నిష్కాంతవుతున్న జైలుశిక్ష/ ఎగిసే నిప్పుల సెగపై/ నీళ్లు చిలకరిస్తున్న జైలుశిక్ష' నేడు అక్షరయోధులు స్వేచ్ఛగా సామాజిక అక్షర విన్యాసం చేయలేకపోతున్నారు. కారణం అరాచక వాదులుగా, అర్బన్ నక్సల్స్‌గా రాజ్యం ముద్రవేస్తున్నది. అక్షరం చైతన్య దీప్తులను వెలిగిస్తుందనే భయంతో పాలకులు ముందే అక్షరానికి జైలుశిక్ష విధిస్తున్నారు.

అక్షరం గూర్చి ఇలా అంటాడు: 'అక్షరం చూపు కోల్పోతుంది/ అక్షరం నడక మారిపోతుంది/కదం తొక్కాల్సిన సమయంలో/కరిగి నీరైపోతుంది/ తలని కిందకి వాల్చి/ మోకాలిపై కూలి పోతుంది/ తరగతి గది మౌనంలోకి/ కూలిపోతుంది'. ఒక్కోసారి అక్షరం తన ఉనికిని కోల్పోయి, తన బాధ్యతను వదిలి పక్కదారుల్ని వెతుకుతోంది. ప్రలోభాలకు లోనవుతుంది. దాని పర్యవసానం 'రెక్కల చప్పుడు లేని ఒక తరం/ గురిలేని తరం పాడలేని తరం/ ఊహలేని తరం' తయారవుతోందని కవి విలపిస్తున్నాడు.

తరగతి గదుల్లో నడయాడే పిల్లల భౌతిక రూపాలను కవిలా బొమ్మకడతాడు... : 'పిల్లలు పిల్లలు పేదపిల్లలు/ పూలులాంటి పిల్లలు/ పూరిగుడిసెల పిల్లలు/ ఉల్లికాడల కాళ్లతో/ పగుళ్లుదేరిన మడమలతో/ జీవన విషాదంలోంచి/ బడికి వస్తున్న పిల్లలు/ నోటి నిండా అన్నం ముద్ద/ ఎరగని పిల్లలు/ కళ్లనిండా నిద్రపోని పిల్లలు/ వెలివేయబడిన పిల్లలు/ చెప్పుల్లేని చిట్టిపొట్టి పిల్లలు/ చెమట కారుతున్న పిల్లలు/ తట్ట నెత్తిన పెట్టుకుని పేడకళ్లు తీసే పిల్లలు/ కల్లం చుట్టూ తిరిగి తిరిగి/ కసవ పూడ్చే పిల్లలు/ పెండుల్లో పడి గొడ్లు కాసే పిల్లలు' ప్రభుత్వ బడుల్లో బీదవర్గాల పిల్లలే కనబడతారు. వారికి సరైన పోషకాహారం దొరకదు. బక్కచచ్చిన ఆకారాలతో దర్శనమిస్తారు. తరచూ బడికి గైర్హాజరవుతూ ఉంటారు. వాళ్లంతా బాల కార్మికులే. వారు అనివార్యంగా తల్లిదండ్రులకు సాయమందించాలి. శ్రీశ్రీ శైశవగీతిలో పిల్లలను వర్ణించే తీరుకు భిన్నంగా మౌళి ఇక్కడ రూపుకట్టారు. 'మబ్బుల్లోంచి రాలే చినుకులు పిల్లలు/ ఆకుల్లోంచి వీచే చిన్నారి గాలులు పిల్లలు/ మట్టిలోంచి మొలిచే లేలేత మొలకలు పిల్లలు' ఇలా మౌళి పిల్లలను కొత్తగా దర్శించారు.


'కాలం తరగతి గదుల్లో కరిగిపోతుంది/ పాఠాలు పాఠాలు పూర్తి ఐపోతున్నాయి/ పిల్లలు రాత్రి పగలూ యంత్రాల్లా/ పనిచేస్తున్నారు/ సృజన లేని పిల్లలు/ ఊహలేని పిల్లలు/ గాల్లో ఈలలు వేయలేని పిల్లలు/ మట్టితో బొమ్మలు చేయలేని పిల్లలు/ మబ్బుల్లో ఏనుగులను చూడలేని పిల్లలు/ ఏనుగులెక్కి వూరేగలేని పిల్లలు/ కాగితాలతో పడవలు చేయలేని పిల్లలు/ ఇసుకలో గూళు కట్టలేని పిల్లలు/ పక్షుల్లా ఎగరలేని పిల్లలు/ చేపల్లా ఈదలేని పిల్లలు/ కీలుబొమ్మలు పిల్లలు/ మరబొమ్మలు పిల్లలు/ చదువుల జైళ్లలో బాల్యం బందీ అవుతున్న/ పిల్లలు'

... ఇలా పిల్లల దయనీయ స్థితి గోచరిస్తుంది.

గతకాలపు పిల్లలు అనేక విషయాల్లో ప్రావీణ్యత కలిగి ఉండేవారు... అప్పటి విద్యా విధానం ఒత్తిడి లేనిది కాబట్టి. బోధనలో ఉపాధ్యాయుడికి స్వేచ్ఛ ఉండాలి. విద్యార్థి అభ్యసనంలో స్వేచ్ఛ ఉండాలి. సృజనాత్మకత తరం తయారీకి ఇవే మూలాలు. నేటి కసాయి పాలకులు విద్యను కాషాయీకరణ చేస్తున్నారు. తమకు నచ్చని సిలబస్‌ను తొలగిస్తున్నారు. ఈ విధానాల వల్ల తరం నిర్వీర్యమౌతున్నది. జాతి అడుగంటిపోతున్నది. ప్రశ్నించేతత్వాన్ని కోల్పోతున్నది. పాలకుల మాయలో పడే తరం తయారవుతున్నది. ఇది ఇలాగే సాగితే భావితరం సొట్టలు పోక తప్పదు.

'పరీక్ష గదులు శవాలను కుప్పపోసిన/ మార్చురీలు/ పరీక్ష గదులు మృత్యువాసనతో/ వర్ధిల్లుతాయి/ వరసలు వరసలుగా అంగడిసరుకుల్లా/ పిల్లలు/ పిల్లలు కలలూ అమ్మకానికి తూగే/ సరుకుల్లా/ బాల్యం చితికిపోతున్న పిల్లలు/ బాల్యంలోనే వృద్ధులౌతున్న పిల్లలు' .. ఇలా హేతుబద్ధతలేని మూల్యాంకనాన్ని కవి తప్పుబడతాడు. తీవ్ర ఒత్తిడి వల్ల పిల్లల్లో మానసిక సమతుల్యత దెబ్బతిని, సహజత్వం నశించిపోయి రోగులౌతున్నారు. బాల్యంలోనే వృద్ధాప్యాన్ని చవిచూస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకర మైన స్థాయి. ఇది మారాలి. మార్పు కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలి. ఇదే కవి లక్ష్యం.

'అతడు విలుకాడు/ నిద్రలోనైనా లేపి గురిచూడమంటే/ అర అంగుళమైనా/ గురి తప్పనివాడు/ వాక్యం విల్లులోంచి అక్షరాన్ని/ బాణంలా వదులుతాడు/ అతడు రాలిన ఆకులతో రగడ పుట్టిస్తాడు/ చెదిరిన మట్టితో గూడు నిర్మిస్తాడు' ఇది ఉపాధ్యాయుడి శక్తి సామర్థ్యాల మీదా, బాధ్యత పైనా కవి చెప్పే మాటలు. అవును కదా.. ఉపాధ్యాయుడే తరగతికి మూలం. తన పిల్లలకు సకల జన జీవితాలను పరిచయం చేస్తాడు. అణగారిన వర్గాల స్థితిగతులను కళ్ళముందుంచుతాడు. పిల్లల కలలను సాకారం చేస్తాడు. అందుకే అతన్ని ఆరితేరిన విలుకాడంటాడు కవి. ఇలా ఈ దీర్ఘ కవితను స్ఫూర్తిదాయకంగా ముగిస్తాడు. ■



# చరిత్ర ఆయుధంగా హిందూత్వ మతోన్మాద ప్రాజెక్టు

- ఆదిత్య ముఖర్జీ, మృదులా ముఖర్జీ

**కో**విడ్-19 మహమ్మారి వ్యాప్తి కారణంగా విద్యా కార్యక్రమాలను కోల్పోయిన పిల్లలపై భారాన్ని తగ్గించడానికే పాఠ్య పుస్తకాల నుండి కొన్ని భాగాలను తొలగించాల్సి వచ్చిందని ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ వివరణ ఇచ్చారు. చరిత్ర, సామాజిక శాస్త్రం, రాజనీతి శాస్త్రాల పాఠ్యపుస్తకాల నుండి తొలగింపులు, ఆ సందర్భంగా పాలక పార్టీ సభ్యుల రాజకీయ ప్రకటనలు, చరిత్ర వక్రీకరణ కోసం హిందూ మతతత్వవాదులు సుదీర్ఘకాలం గా చేస్తున్న ప్రయత్నాల చరిత్రను విశ్లేషిస్తే మనకు అసలు విషయం స్పష్టమౌతుంది. మతపరమైన ప్రాజెక్టుకు మతపరమైన భావజాలం అత్యంత ముఖ్యమని ఆర్‌ఎస్‌ఎస్ చాలా ముందు గానే గుర్తించింది.

మహాత్మా గాంధీ హత్య నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ పై నిషేధం విధించారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ తమ సంస్థ కేవలం ఒక సాంస్కృతిక సంస్థగానే పని చేస్తుందని ప్రమాణం చేసిన తరువాత మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధాన్ని తొలగించారు. తరువాత ఆర్‌ఎస్‌ఎస్ తన భావజాలాన్ని వ్యాప్తి చేసే పనిలో నిమగ్నమైంది. 1950 నుండి ఆర్‌ఎస్‌ఎస్ తమ పాఠశాలలు (మొట్టమొదటి సరస్వతీ శిశుమందిర్‌కు నాటి ఆర్‌ఎస్‌ఎస్ అధినేత ఎం.ఎస్.గోల్వాల్కర్ ప్రారంభోత్సవం చేశాడు), పాఠ్యపుస్తకాల ద్వారా వక్రీకరించబడిన చరిత్రను, పూర్తిగా ఊహాజనితమైన చారిత్రిక దృక్పథాన్ని ప్రచారం చేసేందుకు ప్రయత్నించింది. ఇతర మతాల వారిని ప్రమాదకారులుగా కూడా చిత్రించింది.

చరిత్రను వక్రీకరించడానికి, లౌకిక వైజ్ఞానిక చరిత్రపై దాడి చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ తన రాజ్యాధికారాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేసింది. 1977-79 మధ్య కాలంలో కేంద్రంలో జనతాపార్టీ అధికారం చేపట్టినప్పుడు మొదటిసారి చరిత్రపై పెద్దఎత్తున దాడి జరిగింది. అప్పటికే ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ అనుబంధ సంస్థ జనసంఘ్, జనతా పార్టీలో విలీనమై అధికారంలో భాగస్వామిగా ఉంది. ప్రపంచ ప్రసిద్ధ మేధావులైన రొమిల్లా థాపర్, బిపన్ చంద్ర, సతీష్ చంద్ర, ఆర్.ఎస్.శర్మ, అర్జున్‌దేవ్ లాంటి వారు రచించిన ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాలను నిషేధించాలని చూశారు. కానీ ఈ విషయమై ఎన్‌సిఇఆర్‌టి లోపల, మీడియా, విశ్వవిద్యాలయాల్లో దేశవ్యాప్తంగా ప్రతిఘటన రావడంతో వాటినే కొనసాగించారు.

ఆ తరువాత 1999లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. ఆర్‌ఎస్‌ఎస్ కు ఒకప్పుడు రాజకీయ అంగంగా ఉన్న జనసంఘ్ స్థానంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ ఈ ప్రభుత్వానికి సారథ్యం వహించింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని (లౌకిక వైజ్ఞానిక చరిత్రకారులపై దాడి ప్రారంభిం చడానికి ముందు), సిలబస్ కమిటీలలోని కీలకమైన వ్యక్తుల్ని, ఎన్‌సిఇఆర్‌టి, యుజిసి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సంస్థల్లో ఉన్నత స్థానాల్లోని కీలక వ్యక్తులను తొలగించింది. మతపరమైన భావనలు గాయపడ్డాయనే కారణంగా ఆర్.ఎస్.శర్మ, రొమిల్లా థాపర్, బిపన్ చంద్ర, సతీష్ చంద్ర లాంటి వారు రచించిన ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల్లోని 41 పేరాలను తొలగించాలని కోరారు. ఆ పేరాల్ని తర్వాత తొలగించారు. ఎన్‌సిఇఆర్‌టి నూతన డైరెక్టర్‌గా నియమితుడైన జె.ఎస్.రాజ్‌పుత్ తన వ్యాసంలో లౌకిక మేధావులు, వారిని సమర్థించిన వారిని (వీరిలో నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్, భారత రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్, ప్రధాన వార్తాపత్రికల సంపాదకులు ఉన్నారు) 'జాతి వ్యతిరేకులు'గా అభివర్ణించారు.

హిందూ మతోన్మాద చారిత్రిక దృక్పథాన్ని అంగీకరించని

వారిపై దాడి చేసే ధోరణి పెరిగింది. ముఖ్యంగా భారత జాతీయ వాదానికి స్వీయ నియమిత రక్షకులుగా చెప్పుకునే ఒక గ్రూప్ వారు నాటి కేంద్ర విద్యాశాఖ మంత్రి మురళీ మనోహర్ జోషి ఇంటి దగ్గర చేరి రొమిల్లా థాపర్, ఆర్.ఎస్.శర్మ, అర్జున్ దేవ్ లాంటి చరిత్రకారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేసినప్పుడు ఆ విషయం స్పష్టమైంది. వీరు రచించిన చరిత్రను 'మేథో తీవ్రవాదం'గా ముద్ర వేయడం ద్వారా తమ ఫాసిస్ట్ ధోరణికి విద్యామంత్రి మరింత ఆజ్యం పోశారు. అంతేకాక ఈ మేథో తీవ్రవాదం సరిహద్దు తీవ్రవాదం కంటే ప్రమాదమైన దనీ, దీనిని సమర్థవంతంగా ఎదుర్కొనాల్సిన అవసరం ఉందని కూడా మంత్రి వ్యాఖ్యానించారు. చివరకు వారు రచించిన ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలు తొలగించి, కొత్త పాఠ్యపుస్తకాలను తెప్పించారు. తిరిగి 2004లో కేంద్రంలో హిందూత్వ శక్తులు అధికారం కోల్పోవడంతో మతతత్వ దాడుల నుంచి కొంత ఉపశమనం కలిగింది.

2014, 2019లో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి లు తమకు అనుకూలమైన చరిత్రను తిరగరాసే అవకాశాన్ని పొందాయి. ముద్రణలో ఉన్న ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల్లోని తొలగింపుల నివేదికలు బయటపడడం మొదలయ్యాయి. 2001లో మాదిరిగా ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాల తొలగింపుకు ముందు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచురణలు కూడా దాన్నే డిమాండ్ చేశాయి. జూన్ 2021లో బిజెపి ఈ-ట్రైనింగ్ సెల్ నేషనల్ కన్వీనర్ నేతృత్వంలోని 'పబ్లిక్ పాలసీ రీసెర్చ్ సెంటర్' ప్రస్తుత చరిత్ర పాఠ్యాంశాల్లో మార్పుల్ని డిమాండ్ చేస్తూ ఒక నివేదికను రూపొందించింది. అదేవిధంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త సహస్ర బుద్ధే నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కూడా ఇలాంటి నివేదికనే రూపొందించింది. ఎన్‌సిఇఆర్‌టి సవరించిన సిలబస్‌ను రూపొందించింది. ఈ సిలబస్‌లో మొఘలుల కాలంనాటి చరిత్రతో పాటు ఢిల్లీ సుల్తానులు, తుగ్లక్‌లు, ఖిల్జీలు, లోడీల చరిత్ర భాగాల్ని పెద్దఎత్తున తొలగించారు.

అన్ని తొలగింపులతో కూడిన కొత్త పాఠ్యపుస్తకాలు ఏప్రిల్ 2023లో మార్కెట్‌లోకి వచ్చాయి. పుస్తకాలు విడుదలైన వెంటనే మళ్ళీ బిజెపి నాయకుడు కపిల్ మిశ్రా 2023 ఏప్రిల్ 4న ఇలా ప్రకటన చేశారు : "ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ నుండి మొఘలుల తప్పుడు చరిత్ర తొలగింపు గొప్ప నిర్ణయం. దొంగలు, జేబు దొంగల్ని మొఘల్ సుల్తానులని, భారతదేశ చక్రవర్తులని పిలిచారు. అక్బర్, బాబర్, షాజహాన్, ఔరంగ జేబులు చరిత్ర పుస్తకాల్లో లేరు. వారంతా చెత్తబుట్టలో ఉన్నారు". ముస్లింలను నిత్యం దూషించడం, రోడ్లకు, నగరాలకు పెట్టినవారి పేర్లను తొలగించేందుకు ప్రయత్నించడం, ఇప్పుడు కొత్త పాఠ్యపుస్తకాలు తీసుకురావడం... వంటివన్నీ ముస్లింల పట్ల వారికున్న ఆలోచనలకు అనుగుణంగానే జరిగాయి. ముఖ్యంగా 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన అంశాలు (నరేంద్ర మోడీ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు), ఈ విషయమై జాతీయ మానవ హక్కుల కమిషన్ పరిశీలనలు... తదితర అంశాలను కూడా పాఠ్యాంశాల నుంచి తొలగించారు.

మొఘలులు, సుల్తానుల కాలాల్ని చరిత్రలో లేకుండా చెరిపి వేయడం కూడా మన చరిత్ర అవగాహనకు చాలా హానికరం. భారత ప్రజలు ఈ కాలాన్ని హిందువులపై ముస్లింలు కొనసాగించిన ఆగడాల్లో ఒకటిగా చూడలేదు. బ్రిటీష్ వలస సిద్ధాంతకర్తలు మొదటిసారిగా ఆ దృష్టితోనే ఈ కాలాన్ని వీక్షించారు. దీనిని హిందూ మతోన్మాదులు ప్రచారంలో పెట్టారు. 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో సైనికులు, అన్ని కులమతాలకు చెందిన వారు బ్రిటీష్ వారిని పడగొట్టే ప్రయత్నం చేశారు. వారి స్థానంలో వచ్చింది మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్ తప్ప వేరెవరో కాదు. మన పిల్లలకు ఈ కాలం గురించి తెలియకుండా చేయడమంటే ఎవరి కాళ్ళని వారే నరికేసుకోవడం లాంటిదే.

మహాత్మా గాంధీ హత్య గురించి కూడా పాఠ్యాంశాల నుంచి తొలగించారు. ఇది కూడా చాలా రహస్యంగా చేశారు. ఏప్రిల్ 2022లో పాఠశాలలకు పంపిన జాబితాలో కూడా ఈ తొలగింపుల గురించి పేర్కొనలేదు. భారత దేశాన్ని హిందువుల కోసం మాత్రమే మార్చే ఏ ప్రయత్నమైనా భారత దేశాన్ని నాశనం చేస్తుందనే గాంధీ దృఢ విశ్వాసం గురించి, హిందూ ముస్లిం ఐక్యత కోసం ఆయన చేసిన కృషి గురించి, ఇది నచ్చని హిందూ తీవ్రవాదులు గాంధీజీని హత్య చేయడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశారనే అంశాలు కూడా తొలగించబడ్డాయి. పన్నెండవ తరగతి చరిత్రలో గాంధీజీని హత్య చేసిన వ్యక్తికి సంబంధించిన రాజకీయ (సవరించిన పేరాలో) వివరాల్ని తొలగించారు. అది ఇలా ఉంది: 'ఆయన రోజువారీ ప్రార్థనా సమయంలో (జనవరి 30న) గాంధీజీని ఒక యువకుడు కాల్చి చంపాడు. ఆ తరువాత గాంధీ హంతకుడు నాథూరాం గాడ్సే లొంగిపోయాడు'.

ఇలాంటి తొలగింపులతో మనం ప్రశ్నలు అడగని, ఆలోచించని భక్తుల తరాన్ని సృష్టించడంలో కృతకృత్యుల మౌతాం. అయితే మన పిల్లలు మతాంధులుగా ఉండాలని మనం కోరుకోం. అదృష్టవశాత్తు, ఈ తొలగింపులపై పెద్ద సంఖ్యలో విద్యావేత్తలు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశాయి. అనేక వార్తాపత్రికలు ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయాన్ని విమర్శిస్తూ సంపాదకీయాలు ప్రచురించాయి. రాజ్యాంగ ధర్మానికి, భారత ఉపఖండంలోని ప్రజాస్వామ్య, మిశ్రమ సంస్కృతికి వ్యతిరేకంగా విభజన లక్ష్యాలతో పాఠ్యాంశాల్లో చేస్తున్న మార్పులను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేయాలి.

**(వ్యాసకర్తలు జెఎన్‌యులో ప్రొఫెసర్లుగా పనిచేశారు)**

**('ద వైర్' సౌజన్యంతో)**

## మేడే

**భు**క్తి కోసం మేడే
విముక్తి కోసం మేడే ... మేడే మేడే
చిత్తశుద్ధితో నిలిచారో
భావశుద్ధితో పిలిచారో
మేడే మీకు మార్గం
సంతోషాల స్వర్గం
ఒక సురుచిర లక్ష్యం మేడే
ఒక సుమధుర గమ్యం ... మేడే మేడే మేడే
పల్లకి మోసే బోయీలు
కోనల కూసే కోయలు
జంకుతూ ఎన్నాళ్ళు
భయపడుతూ ఎన్నేళ్ళు
శ్వాసించే హక్కుని
నివసించే స్వేచ్ఛని దోచేదెవడే ... మేడే మేడే
ఒక పచ్చని శ్వాసకై
ఒక వెచ్చని ఆశకై
పరదాలన్నీ తీసేయ్
అడ్డుగోడలే కూల్చేయ్
మతాలన్నీ నెలవైతే
ముఠాలన్నీ కొలువైతే
ఈ క్షణమే యుద్ధం కావాలి సిద్ధం
ఉదయం వుంది చూద్దాం
నవశకమే తెద్దాం
కార్మికులంతా రండి
కర్షకులంతా రండి
మంత్రాల సర్పంచు దుస్తంత్రాల పట్వారి
తంత్రాల పటేల్ కుతంత్రాల దొర
తొడకొట్టే మేడే పడకొట్టే మేడే
మొన్న నిన్న దోపిడీలో
నిన్న రేపు రాపిడిలో
కదిలే ఊరూ వాడే మేడే
ఉద్యమవీరుల సాక్షిగా
అమరవీరుల స్ఫూర్తిగా
భుక్తి కోసం మేడే విముక్తి కోసం మేడే
విశ్రమ మెరుగని దీక్షలో
విరామమెరుగని పరీక్షలో
గాలాలన్నీ తెగిపోవా వుండేళ్లన్నీ వుడిపోవా
కొత్త దృష్టిలో మేడే ఖడ్గసృష్టిలో మేడే!

**- కోటం చంద్రశేఖర్**
**94920 43348**



## అక్షరాల అరణ్యాన్ని ...

**గా**యమైన గగనపు కొమ్మకు
గేయాన్నై మొలకెత్తుతుంటాను
వేదనల వీణనై సుడిగుండాల కడలినై
అంతరంగ కథనాలకి
అక్షరాలు కూర్చుంటాను
రుధిర ధారనై శిథిల గీతినై
విషాద గీతాలకు ఊపిరి పోస్తుంటాను

జడత్వాన్ని పూసుకున్న నిదుర తీరాలకు
నిత్య చైతన్య స్రవంతినై
మేలుకొలుపు రాగాలు పాడుతుంటాను
మరోసారి
నరాలు తెగిపడే విప్లవ స్వరాలకు
నాంది వాచకాలు రాస్తుంటాను
అప్పుడప్పుడు భూదిగంతాలను స్పృశించి
రాలిన రాతల పుప్పొడిని ఒడుపుగా హత్తుకుంటాను!

ఇంకోసారి
చిక్కని చీకటిని కౌగిలించుకుంటాను
వెచ్చని వెలుతురుని పలకరించుతుంటాను
ఎన్నిసార్లు మరణించినా మళ్లీ మళ్లీ చిగురిస్తుంటాను!

ఎందుకంటే
అక్షరాల అరణ్యాన్ని నేను ....

**- రాజశేఖరుని శ్రీ శివలక్ష్మి (లక్ష్మీ చామర్తి)**
**87907 00383**



# వివక్షపై గళమెత్తిన కలం గుర్రం జాషువా

- డాక్టర్ డి.ఉదయకుమారి
అసోసియేట్ ప్రొఫెసర్
ద్రావిడ విశ్వవిద్యాలయం
కుప్పం – 517 426

**క**వులు కవిత్వం వెంట నడుస్తారు. కానీ కవిత్వం మహాకవుల వెంట నడుస్తుంది. కవులు అంతటా ఉంటారు. మహాకవులు అరుదుగా ఉంటారు. మహా కవుల కవిత్వం ఆపాత మధురమై, అనుభూతిసిద్ధమై, అవ్యక్త ఆనందాన్ని అందిస్తుంది. స్ఫూర్తిదాయకమై ఉంటుంది. తన కలం బలంతో కులాన్ని కూకటివేళ్ళతో పెకలించడానికి ప్రయత్నించిన జాషువా నిస్సందేహంగా మహాకవి. కఠినమైన జీవితం, కఠోరమైన సాధన, కవితా వధూటి వరించి ప్రసాదించిన సహజమైన ప్రజ్ఞ కలగలసింది జాషువా కవిత్వం.

మనిషి సృష్టించిన మహాపరాధం మతం. మతం చేసిన మరొక అపరాధం కులం. వీటి మధ్య నలిగి, రాటు దేలిన కలం జాషువాది. జాషువా కవిత్వం ఆయన జీవించిన సమాజానికి ప్రతినిధి. తాను ఎదుర్కొన్న వివక్ష, అవమానాలు, ఆకలి బాధలే ఆయన కవిత్వానికి నిజమైన ప్రేరణ. తన కవిత్వానికి నిజమైన ప్రేరణను, నేపథ్యాన్ని గురించి చెబుతూ "నాకు గురువులు ఇద్దరు. పేదరికం, కుల మత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే .. రెండోది నాలో ఎదిరించే శక్తిని పెంచింది" అనడంలోనే జాషువా కవితా వ్యక్తిత్వం మనకు స్పష్టమవుతుంది.

జాషువా స్వప్న జగత్తులో విహరించిన కవి కాదు. వాస్తవంలో సంచరించిన మహాకవి. అయితే ఆయన కవిత్వంలో భావుకతకు కొదువలేదు. ఆయన ప్రతి పదం అనుభూతి వ్యక్తంగా, ఆలోచనా ప్రేరకంగా, మనోహరంగా ఉంటుంది.

జాషువా కవిగా పుట్టే నాటికి దేశవ్యాప్తంగా జాతీయోద్యమ ప్రభావం విశేషంగా పడింది. అంతకుముందే సంఘ సంస్కరణ, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు నడిచాయి. కవిత్వోద్యమాలు, భాషోద్యమాలు నడుస్తున్నాయి. కవిత్వంపై వివిధ 'ఇజం'ల ప్రభావం మొదలైంది. గాంధేయ వాద ప్రభావం దేశాన్ని ఒక ఊపు ఊపుతున్నది. స్వభావంలో నవ్య కవిత్వం, స్వరూపంలో వచన కవిత్వం పరుగులు పెడుతున్నాయి. విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు' ప్రకటించి సనాతన ధర్మాన్ని కాపాడడం కోసం 'చెలియలికట్ట' వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. నండూరి ఎంకి ప్రేమలో తరిస్తుంటే, అప్పుడప్పుడే కృష్ణశాస్త్రి ప్రకృతి ఒడిలో పరవశిస్తున్నాడు. కానీ, జాషువా మాత్రం కాల్చే ఆకలి, కూల్చే వేదన, అవమానాలు, అపహాస్యాలతో పోరాడుతూ సంప్రదాయ వాదులు నిందించిన 'మైల కవిత్వం'తో, 'పంచమ స్వరం'తోనే ఆంధ్రదేశాన్ని మైమరపించాడు. ఇటువంటి నేపథ్యంలో జాషువా పద్య కవిత్వానికే పట్టం కట్టినప్పటికీ ఆయన స్వభావంలో పరిపూర్ణంగా ఆధునికుడు.

తనను, తన కవిత్వాన్ని అవమానించాలని చూసిన వారికి 'గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయ చేత నన్నెవ్విధ దూలినన్ నను వరించిన శారద లేచిపోవునే' అంటూ ఆత్మాభిమానంతో జవాబివ్వడం జాషువా వంటి కొందరికే సాధ్యమౌతుందేమో! 'నా కత్తి కవిత, నా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపైన ద్వేషం' అని, మత పిచ్చి గాని, వర్గోన్నతి గాని, స్వార్థచింతన గాని నా కృతుల్లో కనబడదని జాషువా స్పష్టంగా చెప్పుకున్నాడు. 'ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయింత్రుగాని

*దు:ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్ మెతుకు విదల్చదీ భరత మేదిని'* అంటూ కుండ బద్దలు కొట్టి చెప్పాడు. ముప్పది మూడు కోట్ల దేవత లెగబడ్డ దేశంలో భాగ్య విహీనుల ఆకలి ఎలా తీరుతుందని? ప్రశ్నించాడు.

విశాల దృక్పథం, ప్రశ్నించే తత్వం, సమానత్వ సాధన కోసం పరితపించడం, అవమానాలను సహించలేని ఆత్మాభిమానం వంటి అనేక లక్షణాలు జాషువాను విలక్షణమైన వ్యక్తిగా నిలబెడుతున్నాయి.

1919లో 'రుక్మిణీ కళ్యాణం'తో కవిత్వం రాయడం ప్రారంభించినప్పటికీ *గిజిగాడు, సాలీడు, భారత వీరుడు, భాష్ప సందేశము, శిల్పి, పశ్చాత్తాపము, పంచముడు, ధన్యజీవి, ఆవేదన, ప్రశ్న, నేను* వంటి చాలా ఖండకావ్యాల్లో జాషువా నిరసన స్వరం మనకు వినిపిస్తుంది. అంతేకాదు, ఆయన కవిత్వంలో కుల వ్యవస్థపై ధిక్కారస్వరం అంతర్వాహినిగా ఉంటూనే ఉంటుంది. 1932లో ఆయన రాసిన ఫిరదౌసి, ముంతాజ్ మహల్ కావ్యాలు జాషువాను కవిగా మహోన్నత స్థానానికి చేర్చాయి. జాషువా కవితా స్వరూపాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించిన కావ్యం గబ్బిలం. ఈ కావ్యంలోని క్షుధానల మూర్తియైన కథానాయకుడు సాక్షాత్తు జాషువాకు ప్రతినిధి. 'నాదు కన్నీటి కథ సమన్వయము సేయ నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు' అని చెప్పుకున్నది తన గురించే.

జాషువా, సందేశాన్ని శివునికి వినిపించడానికి గబ్బిలాన్ని ఎంచుకోవడంలోనే అంతవరకు ఉన్న అనవసరపు సాంప్రదాయాల్ని ఉద్దేశ్యపూర్వకంగానే అతిక్రమించడం కనిపిస్తుంది. ఇందులోని కథానాయకుడు భరత వీరుని పాదాలు కందిపోకుండా చెప్పులు కుట్టి జీవనం సాగించే గొప్ప సేవకుడు. ఆయన గాలి సోకితేనే నాలుగు పడగల హైందవ నాగరాజు కోపంతో బుసలు కొడుతూ ఉంటాడు. కులము లేని నేను కొడుకుల్ని కని, వాళ్లను కూడా ఈ దురవస్థల పాలు చేయడం ఇష్టం లేక బ్రహ్మచర్య దీక్షలో ఉన్న వాడు. ఈ విధంగా ప్రతి మాటలోనూ జాషువా కులవివక్షను కుళ్ళబొడిచే ప్రయత్నం తన జీవన పర్యంతం చేశాడు.

జాషువా కవిత్వంలో దురాచార ఖండనతో పాటు దేశభక్తి ప్రబోధం కూడా మెండుగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఆయన కవిత్వంలోని ఆర్ద్రత కరుణరస సంపూర్ణమై కన్నులు చెమ్మగిల్ల చేస్తుంది. ముంతాజ్ మహల్ మరణం తర్వాత షాజహాన్ చక్రవర్తి మనోవేదనను *'నాదు నేత్ర యుగళి నాట్యమాడెదు నిన్ను నెట్లు దొంగిలించె నీశ్వరుండు'* అంటూ, *'ఈవు వసించు చోటు, వసియింతును నేనును, దాచి యుంపుమో దేవి! యొకింత నేల'* అంటూ చిత్రించిన తీరు పాఠకుల మనస్సుల్ని కదిలిస్తుంది. దాంపత్య జీవనంలోని ప్రేమను, అనుబంధంలోని గాఢతను ఆవిష్కరిస్తుంది.

జాషువాకు *మధుర శ్రీనాథ* అన్న బిరుదు నిజంగా సార్థకమైంది. పద్య నిర్మాణ చాతుర్యం, పద విన్యాస సామర్థ్యం కూడా జాషువాను మహాకవిగా నిలబెట్టడమే కాకుండా అలనాటి శ్రీనాథుని గుర్తుకు తెస్తాయి. జాషువా సీస పద్యం నడకలో గొప్ప సౌందర్యం ఉంటుంది. పద్యంలోని ఏ పాదానికి ఆ పాదం పూర్తి అర్థాన్ని ఆవిష్కరిస్తూ ఉంటుంది. పదాల పోహళింపు కూడా శ్రవణపేయంగా ఉంటుంది.

విశ్వ మానవ శ్రేయస్సును ఆకాంక్షించడం మహా కవులకు ఉండవలసిన లక్షణం. ఈ గుణం మెండుగా ఉన్న జాషువా తాను విశ్వ నరుడను అని చెప్పుకోవడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. కవి ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ జాషువా రాసిన పద్యం ఆయనకు నూటికి నూరుశాతం వర్తిసుంది. *'రాజు మరణించె నొకతార రాలిపోయె, కవియు మరణించె నొకతార గగనమెక్కె రాజు జీవించు రాతి విగ్రహములందు, సుకవి జీవించె ప్రజల నాల్కల యందు'.*

గొప్ప విశ్వమానవ దృష్టితో సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన జాషువాను తెలుగు కవితా వినీలాకాశంలో మరొక ధ్రువతారగా చెప్పక తప్పదు. ■

## 'అద్దానికి అర్జీ'

**ఆ**కలి చెవులనిండా
కబోది కబుర్లు
ఆగని మంత్రపఠనం
కాంతిగాయాల రుజువులు
పూత పూసిన కళ్లు

పగలు
పగులుతున్న భ్రమ కాదూ?!

గాలిపుట్ట పగిలి
గంధకపు వాసన

పాత ఉత్తరాల పోగుల్లో
ఉనికి వెతుకులాట,
... ఒక ఉక్కబోత

అద్దానికి అర్జీ
నకిలీగా, నను చూపొద్దని ...

**- మల్లారెడ్డి మురళీ మోహన్**
88611 84899



# మత్తు కమ్మిన రాత్రి

- శింగమాల సుబ్రహ్మణ్యం
94902 99399

**వి**జయకుమార్ ఊళ్ళో సంపన్న కుటుంబానికి చెందిన యువకుడు. ఇంజనీరింగ్ చదివి బెంగుళూర్లో సాఫ్టువేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగంలో చేరిన తర్వాత తొలిసారి సంక్రాంతి సెలవులకని సొంతూరు వచ్చాడు.

**గో**పాలకృష్ణ అదే ఊళ్ళో మధ్య తరగతి రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. ఎం.బి.ఏ. చదివి హైదరాబాదులో ఒక కన్సల్టెంటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనూ సంక్రాంతి సెలవులకని ఊరొచ్చాడు.

**సు**ధాకర్ బి.ఎ. చదివాడు. పోటీ పరీక్షల్లో పాసై జీవిత బీమా సంస్థలో సహాయకుడిగా ఉద్యోగంలో చేరాడు. తను పనిచేసే కార్యాలయం ఊరికి దగ్గరగానే ఉన్న టౌన్లోనే ఉంది. అందువల్ల రోజూ ఇంటినుండే విధులకు వెళ్ళొస్తుంటాడు.

**పై** చదువులు చదివే స్థోమత లేని నాగేంద్ర ఇంటర్మీడియటు తోనే సరిపెట్టుకున్నాడు. తమకున్న రెండెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ ఊళ్ళోనే ఉంటున్నాడు.

**వీ**ళ్ళు నలుగురూ బాల్య మిత్రులు. పదో తరగతి వరకు కలిసే చదువుకున్నారు. చదువు, ఉద్యోగరీత్యా దూరప్రాంతాలకు వెళ్ళినా అప్పుడప్పుడూ ఫోన్లో పలకరించుకుంటూనే ఉంటారు. భోగి పండక్కి ముందురోజు విజయకుమార్ తన ముగ్గురు మిత్రులకి ఫోన్ చేసి సాయంత్రం ఐదు గంటలకంతా ఊరి సెంటరుకి వచ్చేయమని చెప్పాడు. చిన్నతనం నుంచి ప్రతి సాయంత్రం సముద్ర తీరానికి వెళ్ళి కబుర్లు చెప్పుకోవడం వాళ్ళకి అలవాటు. ఉద్యోగరీత్యా వేరే ఊళ్ళలో వుండటం చేత ఈమధ్య అంతరాయం ఏర్పడింది. అందువల్ల సముద్రం దగ్గరకేమో! అనుకున్నారు మిగతా వాళ్ళంతా.

ఆరోజు సాయంత్రం ఊళ్ళో ఎక్కడ చూసినా భోగి మంటల హడావిడి కనిపిస్తోంది. పండగరోజు కూర కోసం కోళ్ళు తెచ్చేవాళ్ళు ఓ వైపు. వేట మాంసం కోసం పొట్టేళ్ళు, మేక పోతులు తోలుకొచ్చేవాళ్ళు మరొకవైపు. వేకువజామున వేసే భోగి మంటల కోసం సవకాకు, తాటాకు తెచ్చేవాళ్ళు కొందరు. ఇచ్చిన కొత్త బట్టలు ఇంకా కుట్టివ్వని టైలర్ల చుట్టూ బిక్కమొహాలేసుకుని తిరుగుతూ మరికొందరు. ఎటు చూసినా పండగ వాతావరణమే!

చెప్పిన సమయానికి మిత్రులంతా సెంటరుకి చేరుకున్నారు. ఊళ్ళోవాళ్ళ హడావిడి చూస్తూ రచ్చరుగుమీద కూర్చున్నారు. చిన్నగా మాటల్లోకి దిగారు. తెలిసిన వాళ్ళ పలకరింపుల్తో అప్పుడప్పుడూ ఆ మాటలకి అంతరాయం కలుగుతోంది.

"ఇక్కడే ఎంతసేపు కూర్చుంటాంరా! సముద్రం దగ్గరకి వెళదాం పదండి" అన్నాడు గోపాలకృష్ణ

"ఎప్పుడూ సముద్రం దగ్గరకేనా? ఇంకేదైనా కొత్త ప్రదేశానికి వెళదాం" అన్నాడు విజయకుమార్

"ఇంకెక్కడికెళతాం? ఇదేమీ బెంగుళూరో, హైదరాబాదో కాదు కదా!" సుధాకర్ ప్రశ్న

" కొత్త ప్రదేశాలు బెంగుళూరు, హైదరాబాదుల్లోనే ఉంటాయా! ఇక్కడేమీ ఉండవా?" విజయకుమార్

"ఎందుకుండవూ... మనసులో బలంగా కోరుకుంటే అన్నీ ఇక్కడే ఉంటాయి. అటువంటి విషయాల్లో మన చుట్టుపక్కల ఊళ్ళు కూడా మీ నగరాలకేమీ తీసిపోవు" తల గోక్కుంటూ అన్నాడు నాగేంద్ర.

"మనసులో లేకుంటే నేనెందుకు అడుగుతాన్రా?" నవ్వాడు విజయకుమార్

"అయితే వినండి. ఒక్కొక్కరికి ఉద్యోగాలొచ్చినప్పుడు మీరేం చెప్పార్రా?" ప్రశ్నించాడు నాగేంద్ర. అందరూ మౌనంగా ఉన్నారు.

నాగేంద్ర అందుకున్నాడు : "అప్పుడు ఇస్తానన్న పార్టీ ఈ రోజు ఇవ్వండి! పండగ సందర్భం కూడా కలిసొస్తుంది"

"నిజమేననుకో! కానీ ఈ చుట్టుపక్కలంటే మనందరికీ ఇబ్బందిగానే ఉంటుంది. అందరూ తెలిసినోళ్ళే. టౌన్లో అయితే పర్వాలేదు. అక్కడ ఎవరికెవరో! అసలే మనకు మంచి పిలకాయలమని పేరు. మనల్ని ఎవరు చూసినా అంతే సంగతులు!" అన్నాడు

విజయకుమార్. దాంతో ఏకీభవించాడు గోపాలకృష్ణ.

"నాకలాంటి పట్టింపులేమీ లేవురా. మీరెక్కడికి తీసుకెళితే అక్కడికొస్తాను" నవ్వుతూ అన్నాడు నాగేంద్ర.

"నీకెందుకుంటుందిరా! బాగా తాగడం అలవాటైపోయింది" చిరుకోపం ప్రదర్శించాడు సుధాకర్

"ఏం అలవాటు లేరా! నెలకోసారి తాగడం కూడా అలవాటేనా" – నాగేంద్ర

"ఇప్పుడు నెలకనుకో. ఆ తరవాతా...! ఊళ్ళో పరిస్థితులు అసలే బాగాలేవు. కొంచెం వయసొచ్చిన పిలకాయల్నించి పండు ముసలోళ్ళ వరకూ అందరూ తాగుతున్నారు. పోనీ తాగినోళ్ళు గుట్టుగా ఇంటికెళతారా అంటే అదీ లేదు. వీధుల్లోకొచ్చి గొడవ చేస్తారు. తాగొచ్చినోళ్ళని చూస్తే మిగతా వాళ్ళు అసహ్యించుకునే పరిస్థితులున్నాయిరా!" అన్నాడు సుధాకర్.

"నేననుకున్నా. పార్టీ అంటే ఏదో కారణం చెప్పి తప్పించు కుంటాడు వీడు. ఇప్పుడు మీరు ఇస్తానంటుంటే అడ్డుపుల్ల లేస్తున్నాడు" నిష్ఠూరపోయాడు నాగేంద్ర.

"పోరా.. పరిస్థితులనర్థం చేసుకోకుండా ఎన్నన్నా అంటావు! ఇక్కడ చీమ చిటుక్కుమన్నా అందరికీ తెలిసిపోతుంది. ఊళ్ళో మంచి పిలకాయలమనే పేరుంది మనకు. దాన్నెందుకు చెడగొట్టు కోవాల. మొన్నటికి మొన్న ఆ ఖాసిం గాడు, శీనిగాడు ఇద్దరూ ఎక్కడో దొంగచాటుగా కొంత పుచ్చుకున్నారు. వచ్చే దోవలో ఏమైందో ఏమో! కలబడి కొట్టేసుకున్నారు. తెల్లారి రెండు కుటుంబాల మధ్య పంచాయతీ..." సుధాకర్

"ఇంతకీ ఏ విషయంలో గొడవపడ్డారు"అడిగాడు గోపాలకృష్ణ.

"అసలు విషయం పంచాయతీలో బయటపడింది. మామిడి తోపుకి కాపలా ఉండే రామయ్య కూతురు రేణుక తనను ప్రేమిస్తుం దని ఖాసిం గాడన్నాడంట. కాదు నన్నే ప్రేమిస్తుందని శీనుగాడు. మాటా మాటా పెరిగింది. కలబడి కొట్టేసుకున్నారు" చెప్పాడు సుధాకర్.

"పొట్ట చేత్తో పట్టుకుని మనూరొచ్చి మామిడి తోటకు కాపలా కాస్తూ వాళ్ళ మానాన వాళ్ళు బతుకుతున్నారు. వాళ్ళని వీధుల్లో పెట్టడమెందుకురా?" అన్నాడు విజయకుమార్.

"వాళ్ళు కాదు కదా! వాళ్ళల్లో జొరబడిన మందు ఆ పని చేసింది" అన్నాడు సుధాకర్

"మందే ఆ పని చేస్తే ఊళ్లో రోజూ ఎన్నెన్ని గొడవలు జరగాల. ఆ అమ్మాయిలో ఏమి చూశారో.. నాదంటే నాదని కొట్టేసుకున్నారు" – నాగేంద్ర.

"ప్రేమ గుడ్డిదంటే ఇదేనేమో!" సుధాకర్

"అంతంత పెద్ద మాటలెందుకులేరా! వాళ్ళ గుండెలోతుల్లోకి పోయి చూడండి. అర్థమౌతుంది." ముసిముసి నవ్వులతో అన్నాడు నాగేంద్ర.

"అబ్బో... పెద్ద తత్త్వవేత్త బయల్దేరాడు గుండె లోతులు చదవడానికి. ఇంతకీ నువ్వెన్ని గుండె లోతుల్ని చదువుతున్నావురా! – అడిగాడు గోపాలకృష్ణ సరదాగా

"అవన్నీ చుక్కపడితేగానీ బయటికి రావురా!" మెలికలు తిరుగుతూ నవ్వాడు నాగేంద్ర.

"వీడు మన్మథావతారమెత్తి చాలా రోజులే అయ్యింది. వాటి గురించి మొదలు పెడితే భోగిమంటలు ఇక్కడే వేసుకోవాల." అన్నాడు సుధాకర్ నవ్వుతూ.

"అసలు విషయం వదిలేస్తారు. మిగతావన్నీ విషయాలు మాట్లాడతారు. ముందు పార్టీ విషయం తేల్చండహె!" కొంచెం గట్టిగానే అన్నాడు నాగేంద్ర.

"ఒరేయ్... చిన్నగా మాట్లాడరా. పార్టీ ఇవ్వడానికి నాకేమీ ఇబ్బంది లేదు. ఈ చుట్టుపక్కలైతే ఇబ్బందిగా ఉంటుందని మా అభిప్రాయం." అన్నాడు విజయకుమార్.

కొంచెంసేపు ఆలోచించి ఏదో గుర్తుకొచ్చిన వాడిలా చిటికేస్తూ అన్నాడు నాగేంద్ర. "అయితే ఇక్కడికి పది కిలోమీటర్ల దూరంలో ఒక బారుందిరా. ఆ బారు వెనుక తోటలో కుర్చీలు, టేబుళ్ళేసుం టారు. ఎప్పుడో ఒక్కసారి వెళ్ళాను. అక్కడైతే మన పరువుకొచ్చే ఇబ్బందేం వుండదు. సరేనా!"

మిగతా ఇద్దరూ సుధాకర్ వైపు చూశారు.

"ఇక తప్పేటట్టులేదుగా. సరే వెళదాం" అన్నాడు సుధాకర్.

సుధాకర్, గోపాలకృష్ణ తమ ఇళ్ళకెళ్ళి మోటారు సైకిళ్ళు తీసుకొచ్చారు. నలుగురూ అనుకున్న చోటుకు చేరుకున్నారు.

❖❖❖

సందడి అంతా అక్కడే కనిపిస్తోంది. మద్యం ప్రియులతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయుంది. ఓ పక్క జనతా బార్. మరోపక్క గార్డెన్ బార్. రంగురంగుల రేకుల ఫెన్సింగ్ ఆ రెండింటిని వేరు చేస్తోంది. ఎక్కువ ఖర్చు భరించలేని వాళ్ళు మద్యం, నీళ్ళ కొనుక్కుని అవతలి వైపున్న జనతా బార్లో కింద కూర్చుని తమ లోకంలో తాము విహరిస్తున్నారు.

గార్డెన్ బార్లో ఒక క్రమ పద్ధతిలో పెంచిన పోకడ్ చెట్లున్నాయి. ఆ చెట్ల మధ్యలో ఒక్కో దగ్గర ఒక టేబుల్, నాలుగు కుర్చీలు వేశారు. ఒక టేబులు దగ్గర కూర్చున్న వారికి వేరే టేబులు దగ్గర కూర్చున్న వాళ్ళు కనపడకుండా ఏర్పాటు చేశారు. టేబుళ్ళ దగ్గర కూర్చున్న అందరికీ కనిపించేటట్టు గార్డెన్ రెండు వైపులా పెద్ద తెరలు ఏర్పాటు చేశారు. ఆ తెరల మీద టీవీ ప్రోగ్రాములు. ఊళ్ళో తమకున్న మంచిపేరు గుర్తుకొచ్చి ముగ్గురికీ కొంచెం బెరుగ్గానే ఉంది. నాగేంద్ర అవన్నీ పట్టించుకునే స్థితిలో లేడు.

ఓ మూల టేబుల్ ఖాళీగా కనపడితే అక్కడ తిష్ఠేశారు నలుగురూ. వెయిటర్ ఆర్డర్ తీసుకోడానికి వచ్చాడు. "ఏం తీసుకుంటావురా" అని నాగేంద్రని అడిగారు మిగతావాళ్ళు.

"నాకు పలానా బ్రాండు తాగాలని ఏమీ లేదురా. మీరేం తీసుకుంటే అదే తీసుకుంటా" నాగేంద్ర సమాధానం.

విజయకుమారే ఆర్డర్ చేశాడు. ఒక ఫుల్ బాటిల్ విస్కీ, స్టఫ్, వాటర్, సోడాలతో సహా అన్నీ తెచ్చాడు వెయిటర్.

ఒక్కో గ్లాసులో విస్కీ పోసి తగినంత సోడా, వాటర్ కలిపి ఒక్కొక్కరి ముందు ఒక్కోటి పెట్టాడు. తెచ్చిన స్టఫ్ కూడా నాలుగు ప్లేట్లలో సర్ది నలుగురి ముందు పెట్టి వేరే ఆర్డర్ తీసుకోడానికి వెళ్ళిపోయాడు. నలుగురూ చీర్స్ చెప్పుకుని గ్లాసులు ఎత్తారు. ముగ్గురూ కొంచెం సిప్ చేసి దించారు. నాగేంద్ర మాత్రం ఖాళీ గ్లాసు దించాడు.

"అంత స్పీడుగా ఎలా తాగుతావురా" అన్నాడు గోపాలకృష్ణ.

"అలా తాగడం మంచిది కాదురా" అంటూ వారించ బోయాడు విజయకుమార్.

"తాగేటప్పుడు మంచీ చెడులెందుకులేరా" అంటూ బాటిల్లోంచి కొంచెం విస్కీ తన గ్లాసులోకి ఒంపుకున్నాడు నాగేంద్ర. వాడు తాగే స్పీడు చూసి మిగతా వాళ్ళు కంగారు పడ్డారు.

సమయం గడిచేకొద్దీ చీకటి చిక్కబడుతోంది. ప్రతి ఒక్కరిలో రెండో మనిషి మేల్కొంటున్నాడు. అందుకు తగ్గట్టుగానే వాళ్ళ మాటలు సాగదీతతో బయటకొస్తున్నాయి. *"తాగుచుండే బుద్ది/ తరుగుచుండే కొద్ది/ మెదడు మేయును గడ్డి ఓ కూనలమ్మా!"* అన్న ఆరుద్ర మాటలు నిజమౌతున్నాయి.

"ఇప్పుడు చెప్పరా.. నువ్వెన్ని... గుండె లోతుల్ని... చదివావో!" కదిలించాడు విజయకుమార్.

"మీకంటే ఎక్కువెక్కడ చదూకున్నాను. చదూతోపాటు ఆ విషయాల్లోనూ మీరే ఫస్ట్ కదరా" అన్నాడు నాగేంద్ర కన్నుకొడుతూ.

"తిప్పి తిప్పి... మా మీదకే... తోస్తావేందిరా" నవ్వాడు గోపాలకృష్ణ.

"లేకపోతే ఏందిరా... నా విషయాలు మాత్రం మీక్కావాల. మీ విషయాలు మాత్రం నాకు చెప్పకూడదు. అంతేకదా" చేతులు తిప్పుతా అన్నాడు నాగేంద్ర.

"చచ్చా... అదేం లేదురా... ఇన్నాళ్ళ మన స్నేహంలో... నిన్ను వేరుగా ఎప్పుడన్నా చూశామా? ఏదో సరదాగా కూచున్నాం. ఊళ్ళో యవ్వారాలు నువ్ చెబితే సరదాగా నవ్వుకోవచ్చు. అంతకు తప్పితే ఇంకోటి కాదురా" అన్నాడు విజయకుమార్.

"ఇష్టమైతేనే చెప్పు. లేకపోతే వదిలేయ్!" అన్నాడు గోపాలకృష్ణ.

"నాదేముందిరా. సేద్దిం చేసుకునేటోణ్ణి. ఊళ్లో యిలాంటి యవ్వారాలు తప్పవురా" అన్నాడు నాగేంద్ర.

"చేసిన పనిని ఎలాగైనా సమర్ధించుకోవాలి గదా!" నాలిక తిప్పుతా అన్నాడు సుధాకర్.

"రేయ్!... నువ్వు యిలాంటి గాలి మాటలు మాట్లాడబాక. ఇందాగ్గూడా ఇట్టాగే మాట్లాడావు. అదెవడూ... ఆ... ఆ... నేను మనమధావతారమెత్తానా? నువ్ మాత్రం నంగనాచి టింగు బుర్రవా? నీ యవ్వారం నాకు తెలీదనుకోబాకు" నాగేంద్ర.

"నా యవ్వారం నీకేం తెలుసురా? ఇప్పుడే సెప్పు. నేనేం ఆంబోతులాగా ఊరి మీద పడి తిరిగే రకం కాదు" అరిచాడు సుధాకర్.

"నన్ను ఆంబోతంటావురా! నాలుగు రూకలు సంపాయించుకుంటానే కళ్ళు నెత్తికెక్కాయిరా నీకు" రెట్టింపు గొంతుతో అరిచాడు.

ఇద్దరూ కలబడబోయారు. విజయకుమార్, గోపాలకృష్ణ తూలుతూనే ఇద్దరిని విడదీశారు. అప్పటికే అందరూ వీళ్ళవైపే చూస్తున్నారు.

"పండగ రోజు ఏదో సరదాగా కాలక్షేపం సేద్దామంటే మీరేందిరా ఇలా గొడవలు బెట్టుకుంటుండారు. ఇలాగే ఉంటే మన పరువు గంగలో కలిసిపోతుంది" కోపంగా అన్నాడు విజయ కుమార్.

"మీరిద్దరంటే నాకు ఎప్పటికీ గౌరవమే. మీరేం చెప్పినా వింటాను. కానీ... ఆ సుధాకర్ గాడు ఏం వాగుతున్నాడో చూడరా. వాడు టౌనుకు పోయినప్పుడు ఏమేమి చేసొస్తుండాడో అన్నీ నాకు తెలుస్తుండాయి. ఎప్పుడైనా ఒక్క మాట మీతో అన్నానా. మీరిద్దరూ చెప్పండ్రా!" అన్నాడు నాగేంద్ర చేతులూపుతూ...

"టౌన్లో నేనేం చేశాన్రా! దమ్ముంటే చెప్పు. ఈ యవ్వారం ఇక్కడే తేలిపోవాల" పళ్ళు పటపటా కొరుకుతూ గట్టిగానే అరిచాడు సుధాకర్.

"సత్యవంతుడి మాటలు మాట్లాడబాకు. నేను గనక నోరు తెరిస్తే ఈళ్ళ ముందు నీ పరువు ఉష్! ఏమనుకుంటుండావో ఏమో!" అంతే గట్టిగా బదులిచ్చాడు నాగేంద్ర.

"అంత కోపంగా ఎందుకు మాట్లాడుకుంటార్రా. సరదాగా మాట్లాడుకుందాం" సర్దబోయాడు విజయకుమార్.

"అది కాదు విజయ్. నా గురించి ఏదో తెలుసని వాగుతున్నా డోడు. ఏం తెలుసో వాడిక్కడే కక్కాల. లేకపోతే ఊరుకునేది లేదు." సుధాకర్ రెచ్చిపోతున్నాడు.

"ఊరుకోక ఏమి చేస్తావురా" అంటా తూలుతూ సుధాకర్ మీదకి పోయాడు నాగేంద్ర. కోపం పట్టలేక టేబుల్ మీదున్న బాటిల్ తీసుకుని నాగేంద్ర నెత్తిమీద ఒక్కటేశాడు సుధాకర్. తల పగిలి రక్తం కారుతోంది. అందరూ గుమిగూడారు. ఏదైతే జరక్కూడదనుకున్నారో అదే జరిగిపోయింది. మత్తు కమ్మిన ఆ రాత్రి వాళ్ళ పరువు పోలీస్టేషను కెక్కింది. వాళ్ళ పెద్దలు కేసులేమీ లేకుండా చేసి నలుగుర్ని వాళ్ళ ఇళ్ళకు తీసుకొచ్చుకున్నారు.

❖ ❖ ❖

వేకువ జామున ఊరంతా మంచు తెరలు కమ్ముకున్నాయి. ఆ మంచు తెరల మాటున భోగి మంటల వెచ్చదనంలో గుసగుసలతో ఊరంతా చలి కాచుకుంటోంది. ముగ్గురిళ్ళల్లో కుంకుడుగాయ రసంతో తలంటుతూ సుప్రభాతాలు చదువుతున్నారు పెద్దోళ్ళు (నాలుగోవాడికి తల చిట్లింది కదా). కుటుంబాల పరువు కలగలిసిన భోగి నీళ్ళు వీధుల్లో పారుతున్నాయ్! ■


## సాహిత్య ప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి .. మీ మిత్రులను చేర్పించండి ..!**



## పుస్తక విలాపం

మానవాళి అభ్యుదయానికి
సంస్కృతి, సంస్కారానికి
నాగరికత పురోగమనానికి
గ్రంథాలయాలే ప్రగతికి సోపానం
పుస్తక పఠనమే ప్రామాణికం
తెలుగింట గ్రంథకుసుమాలు
శిరోధార్యమై వికసించాలి

నేడు పుస్తక బాంఢాగారం
ఆలనా పాలనా లేని వైనం
దుమ్మూ ధూళి నిండిన నిలయం
ఇనుప అరల నడుమ చెదలు పట్టి
పొట్టుగా రాలుతున్న మట్టి
నిక్షిప్తమైన సమస్త విజ్ఞానం
కవివర్యుల సాహితీ సుసంపన్నం
చీకటి కుహారంలో బందీ అయి
నిర్వీర్యమై నిరర్థకమై
వెలవెలపోతున్నవి నిస్సారంగా
పుస్తకం హస్తభూషణం కాదని
చరవాణి చేతి కంకణమైంది!

నిస్తేజమైన గ్రంథాలయాలు
పునఃప్రతిష్ట కావాలి
పరభాషా వ్యామోహ సంక్షోభాన్ని
తలవంచక తలదన్నినప్పుడు
తెలుగుభాషా పుస్తకం పరిపక్వం
గ్రంథాలయాల విజ్ఞానసారం
నలుదిశల విస్తరిస్తుంది
జ్ఞాన దీపమై వెలుగొందుతుంది!

**- అడపా రామకృష్ణ**
**95052 69091**

## అదృశ్య రూపాన్ని...

వేకువ గొంతుకని
సబ్బండ నినాదాన్ని
బద్ధకంపు మైలపోలు తీసే
అనుబంధాల బంధువుని

అందనంత ఎత్తులో అందాలని
అందలమెక్కించే లోకపుటద్దాన్ని
జీరోలను సైతం హీరోలు చేసే
ప్రాచీనవీన నిపుణుడిని

వికృత వేషాలకు
సౌందర్య తోటమాలినై
ఆదిమ రూపాలకు
ఆత్మీయ లేపనాన్నైతా
ప్రాపంచిక సేవకుడనై
ఏపుగా ఎదిగిపోతున్న
చెక్కిళ్ళ సవన్నాలనెన్నో
చక్కగా ట్రిమ్ చేస్తుంటా

గర్జించే పౌరుషాలతో
మీసాల రోషాలతో
కత్తెర కోలాటమాడి
కొత్త వేషం బహుకరిస్తా
మేనమామ ఒడిలో
జంపాలలాడే జుంపాలకు
ఆకాంక్షల అత్తరు చల్లుతా
ఆశల ఉంగరం తొడుగుతా

నా కష్టాలూ, కన్నీళ్లను
క్రమ క్రమంగా షేవ్ చేస్తూ
తుప్పట్టిన తలల తలపులకు
తైల మర్ధనమందిస్తా
అర్థ సంకోచంలో నిరర్థ జీవినై
బావురుమంటున్న వైభవాన్ని
కోట్లాది రెటీనాల ముందు
నేనో అదృశ్య రూపాన్ని

ఎవరికీ తలవంచనోళ్ళ
మెడలంచే వృత్తిసత్తా నాదైనా
నయా నాగరిక ప్రవాహంలో
ఉనికిని అడగని ప్రశ్నని ..!

**- డాక్టర్ మండల స్వామి**
**91776 07603**

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : కుమార స్వామి

**1. మహాభారతానికి ముందు పెట్టిన పేరు?**
1) భారతం 2) కౌరవ పాండవ యుద్ధం 3) కురుక్షేత్రం 4) జయం

**2. ఆంధ్ర కవితా పితామహుడు ఎవరు?**
1) తాళ్లపాక అన్నమయ్య 2) పెద్దన 3) నన్నయ 4) తిక్కన

**3. పద కవితా పితామహుడు ఎవరు?**
1) రామరాజు రంగపురాజు 2) త్యాగయ్య 3) శంకర కవి 4) నాదెండ్ల గోపన్న కవి

**4. భామా కలాపంలో ఇతివృత్తం?**
1) సత్యభామ అలక 2) సత్యభామ విరహం 3) శ్రీకృష్ణుడి అలక 4) శ్రీకృష్ణుడి విరహం

**5. గొల్ల కలాపం రచయిత?**
1) భాగవతుల రామయ్య 2) సిద్ధేంద్రుడు 3) దేవులపల్లి కృష్ణశాస్త్రి 4) విజయ రాఘవ నాయకులు

**6. బాల నాగమ్మ కథ కింది వాటిలో ఏ కోవకు చెందుతుంది?**
1) జానపద కథాగేయం 2) పురాణగాధ 3) ఇతిహాస కథ 4) వీరగాధ

**7. జిగినక అనే జతిని ఏ వాయిద్యంపై పలికిస్తారు?**
1) ఢమరుకం 2) మద్దెల 3) సన్నాయి 4) డప్పు

**8. డోలు వెళ్లి దేనితో మొర పెట్టుకొంది?**
1) మద్దెల 2) తబలా 3) రోలు 4) సన్నాయి

**9. ఎవరికి వారే ..... తీరే?**
1) గంగా 2) పీతలు 3) యమునా 4) గొర్రెల

**10. దేవాలయంపై బూతుబొమ్మలెందుకు పుస్తక రచయిత?**
1) గిడుగు రామమూర్తి 2) తాపీ ధర్మారావు 3) ఆరుద్ర 4) శ్రీశ్రీ

**11. కూచిపూడి నృత్యాన్ని రూపొందించినవారు?**
1) సిద్ధేంద్రయోగి 2) వెంపటి చిన సత్యం 3) రాజారెడ్డి 4) భాగవతుల విస్సయ్య

**12. వాడే వీడు అపరాధ పరిశోధక నవలా రచయిత?**
1) తాపీ ధర్మారావు 2) మధుబాబు 3) మల్లాది 4) దేవరాజు వెంకట కృష్ణారావు

**13. 'మృచ్ఛకటకం' నాటక రచయిత?**
1) విశాఖ దత్తుడు 2) కాళిదాసు 3) శూద్రకుడు 4) చారుదత్తుడు

**14. వేయి పడగలు నవలా రచయత?**
1) విశ్వనాధ సత్యనారాయణ 2) చాసో 3) బుచ్చిబాబు 4) గోపీచంద్

**15. యజ్ఞం కథా రచయిత?**
1) కాళీపట్నం రామారావు 2) కొడవటిగంటి 3) రాచమల్లు 4) ఎవరూ కాదు

**16. హల్‌చల్ ఏ భాషాపదం?**
1) తెలుగు 2) ఉర్దూ 3) పార్శీ 4) హిందీ

**17. కచ్చేరి అనే పదం దేనికి సంబంధించినది?**
1) సంగీతం 2) నృత్యం 3) పాట 4) కవిత్వం

**18. తెలుగు వారి శాస్త్రీయ నృత్యం?**
1) భరతనాట్యం 2) భామాకలాపం 3) కూచిపూడి 4) కథాకళి

**19. తొలి తెలుగు కవయిత్రి?**
1) విజ్జిక 2) తాళ్లపాక తిమ్మక్క 3) మొల్ల 4) అనంతాసుందరి

**20. అంతర్జాతీయ కార్మిక గీతాన్ని తెనుగించింది ఎవరు?**
1) బాలాంత్రపు నళీనీకాంతరావు 2) శ్రీశ్రీ 3) ఆరుద్ర 4) మహీధర రామ్మోహనరావు


**జవాబులు : 1.** 4) **2.** 1) **3.** 2) **4.** 2) **5.** 1) **6.** 1) **7.** 4) **8.** 1) **9.** 3) **10.** 2)
**11.** 1) **12.** 4) **13.** 3) **14.** 1) **15.** 1) **16.** 2) **17.** 1) **18.** 3) **19.** 3) **20.** 1)

## నేనో స్వేచ్ఛా విహంగమై ...

నేను ఎగరడం
ఇప్పుడే మీరు చూస్తున్నారు
గాలిపటంలా గగన విహంగంలా..
ఆకాశం కేసి అనంత దూరాల నక్షత్రాకేసి
ఇప్పుడిప్పుడే మొలుస్తున్న రెక్కలకేసి
ఒళ్లంతా కళ్ళు చేసుకుని వీక్షిస్తున్నారు
హర్షిస్తున్నారు కొందరు
కొంత ఆశ్చర్యం,
మరికొంత అసూయతో ...

అయినా ...
ఎగరడం నాకు
ఇప్పుడు జీవితమంత అనివార్యం
లెక్కలేనన్ని బాణాలు గుండెకు గుచ్చుకున్నాయి
మాటల ఈటెలు కావచ్చు
మరణాన్ని మోసుకుతెచ్చే కత్తులే కావచ్చు
కాలం నెత్తుటి పాదాల కింద నలిగిన బతుకు
నాకూ ఒకప్పుడు హృదయం ఉండేది
కలలు ఉండేవి కన్నీళ్లు ఉండేవి
బోలెడంత ప్రేమ కూడా ...
ఇప్పుడు ఒట్టిశిలను మాత్రమే
చితిలో కాలుతున్న కలను మాత్రమే!
నాలోని శూన్యత కనిపించదు
అంతరంగంలో ప్రవహించే దుఃఖమూ అగుపించదు
అవయవాల పొందిక కుదిరిన శరీరాన్ని మాత్రమే
మీరు చూస్తారు
అన్ని అవమానాల పర్వాలూ దాటి
అన్ని అనుమానాల చూపులూ దాటి
నాకు నేనుగా సమాధానపడి
నాకు నన్ను నేను సంభాళించుకుని
ఇప్పుడిప్పుడే నాకు నేనుగా ఎగరడం నేర్చుకున్నా
రంగుల పతంగమై కలల పిట్టనై
ఒక తేలికపాటి మేఘ శకలమై ..
ఇంకిన
నాలోని కన్నీటి చెమ్మని తిరిగి తోడుకొంటూ ...

**- లోసారి సుధాకర్**



## ప్రకృతి కాంత

ఓ సూర్యోదయ సమయాన
కిటికి పక్కన కూర్చొని పత్రిక తిరగేస్తున్నాను
పెరట్లోని నిమ్మకొమ్మ చిగురాకు
గాలికి ఊగుతూ వయ్యారంగా నన్ను తాకింది
ప్రకృతి కాంత పలకరింపుతో పులకరించే
నాలోని కవి హృదయం
అప్రయత్నంగా నా చూపు పెరట్లోని నిమ్మచెట్టు పైకి
పసిడి కాంతులు నిమ్మకాయల నిగనిగలు
నిమ్మకొమ్మకు కమ్మనైన తేనెపట్టు
ఆ పక్కగా విరగబూసిన మల్లె పువ్వుల చిరునవ్వు
ఆ చిరునవ్వులో సువాసన గుభాళింపు
మరో పక్క గున్నమామిడి సోయగం
పసందైన విందు చేసే పూత పిందెలు
నిండు ముత్తైదువులా మురిపించే ముగ్ధ మనోహరం
ప్రకృతి కాంతకు పురుడు పోసినట్లు
పాలుగారే మామిడి కాయలు
వేడుక చేసే ఋతువుల రాణి వసంతం
కోయిల గానాలతో ఆమని రాగాలు
మారిపోయె ఋతువులూ సంవత్సరాలూ
కాలలెన్ని మారినా 'ఇవ్వడమే' ప్రకృతి ధర్మం
ప్రకృతిలోని మర్మాలను వర్ణించతరమా!
అద్భుతం కదా!
ప్రకృతి లేనిదే మన మనుగడే లేదు
జీవులకు జీవజలము, జీవాహారము
పంచ భూతాలు పరమౌషధాలకు నిలయాలు
సర్వ మానవ సకల సంపదల ప్రదాత ప్రకృతి
ప్రకృతి సంపద పరాన్నభుక్కుల పాలు కాకూడదు
వ్యాపార ఎత్తుబడుల వశం కాకూడదు
ఆ చల్లని తల్లి సంపద మానవలందరి సొత్తు!

**- ఆవుల బసప్ప**
87902 57601

మైసూరు పర్యటన 3

# ఆకర్షించే ఆర్‌కె నారాయణ్ నివాసం

- డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
94407 32392



మైసూరులోని ఆర్‌కె నారాయణ్ గృహం

**మా** హిందూపురానికి అప్పటి జిల్లా కేంద్రమైన అనంతపురానికి మధ్యా వాతావరణంలోనే కాదు, తిండి పదార్థాలు లభించే తీరులో కూడా ఎంతో తేడా వుంటుంది! అనంతపురం నుంచి బెంగుళూరు వెళ్ళే దారిలో, పెనుకొండ తరువాత హైవే మీద సోమందేపల్లి ముందు ఎడమవైపు డౌన్‌కు తారురోడ్డు తిరుగుతుంది. అక్కడ నుంచే వాతావరణంలో తేడా అంటే ఒకటి రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గడం అనేది పెద్దలు చెప్పడమే కాదు, నాకూ అనుభవమే! అనంతపురంలో దొరకని రీతిలో హిందూపురం హోటళ్ళలో టిఫిన్లు, చిరుతిళ్లు లభిస్తాయి. ఇది బెంగుళూరు వైపు నుంచి హిందూపూర్ వైపుకు ప్రాకిన తిండి సంస్కృతి అని నా అవగాహన మేర భావిస్తున్నాను.

బెంగుళూరులో కూడా రాత్రి సమయాల్లో షాపులు మూసేసిన తర్వాత చాలా రకాల టిఫిన్ ఐటమ్స్ బళ్ళలో పెట్టి వేడి వేడిగా అమ్ముతుంటారు. మామూలు హోటళ్ళలో కూడా చాలా వైవిధ్యం ఉంటుంది. ఇదే పద్ధతి లేదా ఇంకా ఎక్కువ వైవిధ్యం మైసూరులో చూడొచ్చు. కనుక 2023 సంక్రాంతి రోజున 'తోటదమనే' (తోటలో ఇల్లు)లో భోజనానికి వెళ్ళాం. మైసూరు నుంచి బెంగుళూరుకు వెళ్ళే హైవేలో పాండవపుర దగ్గర రోడ్డు పక్కనే ఈ తోటదమనే వుంది. నిజానికి ఆ రోజు దానికి సెలవు కానీ, మా మిత్రుడి కోసం, మరో కుటుంబం కోసం ప్రత్యేకంగా పండుగ భోజనం తయారు చేశారు. వంటకాలు మరీ ఎక్కువగా లేవు గానీ, చేసినవన్నీ చక్కగా, ఏమాత్రం పడెయ్యడానికి అవకాశం లేకుండా వండడం విశేషం! ఈ తోటదమనే లోపలికి వెళ్ళేటప్పుడు మేము నలుగురం మంచి గ్రూప్ ఫోటో తీసుకున్నాం.

ఆ రోజు సంక్రాంతి, జనవరి 15. ఆ ఉదయం చెల్లాయి రాజేశ్వరి వండిన ఉప్మా తిని నేనూ, హంస చాముండి పురంలో జూ దగ్గర ఉండే కారంజి లేక్‌కి వెళ్ళాం. మైసూరులో చాలా తటాకాలున్నాయి. అందులో ఇది ఒకటి. ప్రకృతిని ఇష్టపడే మా ఇద్దరి స్వభావాన్ని గమనించి ఆ దంపతులు ఇక్కడికి వెళ్ళమని సలహా ఇవ్వడమే కాకుండా, ఐదారు కిలోమీటర్ల దూరంలో వుండే కారంజి కుంట వెళ్ళి రావడానికి ఒక ఆటోను కూడా మాట్లాడారు. కారంజి ప్రత్యేకత ఏమిటంటే ఆ నీళ్ళలో ఆహ్లాదంగా బోటులో వెళ్ళిరావచ్చు. మా ఇద్దరికీ అది అంత ఆసక్తి కలిగించలేదు. కానీ రకరకాల చెట్లు పుష్కలంగా కళకళలాడుతూ ఉన్నాయి. ఎన్నో రకాల పక్షులు, నెమళ్ళు ఒక విభాగంలో హాయిగా గంతులేస్తున్నాయి. అలాగే మరోచోట సీతాకోక చిలుకల జోన్ వుందని రాసి వుంది కానీ, మేము ఈ నెమళ్ళ హడావుడిలో పడి సీతాకోకచిలుకలని మర్చిపోయాం. సుమారు గంటన్నర అక్కడ గడిపినా ఆ సమయం చాలదనిపించింది. మర్కెరా సూర్యాస్తమయం దృశ్యాలు, కాఫీతోట అనుభవాలతో పోల్చదగ్గ ఆనందం ఇక్కడ మాకు లభించింది!

కారంజి లేక్‌కు వెళ్ళేముందు ఒక చోట ఆటో ఆపి తెలుగు దినపత్రికలు ఏమైనా ఉన్నాయా అని అడిగాను. తన వద్ద లేవు ఎదురు షాపులో వుంటాయని ఒక న్యూస్ పేపర్ స్టాల్ వ్యక్తి చెప్పారు. అక్కడికి వెళ్ళి అడిగితే తెలుగు డైలీ అయిపోయిందన్నారు. సరే అని కన్నడ పత్రికలు కొన్ని ఇవ్వండి అని అడిగి, ఇచ్చిన వాటిలో ఒక తొమ్మిదింటిని మాత్రం కొనుక్కుని దగ్గర వుంచుకున్నాం. వాటిలో 74 ఏళ్ళుగా నడుస్తున్న ప్రజావాణి, కన్నడ ప్రభ (56 ఏళ్ళు), ఉదయవాణి (30 ఏళ్ళు), విజయ కర్ణాటక (22 ఏళ్ళు), విజయవాణి (10 ఏళ్ళు) ఉన్నాయి. ఈ ఐదు (నాకు పేర్లు తెలిసిన) పత్రికలను కొన్నాను. అవి కాక మరో నాలుగు లోకల్ పేపర్లు. సంయుక్త కర్ణాటక అక్కడ కనబడలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదలైన డెక్కన్ హెరాల్డ్ గ్రూప్ ప్రజావాణి దినపత్రికని, కన్నడ దినపత్రికను సంజవాణి సాయంకాల దినపత్రికను నిర్వహిస్తోంది. ఒకప్పుడు ఈ మూడు దినపత్రికలు సర్క్యులేషన్‌లో అగ్రస్థానంలో ఉండేవి. ఇప్పటికీ గాంభీర్యంగా నడిచే పత్రికల సముదాయమిది. ఇండియన్ ఎక్స్ ప్రెస్ వారి 'కన్నడ ప్రభ' కూడా ఆంధ్రప్రభలాగా

వేరే వారికి అమ్మివేయబడింది. ఏషియా నెట్ ను నిర్వహించే రాజ్యసభ సభ్యులు రాజీవ్ చంద్రశేఖర్ ప్రస్తుతం కన్నడ ప్రభకి యజమాని. ఇది యాభై ఆరేళ్ళుగా నడుస్తున్న పత్రిక.

టి.ఎ.పాయ్ కుటుంబానికి చెందిన 'ఉదయవాణి' మూడు దశాబ్దాలుగా వస్తోంది. టైమ్స్ ఆఫ్ ఇండియా నిర్వహించే కన్నడ పత్రిక చూడగానే కొంత తికమకకు గురయ్యాను. 'కాంతార' సినిమా స్టార్ సువర్ణ ఛానల్‌లో ఆ రోజు సాయంకాలం ప్రసార మవుతోంది కనుక పత్రిక పేరుని 'విజయ కర్ణాటక' కాకుండా 'సువర్ణ కర్ణాటక' అని తొలి పేజీలో మార్చుకున్నారు. మొదట ఈ పత్రిక పేరు ఎప్పుడు మారింది, ఎందుకు మారింది అని నాకు సందేహం కలిగింది, కొంత కన్ఫ్యూజన్‌కు గురయ్యాను. కాస్త నెమ్మదిగా పరికిస్తే గానీ టైమ్స్ ఆఫ్ ఇండియా మార్కు బిజినెస్ గిమ్మిక్ అని బోధపడలేదు!

విఆర్ఎల్ యజమాని, పారిశ్రామికవేత్త విజయ సంకేశ్వర్ తొలుత ప్రారంభించిన విజయ కర్ణాటక, విజయ్ టైమ్స్ దిన పత్రికలు బాగా విజయవంతమయ్యాయి. పదేళ్ళ క్రితం టైమ్స్ ఆఫ్ ఇండియా పైకమిచ్చి ఈ రెండింటినీ కొనేసింది. విజయ కర్ణాటకను కొనసాగిస్తూ విజయ్ టైమ్స్ చందాదారులను, పాఠకులను తన వైపుకు మార్చుకుని ఆ ఇంగ్లీష్ పత్రికను ఆపివేసి తను బలపడింది. ఈ పాచికతో కర్ణాటకలో కన్నడ ఇంగ్లీషు దినపత్రికల రంగంలో డెక్కన్ హెరాల్డ్ గ్రూపును దెబ్బతీసి మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ఆ పత్రికలను అమ్మిన డాక్టర్ విజయ సంకేశ్వర్ మరింత లాఘవంగా పదేళ్ళ క్రితమే 'విజయవాణి' అని మరో కన్నడ దినపత్రికను స్థాపించారు. ఇప్పుడు కన్నడ దినపత్రికల అగ్రస్థానం విజయ కర్ణాటక, విజయవాణి మధ్య దోబూచులాడుతూ వుంటుంది.

ఆరోజు ఆదివారం కనుక, ఆ సంచికలనే చూశాను కనుక ఎడిట్ పేజీ తీరుతెన్నుల గురించి వ్యాఖ్యానించడం సబబు కాదు! అలాగే ఆ రోజు సంక్రాంతి కనుక అన్ని పత్రికలూ ఎక్కువ పేజీలతో రంగులతో కళకళలాడుతూ ఉన్నాయి. ప్రజావాణి, ఉదయవాణి ఆరేసి రూపాయలు కాగా; కన్నడ ప్రభ ఏడు రూపాయలు, విజయ కర్ణాటక, విజయవాణి 5 రూపాయలు. కన్నడ ప్రభలో ఆదివారం సంచికలో జైపూర్ లిటరరీ ఫెస్టివల్ గురించి ఒక ఇంటర్వ్యూ కనబడింది. విజయ కర్ణాటకలో లవ్ లైఫ్ అని 'అడ్వర్టోరియల్ ఎంటర్ టైన్‌మెంట్ ఇండస్ట్రీ ప్రమోషనల్ ఫీచర్' కనబడింది. చెప్పుకున్న రీతిలో సరంజామా దొరకకపోతే మిగతా విషయాలు ఇస్తున్నట్టున్నారు. ఇదే పేజీలోనే 'సాహిత్యద అంతిమ గురి మానవీయతే' పేరున కన్నడ–తమిళ అనువాదకులు కాళిముత్తు నల్లతంబితో ఒక ఇంటర్వ్యూతో పాటు, సంక్రాంతి గురించి ఒక అర పేజీ వ్యాసం కనబడింది. ఉదయవాణి పత్రికలో ఎనిమిది పేజీల సినిమా ప్రకటనలు మరో విశేషం. తెలుగు పత్రికల్లాగ స్థానిక వార్తల అనుబంధాలు, వీక్లీ సైజులో ఆదివారం సంచికలు కన్నడ పత్రికల్లో లేవు!

ఈ ఐదు పత్రికలు కాకుండా నాకు తెలియని మరో నాలుగు స్థానిక (?) పత్రికలను ఎంచుకున్నాను. అవి 'ప్రతినిధి' (63 సంవత్సరాలు). 'ఆందోళన' (51 సంవత్సరాలు). 'మైసూరు మిత్ర' (42 సంవత్సరాలు). 'కన్నడిగర ప్రజానుడి' (23 ఏళ్ళు). ఈ పత్రికలు ఇంకా స్టార్ ఆఫ్ మైసూర్ అనే పత్రిక కూడా మైసూరు ప్రాంతంలో ప్రధానంగా నడుస్తున్నాయి. కన్నడం చదవడం నాకు పెద్దగా రాకపోయినా ఆ పత్రికలో కనబడే ప్రకటనలు, ఫొటోలను బట్టి ఆ పత్రికలు ఏ వర్గమో మనం తెలుసుకోవచ్చు. ఆ పెద్ద పత్రికలకన్నా ఈ స్థానిక పత్రికలు కొంచెం తక్కువ పేజీలతో మూడు, నాలుగు రూపాయల ధరతో పుష్టిగానే నడుస్తున్నాయి. అయితే అన్ని పత్రికలు రంగుల్లో కళకళలాడడం సంక్రాంతి విశేషం కావచ్చు.

ఆదివారం రోజు సాయంకాలం ఉమేష్‌కు నాకూ బాచ్ మేట్ అయిన, నాలుగైదేళ్ళ క్రితం పదవీ విరమణ చేసిన, ఉమేష్ ఒకప్పటి కొలీగ్ శ్రీనివాస ప్రసాద్ ఇంటికి వెళ్ళాము. మిత్రుల కుటుంబాన్ని కూడా ఆహ్వానించి సాదరంగా భోజన ఆతిథ్యాన్ని ఇచ్చిన సహృదయులు శ్రీనివాస్, సుకన్య దంపతులు. శ్రీనివాస్ ప్రసాద్ ఇంట్లో కనబడ్డ చాలా ఇంగ్లీషు పుస్తకాలు వారు మంచి చదువరి అని, పుస్తకాలు చక్కగా భద్రపరుచుకుంటారని చూడగానే బోధపడింది. ఆయన ఆకాశవాణిలో అనౌన్సర్‌గా ఉద్యోగంలో చేరి, తర్వాత ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అయిన సైన్సు రచయిత, సాహిత్యం సినిమాలంటే ఆసక్తి ఉన్న వ్యక్తి వారు.

ఇలా నాలుగు రోజులు గడిచిపోయింది. మేము బయల్దేరే జనవరి 16 వచ్చేసింది. ఆరోజు ఉదయం మేమిద్దరం, సుశీల నాగరాజు దంపతులు మైలారి పేరున ప్రాచుర్యంలో ఉన్న ఉపాహారశాలకు వెళ్ళాలని అనుకున్నాం. వారొక వైపున నుంచి, మేము ఇంకొక వైపు నుంచి ఒకే పేరుతో ఉన్న రెండు హొటళ్లను రెండు ప్రాంతాలకు చేరడం వల్ల కొంత గందరగోళం, కొంత సమయం వృథా ఏర్పడ్డాయి. నాకయితే ఆ హొటల్‌లో తిన్న దోసె పెద్దగా నచ్చలేదు. మళ్ళీ ఆకాశవాణిలో వచ్చి కలుస్తామని సుశీలా దంపతులు వెళ్ళిపోగా, నేను నా మిత్రుడి కోసం రామకృష్ణ ఆశ్రమం దగ్గర దిగి పోగా హంస రాజేశ్వరీ వాళ్ళింటికి వెళ్ళింది. తర్వాత అక్కడి నుంచి రాజేశ్వరితో కలిసి సిల్కు ఫ్యాక్టరీకి వెళ్ళి హంస మైసూర్ సిల్క్ చీర కొనుక్కుంది.

1986–87 కాలంలో ఎమ్మెస్సీ అయిన తర్వాత నేను కొన్ని నెలలపాటు హిందూపురానికి నలభై కిలోమీటర్ల దూరంలో కర్ణాటకలో ఉండే బాగేపల్లిలోని నేషనల్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగం చేశాను. డబ్బులకు కటకట కనుక ఎమ్ ఫిల్ మధ్యలో ఈ ఉద్యోగం చెయ్యాల్సి వచ్చింది. ఆ కాలంలో ఆంధ్రప్రదేశ్ లో టెంపరరీ లెక్చరర్ కు ఆరువందలు ఇస్తుండగాబీ కర్ణాటకలో అదే ఉద్యోగానికి 1,980 రూపాయలు ఇచ్చేవారు. కనుక నేను అక్కడికి పోయాను. హేతువాది, న్యూక్లియర్ శాస్త్రవేత్త, గాంధేయవాది, సత్యసాయిని వ్యతిరేకించిన పోరాటశీలి డా.

హెచ్. నరసింహయ్య నేతృత్వంలో నడిచే విద్యాసంస్థ అది. ఆ కాలంలో వారిని రెండుసార్లు కలవడం, వారి 'సైన్స్ అండ్ హ్యూమనిజం' వ్యాసాన్ని తెలుగులోకి తర్జుమా చేసుకోవడానికి అనుమతి కోరడం కూడా జరిగింది. అలా అనువాదం చేసిన వ్యాసం తెలుగు అకాడమి మాసపత్రిక 'తెలుగు'లో అచ్చయ్యింది. ఇప్పుడు ఆ వ్యాసం నా 'సైన్సు సాహిత్యం సమాజం' సంకలనంలో ఉంది.

బాగేపల్లి నేషనల్ కాలేజీలో అప్పట్లో లెక్చరర్‌గా పనిచేస్తున్న బి.పి.విజయ్ కుమార్ ఇటీవలే పదవీ విరమణ చేసి మైసూరులో సెటిలైన విషయం ముందురోజు అనుకోకుండా గుర్తుకు వచ్చింది. బాగేపల్లి మిత్రుడిని ముందురోజే సంప్రదించి విజయకుమార్ కాంటాక్ట్ నెంబర్ తీసుకుని మాటాడి ఉన్నాను. విజయ్ కుమార్ ఆకాశవాణి దగ్గరున్న రామకృష్ణ ఆశ్రమం దగ్గర వేచి వుంటానని చెప్పారు గనుక, నేను అక్కడికి వెళ్ళాను. మైసూరు మహరాజ్‌కు గురుతుల్యులైన స్వామి వివేకానంద స్ఫూర్తితోనే మైసూర్ మహారాణి బెంగుళూరులో టాటా ఇనిస్టిట్యూట్‌కి 371 ఎకరాల భూరి విరాళం ఇచ్చారు. కనుకనే జంషెడ్జీ టాటా ఆ సంస్థను బొంబాయిలో కాకుండా బెంగుళూరులో ప్రారంభించారు. అదే సంస్థ నేడు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌గా పేరు గాంచింది. తొమ్మిది దశాబ్దాలుగా నడుస్తున్న రామకృష్ణాశ్రమం మైసూరు ఆకాశవాణికి చాలా దగ్గరగా రకరకాల పూల మొక్కలతో విశాలమైన ప్రాంగణంతో కనబడింది. ఆ పరిసరాల్లో ఒక 20 నిమిషాలు గడిపి బయటకు రాగానే మా మిత్రుడు విజయ్ కుమార్ వచ్చారు.

కాస్త మాటలయ్యాక దగ్గరనే ఉన్న, సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత ఆర్.కె.నారాయణ్ నివసించిన ఇంటికి వెళ్ళాం. జన్మతః తమిళుడయిన రాసిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణ స్వామి 'ఆర్.కె.నారాయణ్'గా ప్రసిద్ధులయ్యారు. వీరు, ముల్కరాజ్ ఆనంద్, రాజారావులను కలిపి 'ఆధునిక ఆంగ్ల భారతీయ వచన రచయితల త్రయం'గా పేర్కొంటారు. నారాయణ్ తండ్రి మహరాజా కాలేజి హైస్కూలుకు బదిలీ కారణంగా 1920వ దశకంలో మైసూరు తరలి వెళ్ళారు. సుప్రసిద్ధ కార్టూనిస్టు ఆర్.కె.లక్ష్మణ్ వీరి తమ్ముడు. ఆర్.కె.నారాయణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. భార్య ఐదేళ్ళ వైవాహిక జీవితం తర్వాత అంటే 1939లో కన్నుమూశారు. తర్వాత ఆయన మరో పెళ్ళి చేసుకోలేదు. ఒకే కూతురు, ఆమె పేరు హేమా నారాయణ్.


స్వామి అండ్ ఫ్రెండ్స్, బాచిలర్ ఆఫ్ ఆర్ట్సు, ది ఇంగ్లీష్ టీచర్, ది ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్, ది గైడ్, ది రిటర్న్ ఆఫ్ బాపు వంటివి వీరి ప్రఖ్యాత రచనలు. 95 ఏళ్ళ వయసులో 2001లో ఆయన కన్నుమూశారు. ఆయన అసలైన రచనా జీవితం గడిపింది మైసూరులోనే. 1953లో ఎంతో ఇష్టంగా మైసూర్‌లో కట్టుకున్న ఇంట్లో చాలా కాలం ఉన్నారు. ఆయన సంతతి 2011లో ఈ ఇంటి అమ్మేశారు! 2016లో కాంట్రాక్టరు ఆ భవనం పడగొట్టాలని సిద్ధమైనప్పుడు స్థానిక రచయితలు, కళాకారులు దీన్ని వ్యతిరేకించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. తత్కారణంగా ఆర్.కె. నారాయణ్ మూడు గదుల రెండంతస్తుల ఇల్లు భద్రపరచబడింది. ఆయన పుస్తకాలు,. ఫొటోలు, పురస్కార పత్రాలు, దుస్తులు, కళ్ళజోడు వంటివి ఇక్కడ ఉన్నాయి. ఈ ఇల్లు గురించి పెద్దగా ప్రచారం లేనట్లు నా ఫేస్‌బుక్ పోస్టుకు లభించిన స్పందనబట్టి నాకు బోధపడింది. నాక్కూడా ఫేస్బుక్ మిత్రుడు ఆర్ఎస్ వెంకటేశ్వరన్ ద్వారా ఈ ఇల్లు గురించి తెలిసింది.

ఇక్కడ రేడియో స్టేషన్ గురించి చెప్పుకోవాలి. అప్పట్లో సంస్థానాలు కూడా రేడియో స్టేషన్లు ఉండేవి. హైదరాబాద్‌లోను, ఔరంగాబాద్‌లోను నైజాంకు రెండు రేడియో కేంద్రాలుండగా; మైసూరు, తిరువాంకూర్ సంస్థాలకు చెరొకటి ఉండేవి. మైసూరు స్టేషన్‌ను తొలుత 1936లో మైసూరు కళాశాల లెక్చరర్‌గా ఉంటూ సొంత ఆసక్తి మీద మొదలు పెట్టారు. 1942 లో మైసూరు రాజా నిర్వహణలోకి మారి 1950 దాకా కొనసాగింది. పిమ్మట భారత ప్రభుత్వం దాన్ని బెంగళూరుకు తరలించింది. 1974లో మళ్ళీ ఆకాశవాణి అక్కడ మొదలైంది. ఆకాశవాణి అనే మాటను తొలిసారి ఈ రేడియో స్టేషన్‌కే వాడారు. దీనికి ఈ పేరును రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ అన్న గోపాలకృష్ణమాచారి పెట్టారని అంటారు. ఇక్కడ స్టుడియో షడ్భుజి రూపంలో తక్కువ మానవ వనరులతో ఎక్కువ రికార్డింగులు పర్యవేక్షించే సదుపాయం ఉంది. ఇలాంటి ప్రత్యేక రీతి స్టుడియో మనదేశంలో మరెక్కడా లేదు. నిజానికి సంస్థానం కాలంలో రాజనర్తకి నృత్యం చేసే స్థలాన్ని స్టూడియోగా మార్చారు.

ఆకాశవాణి అభిమాని అయిన నా ఫిజిక్స్ లెక్చరర్ మిత్రుడు ఆకాశవాణికి రావడానికి ఉత్సాహం చూపారు. అలాగే సుశీలా నాగరాజ దంపతులు కూడా ఆకాశవాణి ప్రాంగణానికి వచ్చారు. కాసేపటికి హంస, రాజేశ్వరి గార్లు కూడా వచ్చారు. ఆరోజు ప్రత్యేకత ఏమిటంటే, మైసూర్ ఆకాశవాణి మృదంగ విద్వాంసులు శివశంకర స్వామి నిర్వహించే 'లయసంభ్రమ' అనే ధారావాహిక 50వ ఎపిసోడ్ ప్రసారం కావడం! కనుక 'లయసంభ్రమ' విందుకు మేము కూడా హాజరయ్యాం. అందరితో కలిసి భోంచేసి, మధ్యాహ్నం 2.30కు బయల్దేరి, మైసూరు జంక్షన్ స్టేషన్‌లో సిద్ధంగా ఉన్న కాచిగూడా మైసూరు ఎక్స్‌ప్రెస్ ఎక్కి, జనవరి 17 ఉదయం 5.30కు హైదరాబాదు చేరుకున్నాం! **(సమాప్తం)**



**రచయత నాగసూరి దంపతులతో వారి మిత్రులు ఉమేష్, రాజేశ్వరి**




# నాటక కళా దర్పణం - గుంటూరు కళా పరిషత్



- చెరుకూరి సత్యనారాయణ

**తె**లుగు నాటక కళ అంతరించిపోతుందనే వాదుకు భిన్నంగా పాత గుంటూరు జిల్లాలో అనేక నాటక ప్రదర్శనా సంస్థలు పనిచేస్తున్న విషయం నాటకం పట్ల ఆసక్తి గల పాఠకులకు తెలిసే వుంటుంది. వీటిలో గుంటూరు కళా పరిషత్ (గుంటూరు), పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవాలు (ఎడ్లపాడు), కొండవీటి కళా పరిషత్ (లింగారావుపాలెం), పర్చూరి రఘుబాబు స్మారక నాటకోత్సవాలు (పల్లెకోన), ప్రగతి కళా పరిషత్ (సత్తెనపల్లి), ఎన్.టి.ఆర్ కళా పరిషత్ (ఒంగోలు), శ్రీకృష్ణ కళా పరిషత్ (ఒంగోలు), రంగస్థలి (నర్సరావుపేట), రోటరి అండ్ శ్రీకారం కళా పరిషత్ (మార్టూరు), కాకతీయ కళా పరిషత్ (నాగభైరుపాలెం), కర్షక కళా పరిషత్ (గణేశు నిపాలెం), చిలకలూరిపేట కళా పరిషత్, లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ (వరగాని), కళల కాణాచి (తెనాలి), కోన ప్రభాకరరావు కళా పరిషత్ (బాపట్ల), రంగస్థలి (తెనాలి) లాంటి సంస్థలు ప్రతి సంవత్సరం నాటకోత్సవాలు నిర్వహిస్తుండగా మరికొన్ని వివిధ కారణాల వల్ల ఆగిపోయాయి. కాగా ఉభయ ప్రజా నాట్యమండలుల శాఖలు రాష్ట్ర వ్యాపితంగా అప్పుడప్పుడు వరుస నాటకాలు నిర్వహిస్తున్నాయి.

ఆంధ్ర ప్రజా నాట్యమండలి వారు 1990 నుంచి సఫ్దర్ హష్మి పేరిట (SHOT) వీధి నాటకాలు నిర్వహిస్తున్నారు; అప్పాజోస్యుల, కందాళం ఫౌండేషన్ వారు స్థానిక కళా సంస్థలతో కల్సి ప్రతి సంవత్సర ఒక్కోచోట కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కేవలం హాస్య నాటికలే నిర్వహించే సుమధుర కళా పరిషత్ విజయవాడలో వుంది. జానపద కళా రీతుల్ని ప్రదర్శించే సంస్థ కర్నాటి లక్ష్మీనర్సయ్య గారి మృతితో ఆగిపోయింది. గుంటూరు జిల్లాలోనే వినుకొండ, అద్దంకిల్లో కూడా నాటకోత్సవాలు జరుగుతున్నాయి. శాంతారావు, కాళిదాసు, దేవేంద్ర, పద్మారావుల సారధ్యంలో రైతు రాజ్యం, హాలికులూ సేమమా, విషవలయంలో భారతం లాంటి నాటకాలు రైతు సమస్యలపై డజన్ల సంఖ్యలో ప్రదర్శించిన గుంటూరు జిల్లా ప్రజా నాట్యమండలి కూడా ఎక్కువగా ప్రదర్శనలివ్వటం ఆపింది. ఇలాంటి నేపథ్యంలో 25 సంవత్సరాలుగా నాటకోత్సవాలు నిర్వహిస్తున్న గుంటూరు కళా పరిషత్ తన రజతోత్సవం మార్చి 11న నిర్వహించుకోవటమేగాక ఆ సందర్భంలో 'పాకుడురాళ్ళు' నాటక ప్రదర్శన ఏర్పాటు చేయటమే గాక 'దర్పణం' పేరుతో ఒక సావనీర్‌ను వెలువరించింది.

పెద్దపెద్ద సంస్థలు కూడా నిరవధికంగా సాగించలేని నాటక ప్రదర్శనల్ని నలుగురు వామపక్ష సానుభూతిపరులు, నాటకరంగం పట్ల అంకితభావం వున్న మరో నలుగురు కళాభిమానులతో పాతికేళ్లుగా తమ ప్రస్థానాన్ని సాగించిన గుంటూరు కళా పరిషత్ అభినందనార్హం. ఈ సందర్భంగా వారు ప్రదర్శింపజేసిన నాటకం, ప్రచురించిన సావనీర్ పాఠకులకు పరిచయం చేయదగ్గ స్థాయిలో ఉన్నాయి.

ప్రసిద్ద నవలా రచయిత రావూరి భరద్వాజ 1978లో రాసి 2013లో జ్ఞానపీఠ అవార్డు సాధించిన 'పాకుడురాళ్ళు' నవల ఆధారంగా తెలుగు ఏమాత్రం రాని నస్రీన్ ఇషాక్ దర్శకత్వంలో సుమారు 40 మంది కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకం 110 నిముషాలు నడిచినా కిక్కిరిసిన వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రేక్షకులు మంత్రముగ్ధులై కూర్చున్నారు. కథానాయిక మంజరి పాత్రలో 'భావన వాన పందల్' నటన అమోఘం, అనితరం. ఎన్ని అవార్డులకైనా పాత్రం. ఐదు పాత్రల్లో 'ప్రవీణ్ కారికాడు', నాలుగు పాత్రల్లో సంజీవ్ పసల చక్కగా నటించారు. లావణ్య, విష్ణుప్రియ కూడా రెండేసి పాత్రల్లో ఇమిడిపోయారు. నవల దమ్మును మించి నాటకీకరణ ఉంది. 600 పేజీల నవలని 10 యూనిట్లుగా కుదించటమే

గాక అంతగా ప్రేక్షకులు లీనమయ్యేట్లు చేసిన దర్శకురాలు నస్రీన్ ఇసాక్, సాంకేతిక సహకారం అందించిన నిపుణులు అభినందనీయులు.

అనేక పాత్రలు, అనేక సంఘటనలు ఉన్న నవలని నాటకంగా మల్చటం, తెలుగు సరిగా రాని భాషేతర యువతీ యువకులతో ఒక్క ఉచ్చారణ దోషం లేకుండా నడిపిన దర్శకులురాలు నస్రీన్ మాటలకందని ప్రతిభ కనబరిచారు. ఈమె బొంబాయిలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నుంచి పట్టభద్రురాలై అనేక నాటక సంస్థల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ పనిచేశారు. అనేక ప్రసిద్ధ ఇంగ్లీషు నాటకాల్ని హిందీలోకి అనువదించి, ప్రదర్శించారు. గతంలో చలం మైదానం నవల్ని కూడా నాటకీకరణ చేసి ప్రదర్శించారు. కాని ఆ విషయం ఎందుకో ప్రచారం కాలేదు.

ఇటీవల కాలంలో గుంటూరు ప్రేక్షకుల్ని ఇంతగా ఆకర్షించిన మరో ప్రదర్శన లేదు. 25 సంవత్సరాల కాలంలో టిక్కెట్లు కొని ప్రదర్శన తిలకించే పద్ధతిని గుంటూరు కళాభిమానులకు అలవర్చటమేగాక ఏ సంవత్సరమూ, ఏ ప్రదర్శనా చెప్పిన సమయానికి నిముషం కూడా తేడా లేకుండా పాటించిన సమయ పాలన, అభినందనీయం. బండ్ల పూర్ణ, నాయుడు గోపి, పెద్దబ్బయ్య, వల్లూరి తాండవ కృష్ణ, అమ్మిశెట్టి శివ తదితర మిత్రులు అభినందనీయులు.

ఇక ప్రముఖ నాటక, కథా రచయిత, అరసం కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, వల్లూరి తాండవకృష్ణల సంపాదకత్వంలో వెలువడిన 'దర్పణం' గురించి చెప్పుకోవాలంటే ఇది తెలుగు నాటక రంగానికి నిజంగా దర్పణమే. నాటకానికి సంబంధించిన వివిధ విషయాలపై రిఫరెన్సు గ్రంథంగా పేర్కొనగల స్థాయి ఇందులో చేర్చిన వ్యాసాలకు, రచయితలకు వుంది. తెలుగు నాటక రంగ చరిత్రకు చెందిన సమస్త విషయాలతోపాటు, నాటక రచయితల, నటుల, నటీమణుల ఛాయా చిత్రాలు సేకరించి ప్రచురించిన సంపాదకుల కృషి ప్రశంసాపాత్రం.



తెలుగు నాటకం ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు నాటక రంగానికి చెందిన రచయితలు, దర్శకులు, నటులు ఒక్కరిది కూడా లేదనిపించుకోకుండా 253 మంది అరుదైన ఛాయా చిత్రాలతో పాటు మరో 27 ఛాయా చిత్రాలు, వారి సంస్థ పాతికేళ్ల చరిత్రకు సాక్షిగా మరో వంద చిత్రాలతోపాటు అనేక పరిశోధనా వ్యాసాలు సేకరించటంలో వల్లూరి ద్వయం కృషి అనితరం.

నాటకరంగంలో గుంటూరు జిల్లా పాత్రపై బండారు రామస్వామి గారి వ్యాసంలో 1880 నుంచి వివిధ కాలాల్లో పనిచేసిన 53 నాటక సంస్థల వివరాలు సమగ్రంగా పొందుపరిచారు, 'సంస్కృతి అంటే ఏమిటి?' రావు కృష్ణారావు, 'ఏది ఉత్తమ కళో' సంజీవదేవ్, 'తెలుగు పౌరాణిక నాటకాల' గూర్చి డా॥ పి.యస్.ఆర్ అప్పారావు, 'పద్య నాటకాలు' గూర్చి పాతూరి శ్రీరామశాస్త్రి 'తెలుగు నాటకరంగం' గూర్చి కూర్మా వేణుగోపాలస్వామి, బాలోత్సవాలపై వి.ఆర్. రాసాని, 'నాటక సాహిత్యం' గూర్చి కొడవటిగంటి, 'తెలుగు నాటకరంగ దర్శకుల'పై వాడ్రేవు సుందరరావు వ్యాసాలు దాచుకోదగినవి. ఎపిక్ థియేటర్‌పైన, కథా నాటికలపైన డా॥ కందిమళ్ల సాంబశివరావు రచనలు, కన్యాశుల్కంపై ఆచార్య దివాకర్ల వెంకటావధాని, రంగస్థల శిక్షణపై చాట్ల శ్రీరాములు గారి వ్యాసాలు, బాల సాహిత్యం – నాటక ప్రాధాన్యతపై వల్లూరి శివప్రసాద్, ఒపెరాపై మధురాంతకం నరేంద్ర, నాటక పోటీలపై మలిరెడ్డి బాబి, రేడియో నాటకంపై డా॥ అనంత పద్మనాభరావుల వ్యాసాలు, శ్రీశ్రీ గారి వ్యాసం ఉన్నాయి. ఇన్ని అపురూపమైన విషయాలు ఒక్కచోట ప్రోది చేసిన ఈ సంకలనం తెలుగు నాటకంపై ఏ మాత్రం ఆసక్తి వున్నా వారైనా దగ్గరుంచుకోవాలి. వీటితోపాటు పాపినేని శివశంకర్ కథ, విశ్వనాథ కవిరాజు నాటిక, పెద్దింటి అశోక్ కుమార్ స్కెచ్, బండ్ల మాధరవావు కవిత, మేడిచర్ల పాట కూడా ఈ సావనీర్‌లో చేర్చబడ్డాయి. బి.పూర్ణ, సెల్ : 89190 14999 నెంబర్‌ని సంప్రదించి 1/4 డెమి సైజులో వున్న ఈ 330 పేజీల సావనీర్‌ని పొందవచ్చు. ■



# తెలుగు చిత్ర'పటం'పై చెరగని సంతకం బాలి

**జననం : 29 సెప్టెంబరు 1941 మరణం : 17 ఏప్రిల్ 2023**

**ఐదు దశాబ్దాలుగా తెలుగు పత్రికలను, పుస్తకాలను తన అందమైన రేఖాచిత్రాలతో సౌందర్యవంతం చేసిన చిత్రకారుడు బాలి. ఆయన అసలు పేరు మేడిశెట్టి శంకరరావు. దేశవిదేశాల్లోని తెలుగువాళ్లకు, గీతల్ని, రాతల్ని ప్రేమించేవారికీ బాలిగానే ఆయన సుపరిచితం. లక్షల చిత్రాలు గీసిన లక్షణమైన చిత్రకారునిగా, కార్టూనిస్టుగా, కథారచయితగా తన జీవితాన్నే చిత్రంగా మలచుకున్న కళాకారుడు బాలి. విద్యార్థి దశలోనే 1958 నాటి ఆంధ్ర (వార) పత్రికలో 'ఉబుసుపోక' అనే శీర్షికతో వేసింది తొలి చిత్రమైనా, 1970 నుంచే విస్తారంగా చిత్రాలు గీస్తున్నారు. అమ్మ అన్నపూర్ణమ్మ అందంగా తీర్చిదిద్దే ముగ్గుల్ని చూసి చిత్రకళా సాధనకు ఉపక్రమించిన 'బాలి' ఏ గురువు దగ్గరా శిక్షణ పొందకుండానే స్వయంకృషితో ఎదిగారు.**

బాలి స్వస్థలం విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి. అమ్మ అన్నపూర్ణమ్మ, నాన్న లక్ష్మణరావు. అప్పటి బ్రిటీష్ పాలనలో ఆర్మీలో తండ్రి సుబేదార్‌గా ఉండేవారు. ఉద్యోగరీత్యా సింగపూర్, ఇటలీ, మలయా తదితర దేశాలు తిరిగేవారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో అమ్మే ధైర్యం చెప్పేది. తండ్రి మరణంతో అనకాపల్లిలోని మామయ్య ఇంటికి చేరారు. అక్కడే బాలి చదువు మొదలయ్యింది. బాలి తండ్రి కూడా చిత్రకారుడే! ఆయన చనిపోయిన తర్వాత కానీ, ఆ విషయం తెలియదు ఇంట్లో వారికి. తండ్రికి సంబంధించిన పెట్టెల్ని బ్రిటీష్ అధికారులు పంపితే– పన్నెండేళ్ల తర్వాత తెరిచి చూస్తే డబ్బు, ఇతర వస్తువులతోపాటు, బొమ్మలేయడానికి ఉపయోగించే చైనా రంగుల కేకులు, కుంచెలు, ఆయన చిత్రించిన ప్రకృతి దృశ్యాలూ కన్పించాయి. ఈ ల్యాండ్‌స్కేప్‌లు బాలిలో చిత్రకారుడికి బీజం వేశాయి.

తల్లి అన్నపూర్ణమ్మ ఎంతో అందంగా ముగ్గుల్ని తీర్చిదిద్దడాన్ని బాలి చిన్నప్పటి నుంచీ మక్కువతో చూసేవాడు. అదే తన చిత్రకళకు ప్రేరణ అనేవారు ఆయన. "నేను వేసిన బొమ్మల్ని మా టీచర్లు అంతగా మెచ్చుకోకపోయినా అమ్మ మాత్రం వాటిలో లోపాలను సరిద్దుతూ మురిపెంగా చూసేది. అమ్మ పడుకున్నప్పుడు వెనుకనుంచి చూసి ఆ భంగిమనే చిత్రంగా గీశాను. ఇప్పటికీ మహిళల చిత్రాలు గీసేటప్పుడు నాకు తెలియకుండానే అమ్మ గుర్తొచ్చి, ఆ ప్రభావం చిత్రాల్లో కన్పిస్తుంటుంది." అని గతంలో ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు బాలి.

"చదువుతో పాటు చిత్రకళాభ్యాసం చేస్తూనే ఇంటర్మీడియట్ పూర్తి చేశాను. కుటుంబ పోషణకు ఉద్యోగాల వేట మొదలుపెట్టాను. ఆ సమయంలో చిత్రకళా సాధనని కొంచెం పక్కన పెట్టాను. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, పబ్లిక్ వర్క్స్ విభాగంలో క్లర్క్ ఉద్యోగంలో చేరాను. అయితే బొమ్మలు గీయడం ప్రాక్టీస్ మళ్లీ ఎక్కువైంది. పత్రికల్లోనూ నేను గీసిన చిత్రాలు వస్తుండేవి. 1970లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఒక పిల్లల నవల రాసి, దానికి బొమ్మలు కూడా నేనే గీసి పంపించాను. అప్పటి ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్యశర్మ దానిని పత్రికలో సీరియల్‌గా ప్రచురించడమే కాకుండా.. తనను కలవాల్సిందిగా కబురుపెట్టారు. అక్కడ కెరీర్ బాగుంటుందని భావించి, ప్రభుత్వోద్యోగాన్ని వదిలేశాను.

ఆంధ్రజ్యోతి వారపత్రిక, యువ, జ్యోతి మాసపత్రికల్లో రకరకాల కథలకు నా చిత్రాలు ఎక్కువగా వచ్చేవి. అయితే వృత్తిలో మాత్రం స్థిరపడలేదు. ఈలోగా ఈనాడు పత్రిక ప్రారంభమై, అందులో నన్ను స్టాఫ్ ఆర్టిస్టు/ కార్టూనిస్టుగా తీసుకున్నారు. అయితే, ఏడాదిన్నరకే బయటకు వచ్చేశాను. వెంటనే ఆంధ్రజ్యోతిలో స్టాఫ్ ఆర్టిస్టుగా అప్పటి ప్రధాన సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు తీసుకున్నారు. ఆ సంస్థలో 12 ఏళ్లు పనిచేశాను.

బొమ్మలు గీసే మొదట్లో దిగువన శంకర్, శంకరరావు అని సంతకం పెట్టేవాడిని. అయితే అప్పటికే బొమ్మలు గీస్తున్న శంకర్‌లు ఇద్దరున్నారు. దాంతో పురాణం సుబ్రహ్మణ్యశర్మ నాకు 'బాలి' అని నామకరణం చేశారు. నాకూ అది వినూత్నంగా, వైవిధ్యంగా అన్పించింది. అప్పట్నుంచీ నా చిత్రాలకు 'బాలి' అనే పేరే స్థిరపడిపోయింది. నా అసలుపేరు కన్నా ఈ పేరే నన్ను ఎక్కువ ప్రాచుర్యంలో ఉంచుతోంది."

"కార్టూన్‌ని ఏ అంశంపై గీయాలో ముందుగా అవగాహన చేసుకుంటాను. నిజానికి బొమ్మ గీయడం, అందులో యాక్షన్ నాకు కొత్తకాదు. దాన్లో ఫన్ పేల్చడంలోనే కష్టమంతా ఉంటుంది. కార్టూన్‌లో రాసిన మాటలు చక్కగా అందరూ చదివి, ఆహ్లాదంగా నవ్వుకునేలా ఉండాలి. ఇదంతా కొంత వ్యవధిలోనే జరిగిపోవాలి. అలాంటి అంశాలన్నీ దృష్టిలో పెట్టుకుని, కార్టూన్లు పుంఖాను పుంఖాలుగా వేశాను. వాటిలో పోయినవి పోగా ఇప్పటికే ఆరేడు కార్టూన్ సంపుటాలు వచ్చాయి."

బాలి మంచి కథా రచయిత. చాలా సూక్ష్మమైన పరిశీలతో జీవితాన్ని వడపోసిన కథలు 35 వరకూ రాశారు. అవి ఇటీవల కథల సంపుటిగా వెలువడ్డాయి. అలాగే తన ఆత్మకథను 'చిత్రమైన జీవితం' పేరిట రాసుకున్నారు.

**బాపు మెచ్చుకున్న సందర్భం**

వంగూరి ఫౌండేషన్ అమెరికా వారు 'బాలి కార్టూన్లు' అచ్చే శారు. దాన్ని హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ల్లో బాపు చేత ఆవిష్కరింపజేశారు. ఆయన ఆ పుస్తకాన్ని అలవోక గా అటూ ఇటూ తిరగేస్తుంటే బాలి 'దాన్ని కొంచెం ఓపిగ్గా ఒకసారి చూడండి సార్!' అన్నారు. దానికి ఆయన 'బాలీ! మీకు తెలియకపోవచ్చు, నేను మీ బొమ్మల అభిమానిని. ఇదే కాదు కడప రెడ్డిగారి 'కాళిదాస శృంగార తిలకం' పుస్తకానికి మీరేసిన బొమ్మలు అద్భుతం' అన్నారు. ఆ కాంప్లిమెంట్‌కు బాలి ఎంతో సంతోషపడ్డారు.

తన మీద ఏ చిత్రకారుడి ప్రభావమూ లేదని బాలి చెప్పే వారు. "నేను ఎవర్నీ అనుకరించను. తెలుగులో బాపు దగ్గర్నుంచీ తమిళ, బెంగాలీ ఆర్టిస్టుల బొమ్మలన్నింటినీ గమనించేవాణ్ణి. ఇటు ఇండియన్, అటు ఫారిన్ ఆర్టిస్టుల్లో ఎవరి ప్రత్యేకతలు వారికున్నాయి. నా వరకు నేనైతే ఒక సంఘటనని తీసుకోవడం, దానిని చిత్రంగా మలచుకోవడం.. నా అనుభవం మీదే ప్రాక్టీస్ చేశాను. అప్పటికప్పుడు కొన్ని వివరాలు, విశేషాలు వెంటనే తట్టవు కనుక.. వాటికి సంబంధించిన ఫొటోలను భద్రపర్చుకుని, ప్రాక్టీస్‌లో ఉపయోగిస్తాను." అని ఒకసారి చెప్పారు.

బాలి బొమ్మల ప్రదర్శనలు చాలాచోట్ల జరిగాయి. అందు కున్న ప్రశంసలూ, సన్మానాలూ, అవార్డులూ చాలానే ఉన్నాయి. గుంటూరు కళాపీఠం 'చిత్రకళా సామ్రాట్' అనే బిరుదిచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'హంస' పురస్కారాన్ని అందించింది. న్యూజిల్యాండ్ బైబిల్ సొసైటీ ఆయన బొమ్మలకు ప్రత్యేక ప్రశంసలందించింది. జర్మనీ ఫ్రాంక్‌ఫర్ట్‌లో పర్యావరణంపై బాలి బొమ్మల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇలా ఎన్నో ఉన్నాయి. బాలి భౌతికంగా లేకపోవొచ్చు. ఆయన గీసిన చిత్రాలూ, రాసిన కథలూ తెలుగు సాహిత్య వాకిలిలో ప్రతినిత్యం శోభిస్తూనే ఉంటాయి.

**బాలి గారి కుటుంబం**

చిత్రకారుడు బాలి జీవన సహచరి ధనలక్ష్మి 2010లో చనిపోయారు. ఆమె లేని లోటు బాలిని తీవ్రంగా వేధించింది.

## సుప్రసిద్ధ సాహితీవేత్త, ఆచార్య రవ్వా శ్రీహరి కన్నుమూత




**సు**ప్రసిద్ధ సాహితీవేత్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రవ్వా శ్రీహరి 21.4.2023వ తేదీన కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. నల్లగొండ జిల్లా, వెల్వర్తికి చెందిన ఒక సామాన్య చేనేత కుటుంబంలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. 1943, సెప్టెంబరు 12న జన్మించిన ఆయన చి న్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. చెల్లెలు, తమ్ముడు గల ఆయనే ఆ ఇంటికి పెద్దగా మారారు. సురవరం ప్రతాపరెడ్డి, ఎం.నరసింగరావుల సహాయంతో యాదగిరి లక్ష్మీనృసింహ సంస్కృత విద్యాపీఠంలో చేరారు. తరువాత నగరంలోని సీతారాంబాద్‌లో కల సంస్కృత కళాశాలలో చదివారు. శరకోప రామానుజాచార్యులు, ఖండవల్లి నరసింహశాస్త్రి, అమరవాది కృష్ణమాచార్యుల వద్ద మహాభాష్యాంతం వ్యాకరణం చదువుకున్నారు. తరువాత వివేకవర్ధని కళాశాలలో తెలుగు పండితుడుగా చేశారు. క్రమంగా బి.ఏ., తెలుగు పండిత శిక్షణ చేశాక, ఎం.ఏ. తెలుగు, సంస్కృతం చేసి, 1967లో ఆంధ్ర సారస్వత పరిషత్తులో లెక్చరర్‌గా పనిచేశారు.

సారస్వత పరిషత్తు విద్యార్థులకు సంస్కృతం, తెలుగూ రెండూ బోధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో 1973లో ఉద్యోగంలో చేరడంతో ఆచార్య బిరుదురాజు రామరాజు సలహాతో తెలుగులో 'భాస్కర రామాయణం' మీద పరిశోధన చేసి పీహెచ్ పట్టాను అందుకున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 17 ఏళ్లు బోధన, పరిశోధనల్ని నిర్వహించిన శ్రీహరి ద్రావిడ విశ్వవిద్యా లయానికి 2002లో ఉపాధ్యక్షుడుగా నియమితుడయ్యా రు. 2011లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్–ఇంఛార్జ్‌గా పనిచేశారు.

బాలి తన పనిలో తాను ఉంటే ఇంటి విషయాలన్నీ ఆమె చక్కబెట్టు కునేవారు. "చిత్రకళలోనే కాకుండా ఎన్నో విషయాల్లో నా భార్య ధనలక్ష్మి సహకరించేది. నేను ప్రభుత్వోద్యోగం వదిలి పత్రికల్లోకి వెళ్తున్నానంటే ఏమాత్రం వెనక్కి లాక్కుండా, భవిష్యత్ గురించి భయపెట్టకుండా నాకు ఎంతో అండగా నిలిచింది. ఆమె నాకు దూరం కావడం నేను తేరుకోలేని విషాదమే." అని గుర్తు చేసు కునేవారు బాలి.

బాలి దంపతులకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి వైశాలి, అబ్బాయి గోకుల్. ఇద్దరూ ఉద్యోగాల రీత్యా అమెరికాలో ఉ న్నారు. కొద్ది నెలల క్రితం గోకుల్ నదీ ప్రమాదంలో తోటి వారిని రక్షించబోయి మృతి చెందాడు. ఈ సంఘటన బాలిని తీవ్రంగా కలిచివేసింది. మానసికంగా బాగా కృంగిపోయారు.■




# రైతు గొంతును ధ్వనించి .. ప్రశ్నించిన కవిత్వం

- జంధ్యాల రఘుబాబు
98497 53298

రైతు వస్తువుగా మారాడు. సినిమాల్లో కనబడని నాయకుడే రైతు. రైతు సమస్యల్ని తీసుకొని సినిమా తీస్తే సంపాదన కోట్లలోనే. మూడు గంటలలోపే అతడి సమస్యలన్నీ తీర్చి ఇంకో ప్రాజెక్టులోకి వెళ్ళిపోతాడు నాయకుడు. ఏసీ థియేటరులో వంద రూపాయలు పెట్టి పాప్‌కార్న్ తింటూ అందులో రైతుకు ఒక్కరూపాయ కూడా పోదన్న నిజం తెలియక, యాభై రూపాయల కూల్ డ్రింకు తాగుతూ, పొలాలకు నీరు అందడం లేదన్న విషయం తెలిసీ, రైతును ఉద్ధరించే కథ చూసి ఇంటికొచ్చి హాయిగా నిద్రపోతారు చాలామంది. అటు చూస్తే రైతుల మహోద్యమం. వారిని ఎలా బలపరచాలి, వారికి ఎలా సంఘీభావం ప్రకటించాలి, అసలు ఆ ఉద్యమం పై తానేమను కుంటున్నాడు ఇలాంటి ప్రశ్నలు వేధిస్తుంటే మనసులో పురుడు పోసుకున్న కవిత్వమే 'ఎవరు ద్రోహి?' సంపుటి. యువ కవి చౌశా పద్ద అంతర్మధనం ఇది.

రైతు ఉద్యమం జరుగుతున్న ప్రతిరోజూ ఆ సంఘటనల్ని కవిత్వం చేశాడు ఈ కవి. వాటన్నింటినీ 79 కవితల్లో కూర్చాడు. కొన్ని పక్కన పెట్టి ఉండవచ్చు కూడా. ప్రభుత్వం వైపు నుంచి రైతులను చర్చలకు పిలిచి విందు ఇస్తామన్నప్పుడు మేము రామంటారు రైతులు. అప్పుడు 'మంచి పని చేశారు/ విందుకో/ పంచభక్ష్య పరమాన్నాలకో/ రాలేదని/ సూటిగా చెప్పారు/ రక్తం మరిగిన/ పిశాచాల కూడు వద్దని/ జాతి గౌరవం పెంచారు' అనడమే కాదు 'ఉద్యమంలో/ వెన్ను చూపక/ విజేతలా నువు రావాలి' అని వెన్నుతట్టి ప్రోత్సహిస్తాడు. రైతులపై అసత్య ప్రచారాలు ఎక్కువైనప్పుడు వాటిని ఖండిస్తూ 'బురదను లెక్క చేయద్దు/ పోరాటం ఫలిస్తుంది/ ఉద్యమం వర్ధిల్లుతుంది' అని ధైర్య వచనాలు చెబుతాడు.

'రైతు ఛాలెంజ్' అంటూ కవే దాన్ని స్వీకరించాడు. స్టాండ్ విత్ ఫార్మర్ అంటాడు. 'ఇప్పుడు నేను/ ఛాలెంజ్ తీసుకుంటాను/ సామాజిక మాధ్యమాల్లో ధైర్యంగా పోస్ట్ చేస్తాను/ ఐస్ బకెట్/ గ్రీన్ ఇండియా/ టెన్ ఇయర్స్/ పిల్లో ఛాలెంజ్ లాంటి సిల్లీవి కాదు' మరి ఎలాంటివి అంటే 'కష్టజీవి పక్షాన నిలబడి/ అన్నం పెట్టే/ అన్నదాత ఛాలెంజ్ స్వీకరిస్తాను'. అంతేనా? 'మీలో ఎందరు/ నాతో వస్తారు/ ఎంతమంది ఛాలెంజ్ స్వీకరిస్తారు?/ సినిమా నటులారా/ క్రీడాకారులారా/ మీరెవరైనా కదులుతారా?/ ఆ ధైర్యం మీకుందా?' అంటూ కవి ఓ ఛాలెంజ్ కూడా విసురుతున్నాడు. తానెవరి పక్షాన ఉన్నాడో కవికి బాగా తెలుసు. అలాగే 'విజయమో వీరస్వర్గమో' కవితలో శభాష్ రైతు సోదరా అని సంబోధిస్తూ మీ ఉద్యమం ద్వారా 'నిద్రాణమైన జాతికి మీ సందేశం!/ ఆచరణీయం/ అవశ్యం!' అని కితాబునిస్తున్నాడు.

రైతు ఉద్యమం.. ఒకరోజు కాదు, సంవత్సరం పాటు నిజంగా ఈ ఉద్యమం కొనసాగుతుందా? సగటు జీవి రోజూ వేసుకునే ప్రశ్న. అందుకు సమాధానం 'ఆగుతుందా?' కవితలో ఇలా ఇస్తాడు కవి. 'అలజడి సృష్టిస్తే/ ఉన్మాదం రెచ్చగొడితే/ అరాచకం చెలరేగితే/ హింస రాజ్యమేలితే/ రక్తపాతం జరిగితే/ ఉద్యమం చల్లారుతుందా/ ఉద్యమకారులు ఊరుకుంటారా' పొత్తిళ్ళలోని పాపాయిని చూసుకున్నట్టు చూసుకోవల్సిన రైతులను అలా చూసుకోవడం మానేసి వారు చేస్తున్న ఉద్యమాన్ని ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేయాలని చూసే గుంటనక్కలకు, వారిని బలపరుస్తున్న మేధావులకు ఇంతకంటే ఏ విధంగా తెలియజేయాలి? 'రైతు సంకల్పం ముందు/ అన్నీ

ఓడిపోయాయ్/ ఢిల్లీ గడ్డపై/ వీరుడై నిలబడ్డ నిన్ను/ వాన చినుకులు ఏం చేస్తాయ్?/ పొలంలో/ జీవితంలో/ ఎన్ని విపత్తులు చూడలేదు/ ఎన్నింటిని ఎదుర్కోలేదు?' అంటూ 'వాన' కవితలో చెబుతాడు.

ఈ వర్గ దృక్పథం కవికి ఎలా వచ్చింది అన్న అనుమాన ముంటే 'రైతు కుటుంబం' కవిత చూస్తే అది తీరుతుంది. 'నేను రైతును కాకపోవచ్చు/ మా నాన్న రైతు/ మా తాత రైతు/ మా అమ్మ రైతు/ మా నానమ్మ రైతు/ మా ముత్తాత రైతు/ తరతరాలుగా మాది/ రైతు కుటుంబం' అనగానే తీరిపోలేదు. నికరంగా రైతు పక్షాన నిలబడ్డాడు. 'మా తిండి తింటూ/ మమ్మల్నే మోసం చేస్తూ/ మాపై నిందలువేస్తూ/ కుట్రలు పన్నుతూ/ కార్పొరేట్లకు అప్పగించాలన్న/ నీ తాపత్రయాన్ని/ ఏమనాలి?' అని ప్రశ్న కూడా వేస్తున్నాడు. ఈ ప్రశ్న ఒక్క ప్రభుత్వానికే కాదు, రైతు ఉద్యమాన్ని బలపరచకుండా బూర్జువాల కొమ్ము కాస్తున్న ప్రతి ఒక్కరికీ.

వాతావరణం అనుకూలంగా లేకపోయినా రైతు ఉద్యమం అకుంఠిత దీక్షతో సాగుతుంది. మరి ప్రభుత్వాన్ని పాలిస్తున్న పార్టీకి 'ఎన్ని నాల్కలు?' అంటూ కవి ప్రశ్న. 'చర్చలు.../ ఉ ండవని ఒకడు/ సిద్ధమని మరొకడు/ చట్టాలు మంచివని/ ఊకదంబుడు ఇంకొకడు/ మీడియాలో ప్రచారం/ ఎన్ని నాల్కలు?/ ఎన్ని వేషాలు?/ ఎన్ని నటనలు?' అని చివరిలో ఒక ప్రశ్న 'ఒకే పార్టీలో ఇన్ని ధోరణులా?' అని నీవు శత్రు పక్షాన నిలబడ్డవంటాడు. అందుకే 'వాడెవడైనా' కవితలో రైతు ఉద్యమంపై నిందలు వేసేవాడెవడైనా 'పార్టీ అయినా/ నాయకుడైనా/ కార్యకర్త అయినా/ ఆఖరికి.../ మా అన్న/ తమ్ముడైనా/ ఎవరైనా/ నాకు శత్రువే/ నాకు విరోధే/ వాడు దేశద్రోహే' అని చెప్పే ఈ కవిత, ఎవరు దేశ ద్రోహి? కవితలో... 'నిన్ను/ నిలదీసేవాడు/ ప్రశ్నించేవాడు/ ప్రతిపక్షాలు/ వామ పక్షాలు/ ఇతర మతాలు/ ఉద్యమించేవాడు/ నీకు గిట్టనివాడు/ కడుపు మండినవాడు/ పక్క దేశీయుడు/ నచ్చని ఆహారం తినేవాడు/ ఎన్.ఆర్.సీని వ్యతిరేకించేవాడు/ కశ్మీరీలు/ అందరూ... దేశద్రోహులే నీకు' అని చెబుతాడు. ఉద్యమం చేస్తున్న రైతులు దేశద్రోహులా, నువ్వు దేశభక్తుడివా 'ఎవరు ద్రోహి' అని నిలదీస్తాడు. పుస్తకంలో శీర్షిక కవితలివే అనుకోవాలి. అందుకే చివరిలో 'శత్రువుకు వ్యతిరేకంగా/ పోరాడాల్సిందే/ మట్టుబెట్టల్సిందే' అంటూ మార్గనిర్దేశనం చేస్తున్నాడు.

మామూలుగా స్వతంత్ర దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి వాహనాలతో పెరేడులు జరుగుతాయి రాజధాని నగరం ఢిల్లీలో. కానీ 'ట్రాక్టర్ల పరేడ్' కవితలో 'ఈ దేశంలోనే/ ఈ గడ్డపైనే/ ఎర్రకోట వీధుల్లోనే/ రైతన్నల ట్రాక్టర్ల కవాతు' ఎందుకు 'కడుపు కాలి/ రోడ్లెక్కి/ చలిలో/ చీకటిలో/ ఆకలితో నిరశిస్తూ/ నిరసిస్తే/ రైతు దేశద్రోహి/ శాంతి భద్రతలకు విఘాతం/ దేశానికి అవమానం/ పరువు గంగపాలు' ఇదే కదా 'నీ ప్రసంగపు తారకమంత్రం...' అని ప్రభుత్వాన్ని, నాయకులను ఎండగడ తాడు. 'ఆ నలుగురి కోసం?' అనే కవితలో నీ మిత్రుల కోసం దేశ భవిష్యత్తును, అమాయక రైతాంగాన్ని గ్రామీణ భారతాన్ని బలిపెడుతున్నావని బాధపడతాడు, ఆక్రోశిస్తాడు.

'ఏమి కవీ?' అని కవులను ప్రశ్నిస్తున్నాడు సాధారణ భాషలోనే. 'మీది కవి హృదయమా?/ ఎన్ని కవితలు రాశారు?/ ఎవరిపై చించారు?'. ఇక రైతుపై రాయని కవులకు 'దయచేసి../ కవినని ప్రచారం చేసుకోకండి/ మేకవన్నె పులిలా/ నటించకండి/ రైతన్నలను/ మోసం చేయకండి' అని చురక అంటిస్తున్నాడు. ఈ విషయం ఆలోచించాల్సిందే కదా. ఈ కవితా సంపుటిలో వస్తువు రైతు, అతడి బాధలు, అతడి పోరాటం. కవి రచనా శైలి గురించి, వచన కవితలో ఉండవలసిన ఇతర లక్షణాల గురించి ఇందులో వెదకవలసిన పని లేదు. చదువుతున్నవారికి అర్థమవ్వాలన్నదే కవి కోరిక. ప్రతి పేజీలో పక్క పక్కనే రెండు కాలాలు వేసి తాను పర్యావరణ మిత్రుడిగా కూడా కనిపిస్తాడు కవి. అందుకు అతడిని అభినందించాలి. ■



## డాక్టర్ రాధేయ కవితా పురస్కారం 2023

*ఒక తడి అనేక సందర్భాలు, తూనీగతో సాయం కాలం, నూర్జహాన్ కు ప్రేమలేఖ అనే మూడు కవితా సంపుటాల ద్వారా తెలుగు కవితా లోకంలో విలక్షణ కవిగా పేరుపొందిన కవి, పద చిత్రాల పదనిసలతో కవిత్వానికి అపూర్వ పరిమళాలు అద్దుతున్న కవి అయిన తెలుగు వెంకటేష్ (99853 25362) గారిని డాక్టర్ రాధేయ కవితా పురస్కారం 2023 కోసం ఎంపిక చేశాం. ఈ అవార్డులో 5000 నగదుతో పాటు ఘన సన్మానం ఉంటుంది. పురస్కార ప్రదాన తేదీ, వేదికను తరువాత తెలియజేస్తాం.*

**- డా.పెళ్లూరు సునీల్, డా.సుంకర గోపాలయ్య, దోర్నాదుల సిద్ధార్థ,**
**డాక్టర్ రాధేయ కవితా పురస్కార వ్యవస్థాపకులు**

## మహేశ్వరయ్య వర్ధంతి సభ




మహేశ్వరయ్య చిత్రపటానికి పూలదండ వేసి, నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

తెలుగు సాహిత్యంలో కవిత్వాన్ని, కథల్ని రాసి విశిష్టమైన సాహిత్యసేవ చేసిన నిఖార్సైన కవి మహేశ్వరయ్య అని వక్తలు కొనియాడారు. సాహితీస్రవంతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని టీజివి కళాక్షేత్రంలో 27.4.2023 గురువారం సాయంత్రం మహేశ్వరయ్య ద్వితీయ వర్ధంతి సభ జరిగింది. సభకు నగర ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. సాహితీస్రవంతి జిల్లా సహాయ కార్యదర్శిగానే కాక ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడుగా విశిష్ట సేవలందించి మంచి గురువుగా మహేశ్వరయ్యకు సమాజంలో స్థానం ఉందని వక్తలు కొనియాడారు. సభలో సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, కవులు డా.బాలశౌరి, డా.మల్లెపోగు వెంకట లక్ష్మమ్మ, మారుతీ పౌరోహితం, యంపి బసవరాజు, డి.అయ్యన్న, విజయులు తనగల, పెరికల రంగస్వామి, జెఎన్ శేషయ్య, పఠాన్ సుల్తాన్ ఖాన్ , నాగేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిని కాంక్షించేదే కవిత్వం



దాక్టర్ రాజేశ్వరమ్మ నుంచి బహుమతిని అందుకుంటున్న కె రామసుబ్బమ్మ

సమాజాభివృద్ధిని కాంక్షించేదే కవిత్వమని యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఈశ్వర్ రెడ్డి అన్నారు. సాహితీ స్రవంతి కడప నగరంలో సిపి బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించిన ఉగాది జనకవనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజ హితం కోరేదిగా సాహిత్యం ఉండాలని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులను ఉద్దేశించి మాట్లాడారు. సిపి బ్రౌన్ సంచాలకులు మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. ప్రాచీన కాలంలో నైనా, ఆధునిక కాలంలోనైనా సమాజానికి ఉపయోగపడే కవిత్వాన్ని స్వీకరించాలని సూచించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ.. జాషువా, గురజాడ, వేమన రచనలను ఉదహరించి ప్రక్రియ ఏదైనా అది సమాజ హితం కోరేదై ఉండాలని తెలిపారు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్ మాట్లాడుతూ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కవిసమ్మేళనాలు నిర్వహించి నూతన కవులను యువకులను సాహిత్యం వైపు నడిపించే విధంగా మరిన్ని కార్యక్రమాలను చేపడతామని అన్నారు. అనంతరం డాక్టర్ రాజేశ్వరమ్మ కవితల పోటీలో పాల్గొని కురుకూటి సుబ్బరాయుడు పురస్కారాన్ని పొందిన కె రామసుబ్బమ్మకు రూ.2000ల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం కవితల పోటీల్లో పాల్గొన్న బాల బాలికలకు బహుమతులు అందజేశారు. మద్దెల వినోద్, అమృతవల్లి, సాగర్, వేంపల్లి ప్రతాప్, స్వతంత్ర బాబు, రవీంద్రబాబు, కొత్తపల్లి రామాంజనేయులు, సి పి బ్రౌన్ లైబ్రరీ బాధ్యులు శివారెడ్డి, ప్రొద్దుటూరు భాష్యం స్కూలు నుంచి ముక్తియరున్నిస, హర్షిత తదితరులు పాల్గొన్నారు.





**సాహితీ స్రవంతి, జెవివి, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ జయంతి సభ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో 27.4.2023 సాయత్రం జరిగింది. సాహితీ స్రవంతి నాయకులు శంకరయ్య అధ్యక్షత వహించగా; ఆవుల బసప్ప, గద్వాల సోమన్న, నాగమణి, మాదన్న, అంపయ్య, సుధాకర్, ఎ.నాగేశ్వర రావు మాట్లాడారు. శ్రీశ్రీ సాహిత్య విశిష్టతను, ఇప్పటికీ వర్తించే ప్రత్యేకతనూ వివరించారు.**

## 'ఆహ్వానం' లక్ష్మి మృతి



ప్రముఖ రచయిత్రి, ఆహ్వానం మాసప పత్రిక సంపాదకురాలు సమయం సామ్రాజ్యలక్ష్మి (74) హఠాన్మరణం చెందారు. ఆహ్వానం లక్ష్మిగా, ఎస్ఎస్ లక్ష్మిగా సాహితీ ఎస్ఎస్ లక్ష్మి ప్రపంచానికి చిరపరిచితులైన లక్ష్మి, కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఉన్నారు. కార్డియాక్ అరెస్టుతో 17.4.2023వ తేదీన మృతి చెందారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామారావు ఆమె భర్త. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మెట్రిక్యులేషన్ మాత్రమే పూర్తిచేసిన లక్ష్మికి సాహిత్యంపై ఎనలేని అభిమానం. 'కళాతపస్వి' సంజీవదేవ్తో లేఖాసాహిత్యం చేశారు. సంజీవదేవ్పై అభిమానంతో తన కుమారుల్లో ఒకరికి ఆయన పేరుతో నామకరణం చేశారు. చలం సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. విజయవాడ, తెనాలి, గుడివాడల్లో సాహిత్య గోష్టులు నిర్వహించారు. సాహిత్య కార్యక్రమాల్లో మునిగితేలుతూ 'భారతి' పత్రిక స్థాయిలో సాహిత్య పత్రికను తీసుకురావాలనే తలంపుతో విజయవాడ కేంద్రంగా 'ఆహ్వానం' మాసపత్రికను స్థాపించారు. 15 ఏళ్లపాటు నడిపారు. ప్రతి నెలా సంపాదకీయాన్ని తానే రచిస్తూ వచ్చారు. సాహితీప్రపంచం ఆదరణ పొందినా, ఆర్థికంగా నష్టపోవడంతో చివరకు మూసేయక తప్పలేదు.

## గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి హఠాన్మరణం



ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రపై సాధికారత కలిగిన విమర్శకుడు, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆచార్యుడు గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి (56) హఠాన్మరణం చెందారు. 24.4.2023 సోమవారం ఉదయం హైదరాబాదులో స్వగృహంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు. బాల శ్రీనివాసమూర్తి స్వస్థలం సిద్దిపేట. తండ్రి అష్టావధాని గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ జీవిత చరిత్రను 'జీవన హిందోళం' పేరుతో ఆయన అక్షరీకరించారు. బాల శ్రీనివాసమూర్తి భార్య శైలజ. వీరి కుమార్తె హంసిక, కుమారుడు గౌతమ్ సాఫ్ట్వేర్ ఉద్యోగులు. 'తెలంగాణం–తెలుగు మాగాణం', 'ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ' పరిశోధనాత్మక గ్రంథాలను ఆయన రాశారు. 'వానమామలై వరదాచార్య, 'విలక్షణ పీవీ' జీవిత చరిత్రలు.. 'తెలుగు వారి చరిత్ర మైలురాళ్ళు – మణిదీపాలు', '65 ఏళ్ళ నాటి అలంపురం సభలు', 'మా ప్రసిద్ధిపేట' తదితర రచనలు చేశారు. ఆయన సంపాదకత్వంలో 'తెలంగాణ వైతాళికులు' మూడు సంపుటాలు, 'తెలంగాణ సాహిత్య చరిత్ర' పేరుతో మరో మూడు సంపుటాలు వెలువడ్డాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి 'తెలంగాణలో సాహితీ సాంస్కృతిక చైతన్యం–పత్రికల పాత్ర' అంశంపై పరిశోధన చేసి పీహెచ్డీ పొందారు.




**విజయనగరం ఎన్కె పబ్లికేషన్స్ ముద్రించిన 'కథా పరిమళాలు' (58 కథకుల కథా సంకలనం) పుస్తకావిష్కరణ 23.4.2023 తేదీన విశాఖపట్నం కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. ఈ సంకలనానికి ఎన్కె బాబు సంపాదకులు. డాక్టర్ పెదవీర్రాజు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో అడపా రామకృష్ణ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సంకలనంలో కథ ప్రచురితమైన రచయిత బొడ్డు కూర్మారావు పుస్తక ప్రతిని అందుకుంటున్న దృశ్యం ఈ చిత్రంలో చూడొచ్చు.**

# అబ్బూరి రామకృష్ణారావు

జననం : 30.05.1896 మరణం : 30.04.1979



తొలితరం అభ్యుదయ వాది. రచయిత, నాటక కర్త.
శ్రీశ్రీకి స్ఫూర్తినిచ్చిన వ్యక్తి. తెలుగునాట సాహిత్యంలో
తొలినాళ్ళలో కమ్యూనిస్టు భావాల వ్యాప్తికి కారకుడు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 4 ▪ SANCHIKA - 8 ▪ KRISHNA ▪ May 2023
RNI NO.APTEL/2004/18396 ▪Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ▪ Date of Publication : 27.04.2023

